www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

లలితా జ్యువెల్లరి మార్ట్ లిమిటెడ్
తగ్గింపు ధమాకా
కడప • వైజాగ్ • గోపాలపట్నం • విజయవాడ
విజయనగరం • గాజువాక • రాజమహేంద్రవరం
భీమవరం • కాకినాడ • తిరుపతి • అనంతపురం
గుంటూరు • శ్రీకాకుళం • ఒంగోలు • నరసారావుపేట
చిత్తూరు • అనకాపల్లి • సూళ్లూరుపేట • గూడూరు
నెల్లూరు • కర్నూలు • అమలాపురం • తుని
హైదరాబాద్ (సోమాజిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | కూకట్‌పల్లి | చందానగర్ | సుచిత్రా సర్కిల్) • నిజామాబాద్ • వరంగల్ • మిర్యాలగూడ
డబ్బులు ఎవరికీ ఊరికే రావు!

శనివారం | 1-2-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 287 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: తదియ ఉ. 11.39 తదుపరి చవితి; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 2.33 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: ఉ. 10.11-11.40; దుర్ముహూర్తం: ఉ. 6.50-8.20; అమృతఘడియలు: రా. 7.06-8.35; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 6.06 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


మీ లలితా జ్యువెల్లరిలో.. మార్కెట్ లోనే అధిక ఆదాయం అందించే
2 నగల కొనుగోలు పథకాలు
FREE & FLEXI
11 నెలల
'నగలు కొనుగోలు పథకం'!
బంగారం ధర
పెరిగినా మీకే లాభం,
తగ్గినా మీకే లాభం
100%
తరుగు లేదు
అన్ని బంగారు నగలు, అన్‌కట్ వజ్రాభరణాలు
మరియు వెండి వస్తువులకు వర్తిస్తుంది.
బంగారం ధర పెరిగినా మీకే లాభం,
తగ్గినా మీకే లాభం
వజ్రాభరణాలకు ప్రత్యేక ఆఫర్ కలదు!
చిన్న వాయిదాలు:
రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500 / రూ.5000
రూ.10000 / రూ.15000 / రూ.20000 / రూ.25000
BOSS
Lalithaa
EXCHANGE UTSAV
అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్
ఖర్చు లేకుండా,
ముందుగా పాత నగలు ఇచ్చి,
కొత్త నగలు తీసుకోవచ్చు!
100%
తరుగు లేదు
5వ నెల ఆఖరు నుంచి, కొనే నగను బట్టి,
తరుగు (V.A.) లేకుండా నగలు కొనొచ్చు.
11 నెలల తర్వాత నగలు తీసుకొంటే ఏ బంగారు నగ అయినా కానీ,
తరుగు ఛార్జీలు ఇవ్వాల్సిన పనిలేదు.
కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్,
ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.
పాత నగలతో మాత్రమే కాదు.
నగదు చెల్లించి కూడా ఈ స్కీమ్‌లో చేరొచ్చు!
అన్ని బంగారు నగలపై
మార్కెట్ కంటే మా తక్కువ తరుగులో ఇంకా
1% తగ్గింపు
వజ్రాభరణాలు
క్యారెట్‌కు రూ. 5000 తగ్గింపు
1 Carat = 200 Milligrams
ఇతర షోరూం మాదిరిగా తరుగు మరియు మజూరి వంటి రెండు ఛార్జీలు వేయడం లేదు.
V.A. మాత్రమే.. అది కూడా మార్కెట్‌లో కంటే తక్కువ!
నాణ్యత సర్టిఫికెట్ | కలర్ & క్లారిటీ | ఎక్స్ఛేంజ్ పాలసీ
వెండి వస్తువులకు
ప్రత్యేక తగ్గింపు.
Lalithaa®
www.lalithaajewellery.com
లలితా జ్యువెల్లరి మార్ట్ లిమిటెడ్
Customer Care
90 99 999 916
BIS 916 హాల్‌మార్క్ ఆభరణాల డిజైన్స్!

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


అరకు ఉత్సవ్‌ను తుడుము కొట్టి ప్రారంభిస్తున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్

ఘనంగా అరకు చలి ఉత్సవ్
ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయ ప్రదర్శనలు
ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్ రైడ్
14

శనివారం | 1-2-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ధరలు దిగొస్తాయ్!
కేంద్ర ఆర్థిక సర్వే ఆశాభావం

కూరగాయల ధరలు తగ్గడంతోపాటు ఖరీఫ్ పంట చేతికి రానుండటంతో మార్చి చివరి నాటికి ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టనుందని ఆర్థిక సర్వే 2024-25 అంచనా వేసింది. గ్రామీణ మార్కెట్ గిరాకీ, పెరిగిన పంట దిగుబడి స్వల్పకాలిక వృద్ధికి దోహదపడనున్నాయని పేర్కొంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్ల మెంటులో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించాలంటే వచ్చే రెండు దశాబ్దాలపాటు 8% వార్షిక వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. దీనికోసం తయారీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని, కృత్రిమ మేధ, రోబోటిక్స్, బయో టెక్నాలజీ రంగాల్లో విస్తృత పెట్టుబడులు అవసరమని సూచించింది. 2030-32 వరకు వ్యవసాయేతర రంగాల్లో 78.5 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించాల్సి ఉందని పేర్కొంది. 2024-25లో జీడీపీ వృద్ధి రేటు 6.3-6.8% మధ్య నమోదయ్యే అవకాశం ఉందని ఆర్థిక సర్వే అంచనా వేసింది.
10



- మార్చి నాటికి ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.3-6.8% వృద్ధి
- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు 8% వృద్ధి అవసరం
- పెట్టుబడులను జీడీపీలో 35 శాతానికి పెంచాలి
- ఏఐ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ రంగాల్లో మరిన్ని పెట్టుబడులు
- 2030-32 వరకు ఏటా 78.5 లక్షల కొత్త కొలువుల్ని సృష్టించాలి
- దేశంలో వ్యాపార నిర్వహణను ఇంకా సులభతరం చేయాలి
- ఆర్థిక సర్వేను పార్లమెంట్‌కు సమర్పించిన మంత్రి సీతారామన్
- **నేడే కేంద్ర బడ్జెట్.. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న నిర్మల**

పేదలు, మధ్యతరగతిపై లక్ష్మీదేవి ఆశీస్సులుండాలి
బడ్జెట్ ముందు మోదీ వ్యాఖ్య
ఆవిష్కరణలు, అభివృద్ధే మా ఆర్థిక విధానానికి ఆధారం
తొలిసారి విదేశీ జోక్యం లేదు.. కాంగ్రెస్‌పై విసుర్లు
11

కేంద్ర బడ్జెట్‌లో మనకెంత?
ఏ శాఖకు ఎన్ని నిధులొస్తాయి?
నేటి మధ్యాహ్నంకల్లా వివరాలివ్వాలి
ప్రభుత్వ విభాగాలకు రాష్ట్ర ఆర్థిక శాఖ నిర్దేశం
కేంద్ర కేటాయింపులపై కసరత్తు
12
'పూర్వోదయ' ప్రయోజనాలపై ఆశలు



పాపం ముర్ము.. పూర్ లేడీ!
రాష్ట్రపతిపై సోనియా వ్యాఖ్యలు.. ముర్ము ప్రసంగం బోరింగ్ అన్న రాహుల్
ప్రధాని, బీజేపీ నేతల ఆగ్రహం.. 10 కోట్ల మంది గిరిజనులకు అవమానం
కాంగ్రెస్ రాచకుటుంబం మరింత దిగజారింది
అభివృద్ధిపై మాట్లాడితే విసుగు.. అర్బన్ నక్సల్స్ మాటలైతే ఆసక్తి: మోదీ
కాంగ్రెస్ అగ్ర నేతల వ్యాఖ్యలకు రాష్ట్రపతి భవన్ ఖండన

జూన్‌లోపు
ముచ్చటగా మూడు
తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు అమలు
'సూపర్ సిక్స్'పై చంద్రబాబు కీలక నిర్ణయం
రాజకీయ, వేధింపు హత్యలపై ప్రత్యేక ట్రైబ్యునల్
టీచర్లు, ఉద్యోగులు, పాత్రికేయులపై అక్రమ కేసుల తొలగింపు


వాసవీ మాత ఆత్మార్పణ దినం సందర్భంగా శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో వాసవీ కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు చేస్తున్న చంద్రబాబు

- కార్యకర్తల పెండింగ్ బిల్లులు త్వరలో చెల్లింపు
- ఆలయాలపై దాడులు చేసినవారిని గుర్తించడానికి కార్యాచరణ
- జిల్లాల పునర్విభజనపై పరిశీలన
- కరెంటు చార్జీలు ఏడాదికి 35 పైసల చొప్పున తగ్గింపు!
- కిమ్స్ ఆధ్వర్యంలో అమరావతిలో మెడికల్ వర్సిటీ
- వినుకొండలో వైద్య శిక్షణ కేంద్రం
- ఈసారి కడపలో మహానాడు
- వైసీపీ నేతల చేరికలపై కూటమిలో త్వరలో చర్చ
- టీడీపీ పొలిట్ బ్యూరో భేటీలో కీలక నిర్ణయాలు

వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు తెరిచేలోపు ఎంత మంది పిల్లలు వాటిలో చదువుతూ ఉంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15 వేల వంతున 'తల్లికి వందనం' పేరుతో చెల్లిస్తాం. కేంద్రం ఇచ్చే మొత్తంతో కలిపి రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం కింద రూ.20 వేలు. జూన్ లోపు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం కూడా అమలు.

వచ్చే జూన్‌లోపు నామినేటెడ్ పదవులన్నీ భర్తీ. సహకార సంస్థలు, మార్కెటింగ్ సంస్థలు, ఆలయాలు మొదలైన వాటిలో పదవులన్నీ నింపుతాం. - టీడీపీ పొలిట్‌బ్యూరో

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో మూడింటిని వచ్చే జూన్ లోపు అమలు చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో నిర్ణయించింది. తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఈ జాబితాలో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. ఆ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విలేకరులకు తెలియజేశారు. వైసీపీ పాలన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీల

మిగతా 13వ పేజీలో...

'స్వర్ణాంధ్ర' సాధనలో భాగస్వాములు కండి!
ఆర్యవైశ్యులకు చంద్రబాబు పిలుపు
త్యాగం, శక్తికి ప్రతీక వాసవీ మాత: సీఎం
పెనుగొండలోని వాసవీ ధామ్ సందర్శన
అమ్మవారికి తొలిసారి పట్టువస్త్రాల సమర్పణ
కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు 13
కల్లుగీత కార్మికులతో మాట్లాడిన చంద్రబాబు

త్వరలో దేశంలోనే అతిపెద్ద గోల్డ్‌హబ్
మంగళగిరిలో మినీ దుబాయ్!



ముంబైకి దీటుగా ఏర్పాటుకు సన్నాహాలు.. 60 ఎకరాల్లో జెమ్స్-జ్యువెలరీ పార్కు
12 వేలమంది స్వర్ణకారులకు ఉపాధి.. లోకేశ్ సొంత ఖర్చులతో గోల్డ్‌స్మిత్ ఫౌండేషన్
స్వర్ణకారులకు డిజైన్లపై శిక్షణ.. అంతర్జాతీయ ప్రమాణాలతో ఆభరణాల తయారీ

(మంగళగిరి-ఆంధ్రజ్యోతి)
రాష్ట్ర రాజధాని పరిధిలోని మంగళగిరి రూపురేఖలు మారుతున్నాయి. ఇప్పటికే ఎయిమ్స్, ప్రముఖ విద్యా సంస్థలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సంస్థలు ఇక్కడ కొలువుదీరాయి. త్వరలో దేశంలోనే అతిపెద్ద గోల్డ్‌హబ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దేశంలో నవీముంబైతో పాటు కోల్‌కతా, కోయంబత్తూరు వంటి నగరాల్లో ఇలాంటి జ్యూయలరీ పార్కులున్నాయి. వీటిలో ముంబైలోని జ్యూయలరీ పార్కు వ్యాపార రీత్యా అతిపెద్ద వాణిజ్య కేంద్రంగా

మిగతా 14వ పేజీలో...

జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు (ఊహాచిత్రం)



కర్నూలులోని కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బారులుదీరిన జనం

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల జాతర
రాష్ట్రవ్యాప్తంగా కార్యాలయాలు కిటకిట
శుక్రవారం ఒక్కరోజే వేలల్లో రిజిస్ట్రేషన్లు
ఒక్క కాకినాడ జిల్లాలోనే 1,150 నమోదు
అన్ని జిల్లాల్లో వందలకొద్దీ... 13
అర్ధరాత్రి వరకూ కొనసాగిన ప్రక్రియ
చాలాచోట్ల మొరాయించిన సర్వర్లు
నేటి నుంచి భూముల ధరలు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనుండటంతో జనం క్యూ
సర్కారుకు రూ.కోట్లలో ఆదాయం

ఆమదాలవలసలో థర్మల్ కేంద్రం
1600 ఎకరాల్లో 30 వేల కోట్లతో నిర్మాణం
సర్వే పూర్తి.. సిద్ధమవుతున్న డీపీఆర్ 14

భూమికి 'బంధనాలు'!


- సామాన్యుల భూములకు లభించని విముక్తి
- జగన్ హయాంలో అడ్డగోలుగా 'ఫ్రీ హోల్డ్'
- నిషేధిత జాబితా నుంచి ఎడాపెడా తొలగింపు
- మూకుమ్మడి దరఖాస్తులతో భూములు స్వాహా
- అసైన్డ్ చట్ట సవరణతోనూ అదే దందా
- కూటమి సర్కారు రాగానే విచారణ
- నేడు చిన్నరైతుల భూమికీ చిక్కులు
- 7 నెలలుగా ఏటూ తేల్చని రెవెన్యూశాఖ
- రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయి నానా తిప్పలు
- సాగదీత సరికాదంటున్న నిపుణులు

జగన్ హయాంలో గంపగుత్తగా వందలకొద్దీ దరఖాస్తులు ఇచ్చేసి వేల ఎకరాలను నిషేధ జాబితా నుంచి తొలగించారు. ఇదో భారీ భూదందా! కూటమి సర్కారు వచ్చాక... ఆ భూములపై లావాదేవీలు నిలిపివేసింది. విచారణకు ఆదేశించింది. అయితే.. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే! ఈ క్రమంలో.. సామాన్యులకు చెందిన ఎకరం, అరెకరం కూడా బంధనాల్లో ఇరుక్కున్నాయి.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
జగన్ హయాంలో అడ్డగోలుగా సాగిన 'నిషేధ భూముల' విముక్తి ఇప్పుడు చిన్న, సన్నకారు రైతులకూ కష్టం తెచ్చిపెట్టింది. జరిగిన అక్రమాలను సరిదిద్దే క్రమంలో... 'ఫ్రీ హోల్డ్' భూముల రిజిస్ట్రేషన్ల లావాదేవీలపై కూటమి సర్కారు నిషేధం విధించింది. నెలలు గడుస్తున్నప్పటికీ ఈ నిషేధం కొనసాగుతూనే ఉంది. దీంతో... సామాన్య రైతులూ ఇక్కట్లు పడుతున్నారు. రెవెన్యూ శాఖలో 'చుక్కల భూములు' (22ఏ జాబితాలో ఉన్నవి) ఓ ఎడతెగని సమస్య! అసైన్డ్ భూములతోపాటు ప్రభుత్వ భూములు, అనుమానాస్పద భూములను ఈ జాబితాలో చేర్చుతారు. భూములను నిషేధ జాబితా నుంచి తొలగించేందుకు నిర్దిష్ట విధానాన్ని అనుసరించాలి. జగన్ హయాంలో భూములు భోంచేసేందుకు 'నిషేధ జాబితా'ను కూడా వాడుకున్నారు. పదులు, వందల సంఖ్యలో దరఖాస్తులు సమర్పించేసి... భారీ స్థాయిలో నిషేధ భూములను సొంతం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా పరిశీలన చేసి... భూములను 'ఫ్రీ హోల్డ్' చేశారు. ఇక... 2023లో ఏపీ అసైన్‌మెంట్ భూముల చట్టానికి కూడా జగన్ సవరణ చేశారు. అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాత వాటికి శాశ్వత యాజమాన్య హక్కులు కల్పిస్తూ జీవో 596ను ఇచ్చారు. దీని ప్రకారం

మిగతా 13వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చిక్కుల్లో ఆర్థికం...!

దేశ ఆర్థిక వ్యవస్థ గత కొన్ని సంవత్సరాలతో పోల్చితే కొంత చిక్కుల్లో ఉన్నదన్న విషయం శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే తేల్చి చెప్పింది. మన ఆర్థిక వృద్ధిరేటు ఇప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నింటితో పోల్చితే బలంగానే ఉన్నప్పటికీ దేశీయంగాను, అంతర్జాతీయంగాను పలు సవాళ్లు రాబోయే కాలంలో ఆ జోరుకు పగ్గాలు వేయవచ్చునన్న సంకేతాలు వెలువరించింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి వృద్ధిరేటు 6.3 నుంచి 6.8 శాతం మధ్యన ఉండవచ్చునని అంచనా వేసింది. 2047 నాటికి వికసిత్ భారత్ కావాలన్న లక్ష్యం నెరవేరాలంటే ఈ వృద్ధిరేటు ఏ మాత్రం సరిపోదు. ఏడాదికి సగటున ఎనిమిది శాతం వృద్ధిని సాధిస్తే తప్ప మనం ఆ లక్ష్యాన్ని చేరడం సాధ్యం కాదు.

గత కొన్నేళ్లుగా ఉన్న సానుకూలతలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం, యూరోపియన్ ఆర్థిక వ్యవస్థల్లో మందగమనం వల్ల ఎగుమతుల రంగం ఎదురీదుతోంది. ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యంలో భారత దేశం వాటా కేవలం 2 శాతం ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మన ఎగుమతుల వృద్ధిరేటు 1.6 శాతానికే పరిమితం అయింది. దీనికి తోడు కొత్తగా రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన అమెరికా అధ్యక్షుడు ఆత్మరక్షణ విధానాలకు పెద్ద పీట వేస్తున్నారు. దీని వల్ల అమెరికాకు ఎగుమతులు మరింతగా తగ్గే అవకాశం ఉంది. ఇవన్నీ విదేశాల నుంచి ఎదురవుతున్న సవాళ్లయితే దేశీయంగా ద్రవ్యోల్బణం పెనుభూతంగా ఉంది. గత ఏడాది రుతుపవనాల సానుకూలత కారణంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కొనుగోలుశక్తి పెరిగినప్పటికీ నగర జీవులు మాత్రం ధరల కాటుకు విలవిలలాడుతూనే ఉన్నారు. ఫలితంగా వారి కొనుగోలు శక్తి తగ్గిపోయింది. పెరిగిన ద్రవ్యోల్బణాన్ని తట్టుకోగల రీతిలో వారి వేతనాలు పెరగడంలేదు. ఈ అస్థిరతల నుంచి బయటపడి నిలకడ వృద్ధిరేటు సాధించాలంటే భిన్న రంగాల్లో సంస్కరణలు చేపట్టక తప్పదన్న విషయం ఆర్థిక సర్వే నివేదికలో తేల్చి చెప్పారు. దేశీయంగా వృద్ధికి ఊతం ఇచ్చే రంగాలను ఉత్తేజితం చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రధానంగా వాణిజ్యం, ఎగుమతులు, పారిశ్రామిక రంగాల విషయంలో నియంత్రణలు సడలించడం, సుంకాలు హేతుబద్ధం చేయడం వంటి చర్యలు తీసుకోవాలన్నది ఆర్థిక సర్వే సారాంశం. దేశంలో ఉపాధికి వెన్నుదన్నుగా నిలుస్తున్నది ఎంఎస్ఎంఈ రంగమే. ఈ రంగంలో ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు మితిమీరిన నియంత్రణలను సడలించి పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించాలని సర్వేలో సూచించారు. అలాగే దేశంలో ఇప్పటికీ పప్పుదినుసులు, వంటనూనెల కొరత అధికంగా ఉంది. ఆ కొరతను అధిగమించేందుకు ఇప్పటికీ భారీ పరిమాణంలో వాటిని దిగుమతి చేసుకుంటున్నాం. అవసరాన్ని మించి తృణధాన్యాలు ఉత్పత్తి చేయడాన్ని నిలువరించి పప్పులు, నూనెగింజల ఉత్పత్తిని పెంచడం అవసరమన్న విషయం సర్వే తేల్చి చెప్పింది. ఒకపక్క మార్కెట్ ధరల్లో ఆటుపోట్ల నుంచి రైతులకు రక్షణ కల్పించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు కావడంతో పాటు మరోపక్క సాధారణ గృహస్థులకు రక్షణ కల్పించే సమాంతర వ్యవస్థ ఒకటి ఉండాలని సూచించింది. ఇక ఎగుమతులు ఉత్తేజితం చేయాలంటే వాణిజ్య సంబంధిత వ్యయాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పారు. అప్పుడే భారత్ పోటీ సామర్థ్యం పెంచుకోగలుగుతుంది. ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావాలంటే మధ్యతరగతి ప్రజల ఆదాయాలు పెరగాలని, కంపెనీలు వేతనాల పెంపునకు చర్యలు తీసుకోవడం అవసరమన్న విషయం నాగేశ్వరన్ ఒక చక్కని ఉదాహరణ ద్వారా చెప్పారు. వేతనాల్లో అరకొర వృద్ధి ఉన్నట్టయితే తాను ఉత్పత్తి చేస్తున్న కార్లు అమ్ముడుపోవని ఫోర్డ్ మోటార్ కంపెనీ వ్యవస్థాపకుడు హెన్రీ ఫోర్డ్ గుర్తించారని వ్యాఖ్యానించడం ద్వారా కార్పొరేట్లు లాభాలు మూటగట్టుకుంటే సరిపోదని, దాన్ని ఉద్యోగులకు కూడా వేతన వృద్ధి రూపంలో పంచినప్పుడే ఆర్థిక వృద్ధికి దోహదకారులవుతారని ఆయన స్పష్టంగా సూచించారు. మొత్తం మీద ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడి దేశం స్థిరమైన వృద్ధిరేటు సాధించే దిశగా అడుగేయాలంటే సంస్కరణలను ఆశ్రయించక తప్పదు. ఒక పక్క వ్యయాలను నియంత్రించుకుంటూ మరోపక్క స్థిరమైన వృద్ధిని కొనసాగించడం ద్వారా వికసిత్ భారత్‌కు బాటలు వేయడం అనేది కత్తిమీద సాము అనక తప్పదు. ఆర్థిక సర్వేలో సూచించిన భిన్న మార్గాల్లో పయనిస్తూ దేశ ఉజ్వల భవిష్యత్తుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేటి బడ్జెట్లో ఏ విధమైన బాటలు వేస్తారన్నది వేచి చూడాలి.

అమిత్‌షా కల ఫలిస్తుందా?

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో భారత కేంద్ర హోం మంత్రి అమిత్ షా 'మావోయిస్టు రహిత భారత్ అనే స్వప్నం సాకారమవుతోంది' అని ప్రకటించారు. గరియాబంద్ ఎన్‌కౌంటర్ తర్వాత దేశంలో 'మావోయిస్టు ఉద్యమం కొనఊపిరితో ఉంద'ని అన్నారు. ఈ మాటలన్నీ మావోయిస్టు ఉద్యమానికి, భారత ప్రభుత్వానికి మధ్య రాజకీయార్థిక రంగంలో, భావజాల సాంస్కృతిక రంగాల్లో జరుగుతున్న సంఘర్షణకు వ్యక్తీకరణ మాత్రమే. అసలు ఎన్‌కౌంటర్ ఘటనలే ఆ సంఘర్షణ వ్యక్త రూపాలు.

రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సరే మావోయిస్టు ఉద్యమ అణచివేతను కేంద్రమే చూసుకుంటోంది. ఇంతకు ముందు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆదివాసీ ప్రాంతాల మీద వైమానిక దాడులు చేశాయి. ప్రజల మీద రాకెట్ లాంచర్లను ప్రయోగించాయి. దేశ సరిహద్దుల్లో ఉండే సైనిక బలగాలు ఛత్తీస్‌గఢ్ అడవులకు చేరుకున్నాయి. అత్యాధునిక సాంకేతికతను వాడి విప్లవకారుల కదలికలు తెలుసుకొని వేల సంఖ్యలో భద్రతా బలగాలు చుట్టుముట్టి కాల్చేశాయి. ఈ విడత ఆ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. అణచివేత మరింత తీవ్రమైంది.

మామూలుగా ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని కోరుకుంటాం. సంక్షేమ బాధ్యతలు నిర్వర్తించాలని ఆశిస్తాం. కానీ భారత రాజ్యం, కార్పొరేట్ పెట్టుబడి కలిసి కొనసాగుతున్నాయి. వనరుల మీద, మానవుల శ్రమశక్తి మీద అధికారం ఉన్న కార్పొరేట్ వర్గపు రాజకీయార్థిక సామాజిక సాంస్కృతిక ప్రయోజనాలన్నీ భారత రాజ్యంలో ప్రతిఫలిస్తున్నాయి. అడవులను, గనులను, సముద్ర తీరాలను, ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజల ఆస్తులను అదాని, అంబానిలాంటి కార్పొరేట్లకు ఇచ్చేస్తున్నారు. ఈ పాలనా విధానాలు, చట్టాలు, వాటి అమలు కోసం చేస్తున్న సైనిక చర్యలు అన్నీ కార్పొరేట్ రాజ్యపు సారభూత వ్యక్తీకరణలు. సనాతన, సామ్రాజ్యవాద మేలు కలయికగా ఈ వ్యవస్థను యథాతథంగా ఉంచడం రాజ్యం అసలు లక్ష్యం. కార్పొరేట్ దోపిడీని, సనాతనత్వంలోని హింసా పీడనలను బలోపేతం చేయడం బీజేపీ ఆశయం. ఇది ఇట్లా ఉంటూనే చాలా మార్పులు రావచ్చు. అవన్నీ పాత అసమానతలను నిలబెట్టి, కొత్త అసమానతలు తీసుకొచ్చేవే.



మావోయిస్టు ఉద్యమంతో భారత రాజ్యానికి అక్కడ పేచీ ఉన్నది. ఫాసిజానికి మిగతా అన్ని ప్రజాతంత్ర ఉద్యమాల మీద ఆగ్రహం ఉన్నప్పటికీ మావోయిస్టు ఉద్యమంలోని మిలిటెన్సీ, త్యాగనిరతి, విశాలమైన ప్రాపంచిక దృక్పథం, ముఖ్యంగా మానవ జీవితాన్ని సరికొత్తగా నిర్మించగల భవిష్యత్ దర్శనం దానికి చుక్కెదురు. పార్లమెంటరీ పార్టీలన్నిటినీ ఓడించేశక్తి దానికి ఉన్నదని గత మూడు సాధారణ ఎన్నికల్లో రుజువైంది. బీజేపీ మీద కొద్దిపాటి వ్యతిరేకత వ్యక్తమైనా మొత్తం మీద సానుకూలంగానే ఉన్నది. దేశంలో ఫాసిస్టులకు అంకెకు రాని ఒకే ఒక శక్తి మావోయిస్టు ఉద్యమం. అది ఆ ఉద్యమ ప్రాపంచిక దృక్పథంలో ఉన్నది. భావజాలంలో ఉన్నది. దాని రాజకీయ కార్యక్రమం వల్లే అనేక సమస్యలపై పోరాటాలు చేయగలుగుతున్నది. వివిధ పోరాట ప్రవాహాలకు ప్రేరణనిస్తున్నది. వాటికి ఉమ్మడి స్వభావాన్ని ఇస్తున్నది. సారాంశంలో రాజ్యాంగ పరిధిలో, దానికి బైటా జరుగుతున్న ప్రజా ఉద్యమాలు కార్పొరేటీకరణకు ప్రతిబంధకంగా తయారయ్యాయి. ఈ ఉద్యమాలు సనాతన భావజాలానికి వ్యతిరేకంగా హేతు వికాసానికీ తోడ్పడుతున్నాయి. ఫాసిస్టు పునాదుల మీద విప్లవోద్యమ ప్రత్యక్ష, పరోక్ష నాయకత్వంలో, ప్రభావాలతో ఉద్యమాలు జరుగుతున్నాయి. మావోయిస్టు ఉద్యమం రాజకీయ భావజాలశక్తిగా ఉన్నంత కాలం ఈ దేశాన్ని కార్పొరేట్ ఇండియాగా మార్చడం కష్టం.

ఒక రాజకీయార్థిక సామాజిక సాంస్కృతిక ఉద్యమంగా మావోయిస్టు పార్టీని నిర్మూలించగలరా? గత యాభై ఐదేళ్ల చరిత్రలో ఇలాంటి నిర్బంధాలను ఆ ఉద్యమం చవిచూసింది. అనేక క్లిష్ట దశలను దాటుకొని వచ్చింది. ఇక ముగిసిపోయిందని అనుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పలు ఆటుపోట్ల మధ్యనే కేంద్ర ప్రభుత్వానికి అతి ముఖ్యమైన టార్గెట్ కాగల స్థాయికి ఎదిగింది.

బీజేపీ ఏ ఏ జీవన రంగాల నుంచి కార్పొరేట్ హిందూ రాష్ట్రను స్థాపించాలని అనుకుంటున్నదో ఆ అన్ని తావుల నుంచి ప్రత్యామ్నాయ నిర్మాణం చేయగల చేవ, చూపు, చొరవ మావోయిస్టు ఉద్యమానికి ఉన్నాయని బీజేపీకి స్పష్టంగా తెలుసు. అందుకే మొదట ఈ దేశాన్ని మావోయిస్టు రహిత భారత్‌గా మార్చాలి. ఆ తర్వాతే కార్పొరేట్ భారత్‌గా మార్చడానికి వీలవుతుంది. ఈ రెండు పనుల కోసం కనీసం ఐదారేళ్లుగా ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2026 మార్చి నాటికి మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలిస్తామని అంటున్నారు. మావోయిస్టు ఉద్యమ ప్రమాదం నుంచి తన దీర్ఘకాలిక వ్యూహాన్ని కాపాడుకోడానికి దేశాన్ని అంతర్యుద్ధంలోకి తోసేశారు. మొదట మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలిస్తే ఇక మిగతా పోరాట వ్యక్తీకరణలకు కనీసంగా చోటులేకుండా చేయడం సులభం.

దీని కోసం భౌతికంగా విప్లవకారులను హత్య చేయడమేగాక దాని చుట్టూ ఒక భావజాలాన్ని కూడా రాజ్యం నిర్మిస్తున్నది. మావోయిస్టు ఉద్యమం కొన ఊపిరిలో ఉందని తానొక్కడే అంటే లాభం ఉండదని అమిత్‌షాకు తెలుసు. ఆ మాట ఒక భావజాలంగా సమాజమంతా వ్యాపించాలి. ఈ స్థితికి కారణం ఫాసిస్టు యుద్ధమని కాకుండా విప్లవోద్యమ పంథాలో తప్పులు వెతికేలా మేధావులను తయారు చేయాలి. ఇక విప్లవం చేయలేరని అయినవాళ్లతో, కానివాళ్లతో కూడా అనిపించాలి. అలాంటి ఒక దుర్బల మానసికతను వ్యాపింపచేయాలి. మావోయిస్టు రహిత భారత్ అంటే మావోయిస్టులు అందరినీ చంపేయడమే కాదు. సమాజాన్ని మౌలికంగా మార్చలేమనే పలాయన మానసికతను స్థాపించడం. ఇది ఎంత ప్రమాదమో ఉదారవాదులు, పీడిత అస్తిత్వశక్తులు, మిగతా విప్లవ సంస్థలు ఆలోచించాలి.

నిజానికి ఒక రాజకీయార్థిక సామాజిక సాంస్కృతిక ఉద్యమంగా మావోయిస్టు పార్టీని ఎప్పటికైనా నిర్మూలించగలరా? గత యాభై ఐదేళ్ల చరిత్రలో ఇలాంటి నిర్బంధాలను ఆ ఉద్యమం చవిచూసింది. అనేక క్లిష్ట దశలను దాటుకొని వచ్చింది. ఇక ముగిసిపోయిందని అనుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కొన్ని డజన్ల కీలక నాయకులు, వందలాది మంది రెండోస్థాయి, మూడోస్థాయి నాయకులు హత్యకు గురయ్యారు. అనారోగ్యంతో, వయోభారంతో చాలా మంది చనిపోయారు. ఎందరో అర్ధాంతరంగా వదిలి వెళ్లిపోయారు. ఇన్ని ఆటుపోట్ల మధ్యనే కేంద్ర ప్రభుత్వానికి అతి ముఖ్యమైన టార్గెట్ కాగల స్థాయికి విప్లవోద్యమం ఎదిగింది. దేశంలో పిడికెడు మంది మినహా నూటా నలభై కోట్ల జనాభాకు విప్లవం అత్యవసరం కావడమే మావోయిస్టు ఉద్యమ వ్యూహాత్మక బలం. ఇది కేవలం ఆశావాదం కాదు. అనేక లోటుపాట్లను సమీక్షించుకొని పురోగమించిన దాని గత, వర్తమాన చరిత్ర సారం. అతి మామూలు మనుషులను నాయకులుగా, మేధావులుగా, రాజకీయ సాంస్కృతిక వ్యూహకర్తలుగా మార్చగల మానవీయ ప్రక్రియ విప్లవోద్యమంలో కొనసాగుతున్నంత వరకు మావోయిస్టు రహిత భారత్ ఎన్నటికైనా సాధ్యమవుతుందా? అమిత్‌షా కల ఫలిస్తుందా?

• పాణి

సంస్కరణా? సంఘర్షణా?

పౌరులు అందరికీ దేశవ్యాప్తంగా అన్వయించే ఉమ్మడి పౌర స్మృతి అమలుపరిచే ప్రయత్నం చేయవలెను.

– భారత రాజ్యాంగం



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

భావజాల ప్రేరణతో వ్యవహరించే భారతీయ జనతా పార్టీ మన సంవిధానం నిర్దేశించిన పై మాటల (అధికరణ 44) పట్ల చిత్తశుద్ధి చూపుతుందా? ఉమ్మడి పౌరస్మృతి అనే మాటలకు మాత్రం బాగా ప్రాధాన్యమిస్తుంది. ఇది అర్థం చేసుకోదగిన విషయమే. అయితే ఆ అధికరణలోని 'పౌరులు', 'దేశ వ్యాప్తంగా' అనే మాటలను మనం ఉపేక్షించకూడదు.

మన సువిశాల భారతదేశంలో ఏ ప్రాంతంలోనైనా సరే నివసించే లేదా స్థిరపడే హక్కు ప్రతి పౌరునికీ ఉన్నదని, సకల ప్రదేశాలలోను సమస్త పౌరులకూ ఉమ్మడి పౌరస్మృతినే వర్తింపచేయాలన్నది మన రాజ్యాంగ సంకల్పం. అధికరణ 44 ఉద్దేశం అదే. ఎక్కడైనా సరే నివసించి లేదా స్థిరపడి ఒక పౌరస్మృతి లబ్ధిని పొందే హక్కు సమస్త పౌరులకు లభించేందుకు భారత రాజ్య వ్యవస్థ బాధ్యత. పార్లమెంటు చాల వరకు ఈ బాధ్యతను నిర్వహించింది. భారత పౌరులు అందరూ ఒకే కాంట్రాక్టుల చట్టం (లా ఆఫ్ కాంట్రాక్ట్స్ – చట్ట ప్రకారం ఒక ఒప్పందం ఆమోదయోగ్యం కావాలంటే ఆ ఒప్పందం పాటించవలసిన నియమ నిబంధనలను కాంట్రాక్టుల చట్టం నిర్దేశించింది. ఈ నియమ నిబంధనలను పాటించని ఒప్పందాలు చెల్లుబాటు కావు), ఒకే కాల దోష పరిమితి శాసనం (లా ఆఫ్ లిమిటేషన్), ఏ సివిల్ న్యాయస్థానంలోనైనా ఒకే విధమైన విచారణ ప్రక్రియ, పౌరుని సాంఘిక (నేర వ్యవహారాలతో సంబంధం లేని) విషయాలన్నిటికీ ఒకే విధమైన పౌర స్మృతిని అమలుపరచడం ప్రభుత్వ కర్తవ్యం.

వివాహం, విడాకులు, వారసత్వం మొదలైన సాంఘిక వ్యవహారాలకు సంబంధించి చట్టాలు తీసుకొచ్చే బాధ్యత, అధికారాలు పార్లమెంటుకు ఉన్నాయి. అయితే ఉత్తరాఖండ్ రాష్ట్రం వివాహం, విడాకులు, వారసత్వం, వారసత్వ సంక్రమణ వ్యవహారాలపై చట్టాన్ని తీసుకువచ్చే ఈ బృహత్తర బాధ్యతను స్వయంగా నిర్వహించడం ఒక దుస్సాహసమే. ఉత్తరాఖండ్ ఈ చట్టాన్ని భారతదేశ పౌరులు అందరికీ వర్తింపచేయగలుగుతుందా? ఇందుకు ఆ రాష్ట్రానికి అధికారాలు ఉన్నాయా? ఉత్తరాఖండ్ రాష్ట్రంలో పుట్టిన పౌరుల విషయాన్ని తీసుకున్నా వారు ఉత్తరాఖండ్‌లో నివసించుతున్నంతవరకు మాత్రమే ఆ చట్టాన్ని వర్తింపచేయడం సాధ్యమవుతుంది. ఆ చట్టాన్ని ఇష్టపడని ఏ వ్యక్తి అయినా సరే ఉత్తరాఖండ్ నుంచి వెళ్లిపోయి వేరే ప్రాంతంలో స్థిరపడడం ద్వారా ఆ చట్టం నుంచి స్వేచ్ఛ పొందుతాడు. ఉత్తరాఖండ్‌లో నివసించే ఒక పురుషుడు, ఒక మహిళ ఆ రాష్ట్రం వెలుపల సంప్రదాయ బద్ధంగా వివాహం చేసుకోగలుగుతారు. వారు ఉత్తరాఖండ్ నుంచి వెళ్లిపోకుండా, వివాహం చేసుకోకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆపలేదు.

మరో విషయాన్ని కూడా మనం గమనంలోకి తీసుకోవాలి. ఉత్తరాఖండ్‌లో జన్మించిన వ్యక్తికి దేశ వ్యాప్తంగా తన చట్టం అందుబాటులో ఉంచడం గానీ, వర్తింపచేయడం గానీ చేయలేదు. ఉత్తరాఖండ్‌లో పుట్టి, వేరే రాష్ట్రంలో నివసిస్తున్న వ్యక్తి అక్కడ వారిని వివాహం చేసుకుని, వేరే వారి పిల్లలను దత్తత తీసుకున్నా, తన వీలునామాను అక్కడ రిజిస్టర్ చేయించినా వాటికి వర్తింపచేయదగిన శాసనం (అప్లికబుల్ లా) ఏది అనే ప్రశ్న తలెత్తుతుంది. ఉత్తరాఖండ్ చట్టం అమల్లో ఉన్న పార్లమెంటరీ చట్టంతో సంఘర్షిస్తే పార్లమెంటరీ చట్టమే చెల్లుబాటు అవుతుంది.

ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉమ్మడి పౌరస్మృతిని తీసుకువచ్చినా దాని వెనుక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉన్నదనేది స్పష్టం. ఎవరూ కొట్టివేయలేని వాస్తవమిది. ఉమ్మడి పౌరస్మృతిపై ప్రజల ప్రతిస్పందనలను తెలుసుకునేందుకే ఆ చట్టాన్ని తీసుకువచ్చేలా ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని మోదీ సర్కార్ ప్రోత్సహించిందన్నది స్పష్టాతి స్పష్టం. ఊహించిన విధంగానే ఉత్తరాఖండ్ చట్టం ఒక తీవ్ర చర్చను పురిగొల్పింది. ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్ –యూసీసీ)పై భావనను పరీక్షించేందుకు సమర్థమైన అధికారాలు ఉన్న రాజ్యాంగ సంస్థ లా కమిషన్. 19వ లా కమిషన్ ఆగస్టు 31, 2018న తన నివేదికలో ఇలా అభిప్రాయపడింది : 'యూసీసీని సమకూర్చే చట్టాలను కాక వివక్షను పాటించే, ప్రోత్సహించే చట్టాలను ప్రధానంగా పరిశీలిస్తుంది. ఉమ్మడి పౌరస్మృతి అనేది ప్రస్తుత దశలో తప్పనిసరీ కాదు, వాంఛనీయమూ కాదు'.

మొత్తం మీద ఉత్తరాఖండ్ ప్రభుత్వ లక్ష్యం సమాజ జీవితంలో మారుతున్న విలువలు ఆచారాలు, కట్టుబాట్లకు అనుగుణంగా ప్రగతిశీల, ఉదారవాద చట్టాన్ని తీసుకురావడం కాదని విశదమవుతుంది. కేంద్ర హోం మంత్రి మాటల్లో చెప్పాలంటే 'తిరోగామి మతచట్టాల (పర్సనల్ లాస్)ను తొలగించడమే'నని చెప్పి తీరాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే అధిక సంఖ్యాక వాదాన్ని (మెజారిటేరియనిజం) దృఢంగా ప్రకటించడమే.

ఉత్తరాఖండ్ చట్టంలో మూడు భాగాలు ఉన్నాయి. మొదటి భాగం (సెక్షన్లు 4 నుంచి 48 దాకా) 'వివాహం', 'విడాకులు'కు సంబంధించినది; రెండో భాగం (సెక్షన్లు 49 నుంచి 377 దాకా) 'వారసత్వం'కు సంబంధించినది; మూడో భాగం (సెక్షన్లు 378 నుంచి 389 దాకా) 'సహజీవన సంబంధాలు'కు సంబంధించినది; నాల్గవ భాగం ఇతర అంశాలకు సంబంధించిన వివిధ నిబంధనలు. మొదటి భాగంలోని కొన్ని నిబంధనలు స్వాగతించదగినవి. మారు మనువు, బహు భార్యాత్వాన్ని నిషేధించారు. వివాహ అర్హత వయసు యువతులకు 18, యువకులకు 21 సంవత్సరాలుగా నిర్ణయించారు. వివాహాన్ని తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాలి. కొన్ని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమైనవి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నివసిస్తున్న లేదా వేరే రాష్ట్రంలో జీవిస్తున్న 'రెసిడెంట్' (వాస్తవ్యుడు)కు ఈ చట్టం వర్తిస్తుంది. 'వాస్తవ్యుడు'కు చాలా విస్తృత నిర్వచనమిచ్చారు : (1) ఉత్తరాఖండ్‌లో పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వ శాశ్వత ఉద్యోగి; (2) 'కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న ఏదైనా పథకం లబ్ధిదారు'. ఈ చట్టం ఉత్తరాఖండ్ 'ప్రాదేశిక అధికార పరిధి' (టెర్రిటోరియల్ జ్యూరిస్‌డిక్షన్) ఉల్లంఘించింది. ఈ చట్టంలోని కొన్ని నిబంధనలు చర్చనీయాంశాలు. ఉదాహరణకు విడాకులకు సంబంధించిన నిబంధనలు. కొన్ని నిబంధనలు యథా పూర్వస్థితిని సమర్థించేవి. ఒక వ్యక్తి పురుషుడు లేదా మహిళ కావచ్చు. 'వివాహం' అనేది పురుషుడు, మహిళ మధ్య జరగాలి. ఇటువంటి వివాహమే ధర్మ విహితమైనది. కొన్ని నిబంధనలు తిరోగమనపూర్వకమైనవి. కాలానికి అనుగుణంగా లేనివి. కాల దోషం పట్టిన 'దాంపత్య హక్కుల పునఃస్థాపన' (రెస్టిట్యూషన్ ఆఫ్ కాంజుగల్ రైట్స్) యథాతథంగా ఉంచారు.



akbar

భారత రాజ్యాంగ అధికరణ 44లోని ఉమ్మడి పౌర స్మృతి అనే మాటలకు మాత్రం భారతీయ జనతా పార్టీ బాగా ప్రాధాన్యమిస్తుంది. ఆ అధికరణలోని 'పౌరులు', 'దేశ వ్యాప్తంగా' అనే మాటలను మనం ఉపేక్షించకూడదు. ఉత్తరాఖండ్ ఉమ్మడి పౌరస్మృతిలోని మాటలు, అంతస్సూచనలను నిశితంగా చూస్తే అది అధిక సంఖ్యాకుల అంటే హిందువుల మత చట్టాలనే మన్నించి, హిందూయేతర మతాల వారు అనుసరిస్తున్న మత చట్టాలలోని అంశాలను తోసిపుచ్చిందని అర్థమవుతుంది.

మూడవ భాగం 'సహజీవన సంబంధాలు' గురించి విపులంగా ప్రస్తావించింది. ఇది తిరోగామి పూర్వకమైనదే కాక, రాజ్యాంగ విరుద్ధమైనది కూడా ఇది ఉత్తరాఖండ్ 'వెలుపల' నివసిస్తున్న ఉత్తరాఖండ్ 'వాస్తవ్యులు'కు కూడా వర్తిస్తుందని ఆ చట్టం పేర్కొంది. విరోధాభాసకు ఇదొక స్పష్టమైన ఉదాహరణ. మూడో భాగం అంతా వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, గోప్యత, ఏకాంత హక్కుపై ఎటువంటి మినహాయింపులు లేని దాడి అని చెప్పి తీరాలి. పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం కనుక ఈ భాగాన్ని పూర్తిగా కొట్టివేయాలి. మూడో భాగంలోని నిబంధనలు (15 నుంచి 19 దాకా) మరింత ఘోరమైనవి. నమ్మండి, నమ్మకపోండి సహజీవనంలో ఉన్న భాగస్వాములకు విధులు, హక్కులను అవి నిర్దేశించాయి!

రెండో భాగం 'వారసత్వం'కు సంబంధించినది. ఈ భాగాన్ని మరింత లోతుగా, నిశితంగా విశ్లేషించవలసిన అవసరమున్నది. 'వీలునామా లేని వారసత్వం' విషయంలో 'హిందూ వారసత్వ చట్టం–1956'లోని నిబంధనలను స్వల్ప మార్పులతో ఈ చట్టంలో చేర్చారు. అయితే ఇతర మతాల వారికి చెందిన వారసత్వ చట్టాలలోని సకల నిబంధనలను పూర్తిగా మినహాయించారు. ఈ చట్టం 'సంపద' (ఎస్టేట్)ను నిర్వచించింది. సమష్టి దాయాదిత్వాన్ని గుర్తించినట్టు కనిపిస్తుంది. దీన్నిబట్టి ఉత్తరాఖండ్ చట్టం పూర్తిగా హిందూ మతస్థుల ఆచారాలకు అనుగుణంగా ఉందని అర్థమవుతుంది.

'వీలునామా ప్రకారం వారసత్వ సంక్రమణ'కు సంబంధించి భారతీయ వారసత్వ చట్టం–1925లోని నిబంధనలకు కోర్టుల భాష్యాలను అంగీకరించి, కొత్త చట్టంలో చేర్చారు. ఉత్తరాఖండ్ వెలుపల నివసిస్తున్న ఉత్తరాఖండ్ వాస్తవ్యులకు సైతం ఈ యూసీసీని వర్తింపచేయడమనేది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. చట్టంలోని మాటలు, అంతస్సూచనలను నిశితంగా చూస్తే ఉత్తరాఖండ్ చట్టం అధిక సంఖ్యాకుల అంటే హిందువుల మత చట్టాలనే మన్నించి, హిందూయేతర మతాలవారు అనుసరిస్తున్న మత చట్టాలలోని అంశాలను తోసిపుచ్చిందని విశదమవుతుంది. ఉత్తరాఖండ్ చట్టం పౌరస్మృతుల్లో సంస్కరణలకు బీజాలు నాటిందా? లేక భిన్న మతాల మధ్య సంఘర్షణకు నాంది పలికిందా? కాలమే చెప్పుతుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

జాతరలలో జాగ్రత్త!

గంగానమ్మ, మైసమ్మ, పోచమ్మ, అంకమ్మ, పోలేరమ్మ వంటి గ్రామ దేవతల పేరుతో వివిధ ప్రాంతాల్లో తిరునాళ్ళు నిర్వహిస్తారు. అదే విధంగా శివరాత్రి సందర్భంగా రెండు మూడు రోజులు తిరునాళ్ళు నిర్వహిస్తారు. ఇవన్నీ మన సంస్కృతి, సంప్రదాయాలలో భాగంగా జరుపుకుంటారు. జాతరల సమయంలో పెద్ద ఎత్తున ఒకేచోట జనం చేరే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు సరైన ఏర్పాట్లు చేయకపోతే ప్రజలకు తాగునీరు, ఆహారం కొరత ఏర్పడుతుంది. అలాగే వివిధ ప్రాంతాల్లో జాతరలు ముగిసిన వెంటనే సరైన పరిశుభ్రత చర్యలు తీసుకోవాలి. లేకపోతే అనారోగ్య సమస్యలు వస్తాయి. తెలుగు రాష్ట్రాలలో సాధారణంగా ఫిబ్రవరి నుండి మే వరకు తిరునాళ్ళు, జాతరలు ఎక్కువగా జరుగుతాయి. జాతరలు జరిగే ప్రాంతంలో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లు వాడకుండా స్వీయ నియంత్రణ పాటించాలి. అలాగే దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి.

– యం.రాం ప్రదీప్
తిరువూరు

ఆంధ్రకేసరి గర్జించిన వేళ

"రండిరా, యిది కాల్చుకొండిరా యని నిండు
గుండెలిచ్చిన మహోద్దండమూర్తి
పట్టింపు వచ్చెనా బ్రహ్మాంతవానిని
గద్దించి నిలబెట్టు పెద్దమనిషి
తనకు నామాలు పెట్టిన శిష్యులను కూడా
ఆశీర్వదించు దయామయుడు
సర్వస్వము స్వరాజ్య సమర యజ్ఞమందు
హోమమొనర్చిన సోమయాజి"


'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రి స్మృతి అక్షర సత్యం. ఫిబ్రవరి 3, 1928న బ్రహ్మాండమైన హర్తాళ్ ఒకటి యావత్ భారతదేశంలో సంచలనాన్ని సృష్టించింది. చరిత్రను రచించింది. భారత స్వాతంత్ర్య సమరంలో తెల్లదొరల తుపాకులకు ఎదురు నిలిచి పోరాడే గుండె ధైర్యాన్ని ప్రదర్శించిన సాహసి, ధీరుడి గురించి పలికిన స్మృతి ఇది. 'సైమన్ తిరిగి పో' హర్తాళ్ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కుదిపివేసింది. స్వరాజ్యానికి పునాదులు వేసింది. మద్రాస్‌లో సర్వమూ తానై హర్తాళ్‌కు పిలుపునిచ్చి, జరిపించింది ఒక తెలుగుతేజం... ఆయనే 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు. అర్ధ శతాబ్దం పాటు దక్షిణ భారతంలో ప్రజలతో మమేకమై 'నేనే ప్రజ, ప్రజ అంటే నేనే' అని నినదించి, అంతగా ప్రభావితం చేసిన ప్రజల మనిషి ప్రకాశం.

స్వాతంత్ర్య సమరం ముమ్మరంగా జరుగుతున్న రోజులవి. 1927–28 సంవత్సరంలో బ్రిటిష్‌వారు మన దేశానికి ఒక కీడు తలపెట్టారు. అదే 'సైమన్ కమిషన్'. భారతదేశానికి అవసరమైన చట్ట సవరణలను, సంస్కరణలను సూచించడానికి ఒక బృందాన్ని నియమించి, మన దేశంలో పర్యటించడానికి పంపింది. ఈ విషయం భారత ప్రజానీకాన్ని కలవరపరచింది. అన్ని రాజకీయ పార్టీలు, అందరు నాయకులు ముక్తకంఠంతో సైమన్ కమిషన్‌ను నిషేధించారు. అసలు ఈ కమిషన్ ఎవరు కోరారు? మన దేశ రాజ్యాంగ సవరణలను సూచించడానికి వారెవరు. అందులో ఒక్కరు కూడా భారతీయులు లేరు. మన ప్రమేయం లేకుండా, మన వారిని సంప్రదించకుండా ఈ కమిషన్ ఎందుకు వచ్చింది? దీనిని తరిమి కొట్టండి అన్నారు.

'సైమన్ గో బ్యాక్' నినాదం దేశం నలుమూలలా మార్మోగింది. లాహోరు, లక్నో, కలకత్తా, గుంటూరు, బాపట్ల, బెజవాడ, హైదరాబాద్ నిజాం కాలేజీలో పెద్దయెత్తున హర్తాళ్‌లు జరిగాయి. ఫిబ్రవరి 2న మద్రాస్‌లోని తిలక్ ఘాట్‌లో 10 వేల మందిని ప్రకాశం ఇలా ఉత్తేజపరిచారు. "సైమన్ కమిషన్‌ను బ్రిటిష్ దేశంలో అన్ని పార్టీలవారు ఆమోదించారు. మన దేశంలో అన్ని పార్టీలు ఏకమై బహిష్కరించిన ఉత్తరక్షణంలో మనకు స్వరాజ్యం వచ్చినట్లే" అని ప్రసంగించారు. మొదట దక్షిణాన ఈ ఉద్యమ బాధ్యతను ప్రకాశం పంతులుకు అప్పజెప్పింది కాంగ్రెస్ అధిష్ఠానం. బ్రిటిష్‌వారు ప్రజలను భయభ్రాంతులను చేయడానికి 144 సెక్షన్ విధించి, 'షూట్ ఎట్ సైట్' ఆర్డర్లను జారీ చేసి, మిలిటరీని కూడా మొహరించింది. దీనికి అధిష్ఠానం జంకి ప్రకాశంని సంప్రదించకుండా హర్తాళ్‌ను రద్దు చేసింది. అగ్రనాయకులంతా జరగబోయే బీభత్సాన్ని ఊహించుకుని తప్పుకున్నారు. ప్రకాశం ఈ రెండవ తీర్మానానికి ఎదురొడ్డి తానే స్వయంగా మద్రాస్‌లో ముందు నిలబడి హర్తాళ్ జరుపుతానని నిర్ణయించారు. తన స్వీయచరిత్ర 'నా జీవితయాత్ర'లో ప్రకాశం ఇలా రాసుకున్నారు. "నిజానికి ఎటువంటి ఉద్రిక్త పరిస్థితులలోనూ, వెనుకంజ వేయడమనేది నా జన్మలో లేదు మనకి."

గోఖలే హాల్‌లో ప్రకాశం స్త్రీలనుద్దేశించి ఉత్తేజభరితంగా ప్రసంగించారు. "ప్రపంచంలో స్త్రీలు చేయలేని పనులేవి? ఏవీ లేవు. ఇతర దేశాల్లో బహిష్కారోద్యమాలు జరిగేటప్పుడు స్త్రీలు, విద్యార్థులు అధికంగా పాల్గొన్నారు. మన దేశంలో కూడా 1920–21లో సహాయ నిరాకరణోద్యమంలో అనేక మంది స్త్రీలు పాల్గొన్నారు. అందువల్ల ఎవరూ బెదరనక్కర లేదు. స్త్రీలు తప్పక అసంఖ్యాకులుగా వచ్చి హర్తాళ్‌ను జయప్రదంగా నెరవేర్చాలి."

..అక్కడ రాళ్ల వర్షం మొదలైంది. పోలీసులు లాఠీ-ఛార్జ్ మొదలుపెట్టారు. తుపాకులతో, గుర్రాలతో ప్రజల మీదకు దూసుకుపోతున్నారు. ప్రజల హాహాకారాలతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. 'ఎక్కడ ప్రమాదమో అక్కడ ప్రకాశం' అన్నట్లుగా ప్రకాశం పంతులు ఎంతమంది వారించినా నడుం బిగించి అక్కడికి పరుగులు తీశారు. "తెల్లవాడి గుండుకు తెలుగువాడి గుండె ఎదురొడ్డిన ఘడియ" అది.



1928, ఫిబ్రవరి 3 ఉదయాన 'సైమన్ కమిషన్' రానే వచ్చింది. ప్రకాశం ఆదేశానుసారం మద్రాస్ వీధులన్నీ జనసంద్రంగా మారాయి. పెద్దలు, పిల్లలు, స్త్రీలు, విద్యార్థులు, కార్మికులు, వర్తకులు, లాయర్లు, డాక్టర్లు.. ఒకరేమిటి అన్ని ప్రాంతాలవారు, కులాలవారు, మతాలవారు ఉదయం 11 గంటలకల్లా సముద్ర కెరటాలలా పొంగి వచ్చారు. అటు పోలీసులు గుర్రపు దళాలు, తుపాకులతో మొహరించి ఉన్నారు. జనాలలో ఉత్సాహం, ఉద్రేకం నిమిష నిమిషానికీ పెరుగుతున్నాయి. 'సైమన్ గో బ్యాక్' నినాదాలు మారుమోగుతున్నాయి. అలజళ్లు చెలరేగాయి. హైకోర్టు, లా కాలేజీ ప్రాంతాలు ఉద్రిక్తపూరితమై వర్ణనాతీతంగా మారాయి. ప్రకాశం రంగప్రవేశం వేళ రానున్నది. అక్కడ రాళ్ల వర్షం మొదలైంది. పోలీసులు లాఠీఛార్జ్ మొదలుపెట్టారు. తుపాకులతో, గుర్రాలతో ప్రజల మీదకు దూసుకుపోతున్నారు. ప్రజల హాహాకారాలతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. "ఎక్కడ ప్రమాదమో అక్కడ ప్రకాశం" అన్నట్లుగా ప్రకాశం పంతులు ఎంతమంది వారించినా నడుం బిగించి అక్కడికి పరుగులు తీశారు. అల్లర్లలో ఒక యువకుడిని పోలీసులు కాల్చారు. అతడి మృతదేహం నడిరోడ్డున, రక్తంలో దిక్కూమొక్కూ లేకుండా పడి ఉంది. ప్రకాశం దూసుకొస్తున్నారు. ఆయనను చూడగానే ప్రజలలో ఉత్సాహం, ఉద్రేకం కట్టలు తెంచుకుని నినాదాలు నింగిని అంటాయి.

"తెల్లవాడి గుండుకు తెలుగువాడి గుండె ఎదురొడ్డిన ఘడియ" అది. ఇరువైపులా పోలీసులు, మిలటరీ. దూసుకొస్తున్న సింహానికి ఎదురొచ్చి ఒక పోలీసు 'ఆగు' అన్నాడు. "ఆ దేశభక్తుడిని చూడాలి" అన్నారు ప్రకాశం. వీల్లేదు, అడుగు ముందుకేశావో, కాలుస్తా" అని నేరుగా ప్రకాశం గుండెకు గురిపెట్టాడు. సింహానికా బెదిరింపు! నీకు దమ్ముంటే కాల్చుకో అని గుండె చూపించాడు. అంతా నిశ్శబ్దం. పోలీసుకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఇంతలో పక్కనున్న విప్లవకారుడు "ఆయన ఎవరో తెలియదల్లే ఉందే నీకు, కాల్చుకోండి మేము సిద్ధంగా ఉన్నా"మని అరిచాడు. అంతే పోలీసు చేతులు వణికాయి, తుపాకీ నేలకొరిగింది. "ఆంధ్ర కేసరి జిందాబాద్... సైమన్ గో బ్యాక్" నినాదాలు అంబరాన్ని తాకాయి. సిపాయి చేతులు జోడిస్తూ, దారి విడిచి ప్రజలను శాంతపరచమని వేడుకున్నాడు.

'ఆంధ్రకేసరి' అన్న బిరుదు అప్పటికే ప్రచారంలో ఉన్న ఈ అపూర్వ సంఘటనతో ప్రపంచం దశదిశలా వ్యాపించింది. ప్రకాశం ఆ యువకుడి మృతదేహాన్ని ఒళ్లోకి తీసుకుని విచారించారు. అతను పార్థసారథి అనే నవయువకుడు అని తెలుసుకుని చాలా బాధపడ్డారు. ఆ రోజంతా మద్రాస్ నలుమూలలు తిరిగి ప్రజలను శాంతిమార్గంలో నడిపిస్తూ హర్తాళ్‌ను దిగ్విజయం చేశారు. ప్రకాశం నాయకత్వంలో జరిగిన ఈ హర్తాళ్ దేశానికే తలమానికంగా నిలిచింది. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని పెకలించింది. స్వరాజ్యానికి పునాదులు వేసింది.

పేదరికంలో పుట్టి, అకుంఠిత దీక్ష, కఠోర పరిశ్రమతో లాయరుగా ఎదిగి అపరిమిత సంపదను గడించారు ప్రకాశం. గాంధీ పిలుపుతో రాజకీయాలలో ప్రవేశించి, చెన్న రాష్ట్రానికి రెవెన్యూ మంత్రిగా, మద్రాస్ ప్రీమియర్ (ప్రధానిగా), ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా దేశానికి ఎనలేని సేవలందించారు. తన సర్వస్వాన్ని స్వరాజ్యానికి, సుపరిపాలనకు, గ్రామ స్వరాజ్యానికి ధారపోశారు. భారత చరిత్రలో 'ఆంధ్రకేసరి'గా ధైర్యశాలిగా, త్యాగమూర్తిగా, కపటమెరుగని కర్మయోగిగా సాగిన ఆయన జీవితయాత్ర నిజానికి సాహసయాత్ర. అటువంటి ప్రాతఃస్మరణీయునికి 'భారతరత్న' బిరుదు ఎంతో సముచితం.

▪ టంగుటూరి శ్రీరాం
ప్రకాశం అభివృద్ధి, అధ్యయన సంస్థ ప్రధాన కార్యదర్శి
(ప్రకాశం మనవడు)

(ఫిబ్రవరి 3: సైమన్ గోబ్యాక్ హర్తాళ్‌కు 97 ఏళ్లు)

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల అవినీతి దాహం

- నాలుగు రోజుల్లో 400 లావాదేవీల ద్వారా సొమ్ము స్వాహా
- ప్రభుత్వ ఖాతాలోకి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా నగదు జమ
- సాక్ష్యాధారాలతో ఏసీబీకి అందిన ఫిర్యాదు
- మొత్తం జగన్ హయాంలో ఇంకెంత నొక్కేసారో తేల్చాలని వినతి

విజయవాడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో భారీ కుంభకోణం వెలుగు చూసింది. ప్రజల దాహార్తిని తీర్చే కేంద్ర ప్రాయోజిత పథకమైన జల్ జీవన్ మిషన్(జేజేఎం)ను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమ అవినీతి దాహాన్ని తీర్చుకునేందుకు వాడుకున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా నిధులను డ్రా చేసుకుని అక్రమాలకుపాల్పడ్డారు. విజయవాడలోని రింగ్ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు బ్యాంక్‌లో ప్రత్యేకంగా తెరచిన ఖాతాలోని జేజేఎం 5 శాతం గ్రాంట్ నిధులను అడ్డగోలుగా వాడేయడంపై తాజాగా ఏసీబీ డీజీకి ఫిర్యాదు అందడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కేంద్ర మ్యాచింగ్ గ్రాంట్‌తో జేజేఎం పథకాన్ని రాష్ట్రంలో అమలు చేస్తారు. ఈ పథకం గ్రాంట్‌లో 5 శాతం నిధులను ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో స్టేషనరీ, ఇతర ఖర్చుల కోసం వినియోగించుకోవచ్చు. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు అధికారులు ఈ ఐదు శాతం నిధులను భారీగా పక్కదారి పట్టించారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ నిధులను ఎడాపెడా వాడేశారు. వైసీపీ ప్రభుత్వ జమానాలో 2024వ సంవత్సరం జనవరి 1, 15, 24, 30 తేదీలలో కేవలం నాలుగు రోజులలోనే 400 ట్రాన్సాక్షన్ల ద్వారా ఈ ఐదు శాతం నిధులను సొంత అవసరాలకు వాడేశారు. గత నాలుగేళ్ళుగా మిగిలిన రోజులలో ఏ రేంజ్‌లో జేజేఎం గ్రాంట్ నిధులను చప్పరించేశారో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ ఖాతాలో వేల సంఖ్యలో లావాదేవీలు జరిగాయని తెలుస్తోంది. దీనిని బట్టి కోట్లాది రూపాయలను డ్రా చేసినట్టుగా అర్థమవుతోంది. ఈఎన్‌సీ ఆఫీసు, ఎస్‌ఈ, ఈఈ అవసరాలకు కాకుండా వేర్వేరు ఖాతాలకు నిధుల బదలాయింపు భారీగా జరిగిందని సమాచారం.

జల్‌జీవన్ మిషన్ నిధులను మింగేసిన వైనం

ఖర్చుల కోసం వెచ్చించాల్సిన 5% నిధులకు చిల్లు

ఇదొక్కటే కాదు... మరికొన్ని ఖాతాల నుంచీ..!

జేజేఎం పథకం కంటే ముందు నేషనల్ రూరల్ డ్రింకింగ్ వాటర్ ప్రోగ్రామ్ (ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ) గ్రాంట్ 3 శాతం నిధులకు సంబంధించిన ఖాతా నుంచి నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా డబ్బులు డ్రా చేశారని తెలుస్తోంది. దీంతో పాటు తాజాగా స్టేట్ వాటర్ శానిటేషన్ మిషన్ (ఎస్‌డబ్ల్యూఎస్ఎం) పథకం గ్రాంట్‌కు కూడా భవానీపురంలోని ఓ బ్యాంకులో ఖాతా ఉంది. ఈ ఖాతా నుంచి కూడా అడ్డగోలుగా డబ్బులు సొంత అవసరాలకు డ్రా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇవే కాకుండా వాటర్ గ్రిడ్ ఖాతా నుంచి కూడా పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయని తెలుస్తోంది. 2019-24 మధ్య కాలంలో ఈ ఖాతాలకు సంబంధించిన లావాదేవీలన్నింటినీ పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా జరిగిందా లేదా అన్నది పరిశీలిస్తే దొంగ లావాదేవీలు దొరికిపోతాయి.

జేజేఎం ఖాతాలోకి ప్రైవేట్ వ్యక్తుల నుంచి సొమ్ములు!

కొంతమంది ప్రైవేటు వ్యక్తుల నుంచి కూడా ఇదే ఖాతాకు నిధులు బదిలీ కావటం గమనార్హం. ఒక నిర్దిష్టమైన ప్రభుత్వ ఖాతాకు ప్రైవేటు వ్యక్తుల నుంచి ఫోన్‌పేల ద్వారా డబ్బులు జమ అవుతున్న విషయం కూడా వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారుల ప్రత్యేక ఆదేశాలు లేకుండా కిందిస్థాయి సిబ్బందితో ఈ ఖాతాలోని డబ్బులను ఎప్పుడు పడితే అప్పుడు డ్రా చేయించినట్టుగా తెలుస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ నిబంధనల ప్రకారం రూ.5 వేల కంటే ఎక్కువ డబ్బులు డ్రా చేయాల్సి వస్తే ఖచ్చితంగా ఎమ్ బుక్‌లో నమోదు చేయాలి. దీనికి సంబంధించి జేఈ రికార్డు చేయాలి. ఆ తర్వాత ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చెక్ మెజర్‌మెంట్ చేయాలి. ప్రతి చెక్కుకు జీఎస్‌టీ, ఐటీ మినహాయించాల్సి ఉంటుంది. ఇవన్నీ లేకుండానే బ్యాంకు ఖాతా నుంచి పెద్ద ఎత్తున డబ్బులు డ్రా చేశారు. ఇది తీవ్రమైన నేరం. కొంతమంది చీఫ్ ఇంజనీర్లకు కూడా ఇందులో వాటాలు ముట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాలను పర్యవేక్షించే సూపరింటెండెంట్ ద్వారా అడ్డగోలుగా చెల్లింపు లావాదేవీలు నడిచినట్టుగా తెలుస్తోంది. ఆ ఉద్యోగి ఫోన్‌పే, గూగుల్ పేల ద్వారానే ఎక్కువ లావాదేవీలు నడిచాయని కూడా ఏసీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది.



బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో డా విన్సీ రోబోటిక్ సర్జికల్ సిస్టంను ప్రారంభించిన అనంతరం పరిశీలిస్తున్న ఆస్పత్రి చైర్మన్ బాలకృష్ణ

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జికల్ వ్యవస్థ

- ప్రారంభించిన ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ..

హైదరాబాద్ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నొప్పి లేకుండా రోగులకు శస్త్ర చికిత్సలు చేసేందుకు దోహదపడే డా విన్సీ రోబోటిక్ సర్జికల్ వ్యవస్థను బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చారు. ఆస్పత్రి చైర్మన్, ఏపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఆయన సతీమణి వసుంధర దేవితో కలసి శుక్రవారం దీన్ని ప్రారంభించారు. ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ ప్రారంభించి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక లోగోను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. తన తల్లి ఆశయాలకు అనుగుణంగా పేదలకు అందుబాటు ధరల్లో అత్యాధునిక క్యాన్సర్ చికిత్స అందించాలనే లక్ష్యంలో భాగంగానే ఈ వ్యవస్థను ఆస్పత్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే దాదాపు 800కి పైగా రోబోటిక్ సర్జరీలు చేశామని.. ఇది దేశంలోనే ఒక రికార్డని చెప్పారు. తమ ఆస్పత్రికి సహకరిస్తున్న దాతలకు, బ్యాంకర్లకు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు రూ.10 కోట్ల ఖరీదైన ఈ అత్యాధునిక ఫోర్త్ జనరేషన్ రోబోటిక్ సర్జికల్ వ్యవస్థ ద్వారా రోగులకు నొప్పి లేని రీతిలో శస్త్ర చికిత్సలు చేయవచ్చని.. రోగులు కూడా అత్యంత త్వరగా కోలుకోవడానికి వీలు కలుగుతుందని వైద్యులు వివరించారు.

2 రోజుల్లో టీచర్ల బదిలీల ముసాయిదా

- వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బిల్లు పెట్టే యోచన
- టీచర్ల సంఘాలతో పాఠశాల విద్యాశాఖ చర్చలు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల చట్టం రూపకల్పనపై పాఠశాల విద్యాశాఖ చర్యలు వేగవంతం చేసింది. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఈ చట్టానికి సంబంధించిన బిల్లును పెట్టాలని నిర్ణయించగా.. రెండు రోజుల్లో ముసాయిదా విడుదల చేయనుంది. దాన్ని అందరికీ అందుబాటులో ఉంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించనుంది. శుక్రవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చల్లో ఆ శాఖ డైరెక్టర్ విజయరామరాజు ఈ విషయాలను వెల్లడించారు. టీచర్లకు 8, ప్రధానోపాధ్యాయులకు 5 విద్యా సంవత్సరాలు ప్రామాణికంగా బదిలీలు జరిగేలా చట్టంలో నిబంధనలు రూపొందిస్తున్నారు. ఏటా వేసవి సెలవుల్లో మాత్రమే బదిలీలు జరుగుతాయి. సీనియారిటీ జాబితాలను ఆన్‌లైన్ చేస్తారు. 2023లో బదిలీ అయిన టీచర్లకూ అర్హత కల్పించే విషయంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని సంఘాల నేతలకు డైరెక్టర్ హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కనీసం 7,500 మోడల్ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం ఏకోపాధ్యాయ పాఠశాలలు 12,600 ఉన్నట్లు చెప్పారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు విషయంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలదే తుది నిర్ణయమన్నారు. మిగులు స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలలకు కేటాయించాలని సంఘాల నేతలు కోరగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీనియారిటీపై అభ్యంతరాలుంటే డీఈవో, ఆర్జేడీకి ఫిర్యాదు చేయొచ్చని, నేరుగా కోర్టులకు వెళ్తే చర్యలు తీసుకుంటామని విజయరామరాజు స్పష్టం చేశారు.

కోడ్ ముగియగానే డీఎస్సీ

మార్చిలో నియామక ప్రక్రియ ఆరంభం: లోకేశ్.. జూన్‌కల్లా ఉపాధ్యాయుల భర్తీ

- టీచర్ల బదిలీల్లో పారదర్శకత
- వ్యవస్థలో భాగస్వాములందరితో చర్చించిన తర్వాతే నిర్ణయాలు
- సంఘాలతో నిత్యం చర్చలు
- జగన్ హయాంలో రూ.3 వేల కోట్ల ఫీజు బకాయిలు
- మేమొచ్చాక తొలి విడతగా 800 కోట్లు ఇచ్చాం
- వాట్సాప్ పాలనపై స్పందన భేష్
- చిన్నపాటి సమస్యలున్నా వారం రోజుల్లో 161 సేవలు అందుబాటులోకి: మంత్రి



అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ ప్రకటించారు. మార్చిలో ఉపాధ్యాయ నియామక ప్రక్రియను ప్రారంభించి.. వచ్చే విద్యాసంవత్సరం మొదలయ్యే జూన్ నాటికి ఉపాధ్యాయులను భర్తీ చేస్తామని వెల్లడించారు. శుక్రవారమిక్కడ మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలోను, రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏపీలోనూ 80 శాతానికిపైగా టీచర్ల పోస్టులను టీడీపీ ప్రభుత్వాలే భర్తీ చేశాయని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యయుతంగా స్వేచ్ఛను కల్పిస్తూ ఉపాధ్యాయ సంఘాలతో నిత్యం చర్చిస్తున్నామని తెలిపారు. వారి అభిప్రాయాలు సేకరించే.. ప్రభుత్వం ప్రతి నిర్ణయం తీసుకుంటోందన్నారు. విద్యాశాఖ కమిషనర్ ప్రతి శుక్రవారం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటున్నారని, వారి సమస్యలను తెలుసుకుంటున్నారని చెప్పారు. తాను కూడా వారిని కలుస్తున్నట్లు తెలిపారు. టీచర్ల బదిలీల్లో పారదర్శకత కోసం బదిలీ చట్టాన్ని తీసుకొస్తున్నామని అన్నారు. 'విద్యావ్యవస్థకు సముచిత స్థానం కల్పిస్తూ.. అనాలోచిత నిర్ణయాలకు తావు లేకుండా ఆచితూచి ముందుకు వెళ్తున్నాం. విద్యావ్యవస్థలో భాగస్వాములైన వారందరితో చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నాం. విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను జగన్ ప్రభుత్వం గందరగోళం చేసింది. దీనిని సరిచేసేందుకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) విధానాన్ని మేం తీసుకొచ్చాం. అదే సమయంలో పాఠశాలల్లో డ్రాపౌట్లను తగ్గించేందుకూ ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తున్నాం' అని వివరించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి వైసీపీ చేస్తున్న ఆరోపణలపై ఆయన స్పందించారు. జగన్ హయాంలో రూ.3 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక విడతగా రూ.800 కోట్లు విడుదల చేశామని తెలిపారు. బకాయిలు పెట్టింది జగన్.. మళ్లీ ధర్నాలు చేస్తోంది ఆయన పార్టీ వాళ్లేనంటూ ఎద్దేవా చేశారు.

వ్యక్తిగత సమాచారం వెల్లడి కాదు..

ప్రజలకు పాలనను సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రవేశపెట్టిన వాట్సాప్ పరిపాలనపై మంచి స్పందన వస్తోందని లోకేశ్ తెలిపారు. చిన్నపాటి సమస్యలు ఉన్నప్పటికీ వారం రోజుల్లో పూర్తిస్థాయిలో 161 సేవలు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అందుబాటులోకి వస్తాయన్నారు. వ్యక్తిగత సమాచారం బయటకు వెల్లడయ్యే సమస్యే లేదని స్పష్టం చేశారు.

బాలల్లో నైపుణ్య వికాసమే బాల మహోత్సవ్ లక్ష్యం

- విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య), జనవరి 31(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో విద్యార్థులు ఎల్లప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండాలని అందుకోసమే విజ్ఞాన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో తొలిసారిగా బాల మహోత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. గుంటూరు సమీపంలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌ను సాధ్యమైనంత తక్కువగా విద్యార్థులు వినియోగించాలన్నారు. జంక్ ఫుడ్ తినకుండా సంప్రదాయ ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు రోజూ మైదానంలో ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించాలని, అప్పుడే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని తెలిపారు. జీవితంలో కష్టపడి పనిచేయడంతో పాటు బాగా కృషి చేసిన వారే ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ఆచార్య పి.నాగభూషణ్ అన్నారు. కలల సాకారానికి అంకితభావంతో కృషి చేస్తే ఉన్నతంగా ఎదిగే శక్తి సామర్థ్యాలు విద్యార్థుల్లో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా 50 అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

రథసప్తమికి తిరుమలలో పటిష్ట ఏర్పాట్లు

- ఆర్జిత సేవలు, సిఫారసు దర్శనాలు రద్దు
- 3 నుంచి 5 వరకు ఎస్‌ఎస్‌డీ టోకెన్ల జారీ నిలిపివేత
- 'తిరుపతి'లో తొక్కిసలాటపై న్యాయ విచారణ జరుగుతోంది: టీటీడీ చైర్మన్


తిరుమల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలకు తిరుమలలో పటిష్ట ఏర్పాట్లు చేశామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. రథసప్తమి ఏర్పాట్లపై చర్చించేందుకు టీటీడీ బోర్డు తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం అత్యవసరంగా సమావేశమైంది. సమావేశం అనంతరం టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. తిరుపతిలో తొక్కిసలాట ఘటన నేపథ్యంలో భవిష్యత్తులో అలాంటి ప్రమాదాలు జరగకూడదనే ఉద్దేశంతోనే ఫిబ్రవరి 4న జరిగే రథసప్తమి వేడుకలకు ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోవాలనే అంశంపై పలు సమావేశం నిర్వహించామన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీతో భద్రతా ఏర్పాట్లపై చర్చించామని, గతేడాది రథసప్తమికి 650 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు ఉంచగా, ఈసారి 1,300 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కాగా, రథసప్తమి సందర్భంగా అష్టదళపాదపద్మారాధన, ఊంజల్‌సేవ, కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలతో పాటు ఎన్ఆర్‌ఐలు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లిదండ్రుల ప్రత్యేక దర్శనాలను, ప్రొటోకాల్ మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశామన్నారు. ఇక, తిరుపతిలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్ల జారీని కూడా నిలిపివేస్తామన్నారు. వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీ సందర్భంగా జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఇప్పటికే ప్రభుత్వం న్యాయ విచారణకు కమిటీ వేసిందని, ప్రస్తుతం విచారణ కొనసాగుతోందన్నారు. అలాంటప్పుడు టీటీడీ నుంచి మరో విచారణ కమిటీ వేయడం సరికాదని మీడియా ప్రతినిధుల ప్రశ్నకు బీఆర్ నాయుడు సమాధానమిచ్చారు.

ఉద్యోగి ఆచూకీ కోసం గాలింపు

కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో శ్రీవారి నమూనా ఆలయంలో విధులు నిర్వహించేందుకు వెళ్లిన ఉద్యోగి దీపాలి సుబ్రహ్మణ్యం ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని బీఆర్ నాయుడు తెలిపారు. ఇప్పటికే అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. టీటీడీ సీవీఎస్వో కూడా విజిలెన్స్ సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా సుబ్రహ్మణ్యం కోసం వెతుకుతున్నారని చెప్పారు.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం

టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.కోటి విరాళంగా అందింది. చెన్నైకు చెందిన సంసార్ క్యాపిటల్ కంపెనీ ఎండీ అండ్ సీఈవో వెంకటేష్ కన్నప్పన్ రూ.కోటి విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేసి అన్నప్రసాదం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.


అదనపు ఈవోకు విరాళం డీడీ అందజేస్తున్న వెంకటేశ్

శ్రీవారి సేవలో జస్టిస్ జ్యోతిర్మయి



రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం వేకువజామున అభిషేక సేవలో కుటుంబ సమేతంగా పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకమండపంలో జస్టిస్ జ్యోతిర్మయికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

బీఈడీలో సీట్ల గోల్‌మాల్!

- 425 కాలేజీల్లో అడ్మిషన్లలో అవకతవకలు
- ఉన్నత విద్యామండలి తనిఖీల్లో గుర్తింపు
- సైన్స్ విభాగంలో చూపిస్తూ ఆర్ట్స్‌లో సీట్లు
- 4,791 ఉల్లంఘనలు... ఒక్కోదానికి 2వేలు జరిమానా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కాలేజీల్లో అక్రమాల పరంపర కొనసాగుతోంది. ఇప్పటివరకూ కళాశాల భవనాలు, ల్యాబ్‌లు, మౌలిక వసతుల అంశాల్లో ఎక్కువగా ఉల్లంఘనలు జరిగేవి. ఇప్పుడు అడ్మిషన్ల కోటాల్లో గోల్‌మాల్ చేస్తున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. స్పాట్, మేనేజ్‌మెంట్ కోటా అడ్మిషన్లలో 4,791 ఉల్లంఘనలు జరిగినట్లు ఉన్నత విద్యామండలి ఇటీవల తనిఖీల్లో గుర్తించింది. ఒక్కో ఉల్లంఘనకు రూ.2వేలు చొప్పున జరిమానా చెల్లించాలని స్పష్టం చేసింది. కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడం వంటి సాధారణ ఉల్లంఘనలకు జరిమానాలు విధించడం లేదు. మొత్తంగా 425 కాలేజీల్లో అడ్మిషన్ల ఉల్లంఘనలు జరిగితే వాటిలో 390 కళాశాలల్లో సీట్ల కేటాయింపు కోటాల్లో అవకతవకలను గుర్తించారు. ఒక కాలేజీలో గరిష్ఠంగా 55 శాతం సీట్లు సైన్స్, గణితం సబ్జెక్టులకు కేటాయించాల్సి ఉంటే, ఆ పరిమితిని దాటి ఇచ్చేశారు. అలాగే ఒక కోర్సులో తక్కువ సీట్లు భర్తీ అయి, మరో కోర్సుకు డిమాండ్ ఉంటే... డిమాండ్ ఉన్న కోర్సులో సీట్లు భర్తీచేసి ఖాళీగా ఉన్న కోర్సులో భర్తీ చేసినట్లుగా చూపిస్తున్నారు. ఆర్ట్స్ సీట్లను తీసుకొచ్చి సైన్స్‌లో చూపిస్తున్న ఉల్లంఘనలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. కాలేజీలో మొత్తం సీట్లు భర్తీ చేసుకోవడమే లక్ష్యంగా గ్రూపులను మార్చి చూపిస్తున్నారు. అయితే ఇప్పటికే విద్యార్థులకు తరగతులు జరుగుతున్నందున జరిమానాలు విధిస్తూ మండలి నిర్ణయం తీసుకుంది. ఈ మొత్తం విద్యార్థుల నుంచి వసూలు చేయకుండా యాజమాన్యాలే చెల్లించాలని స్పష్టం చేసింది. జరిమానా కట్టకపోతే చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

రాష్ట్రేతర విద్యార్థులతో భర్తీ

బీఈడీలో కన్వీనర్ కోటాను పక్కనపెట్టి స్పాట్, మేనేజ్‌మెంట్ కోటాలో ఎక్కువగా సీట్లు భర్తీ చేస్తారు. తరగతులు హాజరు కాకపోయినా సులభంగా పాస్ చేయిస్తామనే అనధికార ఒప్పందాలతో ఈ వ్యవహారం సాగుతోంది. అందులోనూ ఇతర రాష్ట్రాల విద్యార్థులతో ఎక్కువ సీట్లు భర్తీ చేసుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులతో సంబంధం లేకుండా అదనంగా వసూలు చేస్తున్నారు. పరీక్షల సమయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి అందరినీ పాస్ చేయిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇలాంటి అక్రమాలు జరిగినా అప్పటి అధికారులు పట్టించుకోలేదు. మేనేజ్‌మెంట్లతో కుమ్మక్కై కాలేజీలకు నచ్చినట్లుగా అడ్మిషన్లు తీసుకునే అవకాశం కల్పించారు. దీంతో కాలేజీ అడ్రస్ తెలియకపోయినా పేపర్లపై భారీగా అడ్మిషన్లు జరిగేవి. ఇకపై అలాంటి అక్రమాలకు అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతో ఉన్నత విద్యామండలి తనిఖీలు ప్రారంభించింది. ఇకపై బీఈడీ కాలేజీల్లో అన్ని కోణాల్లో తనిఖీలు చేపడతామని మండలి వర్గాలు తెలిపాయి.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీని గద్దె దించాలి

- మార్చి 23 నుంచి రాజకీయ ప్రచార ఉద్యమం
- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజా. చిత్రంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ఇందుకోసం వామపక్ష, లౌకిక పార్టీలతో కలిసి పనిచేస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. రెండు రోజులపాటు విశాఖలో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ముగిసాయి. అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని మార్చి 23వ తేదీ నుంచి అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా రాజకీయ ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తామన్నారు. పార్టీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది డిసెంబరు 24, 25 తేదీల్లో విజయవాడలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని, ప్రపంచంలో పలు కమ్యూనిస్టు దేశాల ప్రతినిధులను ఆహ్వానిస్తామన్నారు. డిసెంబరు 26న ఖమ్మంలో పార్టీ శత వార్షికోత్సవాల ముగింపు సభ నిర్వహిస్తామని ప్రకటించారు. దేశంలో ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితులు నెలకొని ఉన్నాయని, ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని, విదేశీ అప్పు 700 బిలియన్ డాలర్లకు చేరుకుందని, రూపాయి విలువ భారీగా పడిపోతుందని రాజా ఆందోళన వ్యక్తంచేశారు.

బంగారం కొట్టేసి.. రోల్డుగోల్డు నగలు పెట్టేసి!

- బ్యాంకులో రూ.1.70 కోట్ల విలువైన పుత్తడి చోరీ
- మచిలీపట్నం కర్ణాటక బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ చేతివాటం
- ఆడిట్‌లో వెలుగులోకి.. లబోదిబోమంటున్న ఖాతాదారులు


మచిలీపట్నం రాజాసెంటర్‌లోని కర్ణాటక బ్యాంకు

మచిలీపట్నం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా మచిలీపట్నం రాజా సెంటర్‌లోని కర్ణాటక బ్యాంకులో ఇంటి దొంగ చేతివాటం బయటపడింది. అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న జి.సోమశేఖరరావు బ్యాంకులో ఖాతాదారులు తాకట్టుపెట్టిన బంగారు నగల స్థానంలో రోల్డుగోల్డు నగలు ఉంచి ఆ నగలను కాజేశారు. చాలా కాలంగా జరుగుతున్న ఈ వ్యవహారం బ్యాంకు అధికారుల ఆడిట్‌లో వెలుగు చూసింది. ఈ క్రమంలో ఖాతాదారులు శుక్రవారం బ్యాంకుకు వెళ్లి తమ నగలు చూపించమని డిమాండ్ చేశారు. వారిని ఆందోళన చెందవద్దని బ్యాంకు 17 శాఖల ఇన్‌చార్జి రాఘవేంద్ర ప్రసన్న, క్లస్టర్ హెడ్ నాదెండ్ల భాస్కరరావు సూచించారు. అయితే అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న సోమశేఖరరావు బంగారాన్ని దొంగిలిస్తున్నా, మేనేజర్ శ్రీహరికి తెలియకపోవడంపై ఉన్నతాధికారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఆయన స్థానంలో వేరొకరిని ఇన్‌చార్జిగా నియమించారు. ఈ వ్యవహారంపై బ్యాంకు ఉన్నతాధికారుల ఫిర్యాదుతో ఆర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ రాజా నేతృత్వంలో ఆర్‌పేట సీఐ ఏసుబాబు సోమశేఖరరావును అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. అతను విజయవాడలోని వివిధ బ్యాంకుల్లో ఈ బంగారాన్ని తాకట్టుపెట్టాడని సమాచారం. దీనిపై డీఎస్పీని వివరణ కోరగా నిందితుడు దొంగిలించిన బంగారాన్ని రికవరీ చేస్తామన్నారు. మరోవైపు.. మేనేజర్ శ్రీహరి, అసిస్టెంట్ మేనేజర్ సోమశేఖరరావును సస్పెండ్ చేసినట్టు రాఘవేంద్రప్రసన్న తెలిపారు.

మమ్మల్ని చంపి భూమి కొట్టేయాలని చూస్తున్నారు

- టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుడి ఫిర్యాదు

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అగ్రకులాల వ్యక్తులు..ఎస్సీలైన తమ కుటుంబాన్ని చంపి, పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న తమ భూమిని కొట్టేయాలని యత్నిస్తున్నారని అన్నమయ్య జిల్లా మద్దికుంటపల్లికి చెందిన శ్రీనివాసులు టీడీపీ గ్రీవెన్స్‌లో మొరపెట్టుకున్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలను అక్రమ కేసులతో ఇబ్బందిపెట్టిన సీఐ భీమానాయక్‌పై చర్యలు తీసుకోవాలని దర్శికి చెందిన మధు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్సులో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్యే చంటి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీలిచ్చారు. విజయనగరం జిల్లా అన్నవరం పంచాయతీ పరిధిలోని తమ స్థలాన్ని గత ప్రభుత్వంలో వైసీపీకి చెందిన వారు తప్పుడు పత్రాలతో కొట్టేయాలని చూశారని, తమపై రౌడీలతో దాడులకు వస్తున్నారని తూడెం గ్రామానికి చెందిన చిట్టితల్లి వాపోయారు. నరసరావుపేటలో టీడీపీకి అనుకూలంగా ఉన్నామన్న కక్షతో గత ప్రభుత్వంలో రజకుల కళ్యాణ మండపంలో ఫర్నిచర్‌ను ఎత్తుకెళ్లారని అమరావతి రజక ఐక్యవేదిక నాయకులు ఫిర్యాదు చేశారు.

శ్రీకాంత్ అవుట్

బ్యాంకాక్: ఫామ్‌లేమితో తంటాలు పడుతున్న కిడాంబి శ్రీకాంత్‌కు నిరాశే ఎదురైంది. థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ క్వార్టర్‌ఫైనల్లో శ్రీకాంత్ 17-21, 16-21తో జెంగ్ గ్జింగ్ వాంగ్ (చైనా)చేతిలో ఓటమిపాలయ్యాడు. మరో భారత సింగిల్స్ ఆటగాడు శంకర్ ముత్తుస్వామి 21-19, 18-21, 13-21తో గ్జువాన్ చెన్ జు (చైనా) చేతిలో ఓడాడు. ఇక, మహిళల సింగిల్స్‌లో రక్షిత రామరాజు, డబుల్స్‌లో పృథ్వీ కృష్ణమూర్తి-సాయి ప్రతీక్ వెనుదిరిగారు. దీంతో టోర్నీలో భారత్ పోరు పూర్తిగా ముగిసింది.

అదిరే ఆటతో.. సిరీస్ వశం


హార్దిక్ పాండ్యా (53)


శివమ్ దూబే (53)

భారత్ ఆల్‌రౌండ్‌షో
నాలుగో టీ20లో విజయం
హార్దిక్, దూబే హాఫ్ సెంచరీలు
ఒత్తిడిలో ఇంగ్లండ్ చిత్తు

పుణె: స్వదేశంలో భారత్ జైత్రయాత్ర సాగిస్తోంది. టీ20 ఫార్మాట్‌లో మరే జట్టుకూ సాధ్యంకాని రీతిలో వరుసగా 17వ సిరీస్‌ను చేజిక్కించుకుంది. శుక్రవారం ఇంగ్లండ్‌తో ఉత్కంఠగా సాగిన నాలుగో టీ20లో భారత్ 15 పరుగులతో నెగ్గింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో విశేషంగా రాణించిన సూర్య సేన 3-1 తేడాతో మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను వశం చేసుకుంది. 2019 నుంచి టీమిండియా సొంత గడ్డపై టీ20 ఫార్మాట్‌లో ద్వైపాక్షిక సిరీస్‌ను ఓడిపోలేదు. ముందుగా భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 181 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (30 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 53), శివమ్ దూబే (34 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 53) అర్ధసెంచరీలు సాధించగా.. అభిషేక్ (29), రింకూ సింగ్ (30) సహకరించారు. సకీబ్‌కు 3, ఒవర్టన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో ఇంగ్లండ్ 19.4 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. బ్రూక్ (51), డకెట్ (39), సాల్ట్ (23) మాత్రమే రాణించారు. దూబే స్థానంలో కంకషన్ సబ్‌గా అరంగేట్రం చేసిన పేసర్ హర్షిత్ రాణా 3 వికెట్లతో అదరగొట్టాడు. అలాగే బిష్ణోయ్‌కు 3, వరుణ్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా దూబే నిలిచాడు.

ఆరంభం బాగున్నా..: 182 పరుగుల ఛేదనలో ఓపెనర్లు డకెట్, సాల్ట్‌ల దూకుడుతో ఇంగ్లండ్ పవర్‌ప్లేలోనే 62 రన్స్ సాధించింది. కానీ మధ్య ఓవర్లలో స్పిన్నర్లు పట్టు సాధించి ఇంగ్లండ్‌ను నేలకు దించారు. మొదట ఐదు రన్స్ తేడాతోనే మూడు వికెట్లు తీసి ఒత్తిడి పెంచారు. 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన బ్రూక్‌తో పాటు కార్స్ (0)ను 15వ ఓవర్‌లో వరుణ్ చక్రవర్తి పెవిలియన్‌కు చేర్చడంతో ఇక కోలుకోలేకపోయింది. మిగిలిన వికెట్లన్నీ టపటపా కోల్పోగా ఆఖరి ఓవర్‌లో సమీకరణం 19 రన్స్‌కు మారింది. అయితే ఇంగ్లండ్ 3 రన్స్ మాత్రమే చేసి ఆలౌటవడంతో భారత్ సంబరాల్లో మునిగింది.

హార్దిక్-దూబే జోరుతో..: సిరీస్‌లో తొలిసారి టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ హార్దిక్-దూబే జోరుతో 12/3 నుంచి 180+ స్కోరుతో ప్రత్యర్థికి సవాల్ విసరగలిగింది. పేసర్ సకీబ్ మహమూద్ తొలి బంతికే శాంసన్ (1) పనిబట్టగా.. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన తిలక్ వర్మ వచ్చీ రాగానే భారీ షాట్‌కు వెళ్లి గోల్డెన్ డకౌటయ్యాడు. అయితే ఆరో బంతికి కెప్టెన్ సూర్యను కూడా డకౌట్ చేయడంతో 12 పరుగుల వద్దే భారత్ కీలక మూడు వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్ రషీద్ బంతి చేతబట్టి ఊపు మీదున్న అభిషేక్‌ను దెబ్బతీశాడు. దీంతో నాలుగో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే రింకూ కూడా పెవిలియన్‌కు చేరగా జట్టు బాధ్యతను దూబే, హార్దిక్ తీసుకున్నారు. ఇద్దరూ చెరో ఎండ్‌లో భారీ షాట్లతో అలరించారు. 14వ ఓవర్‌లో దూబే 4,6.. 16వ ఓవర్‌లో హార్దిక్ 6,6తో స్కోరులో వేగం పెరిగింది. ఆ తర్వాత ఆర్చర్ ఓవర్‌లోనూ తను 6,4 బాదగా దూబే 4తో 17 రన్స్ సమకూరాయి. అటు హార్దిక్ మరో 6,4తో 27 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే భారీ షాట్‌కు వెళ్లి ఒవర్టన్‌కు చిక్కాడు. అప్పటికే ఆరో వికెట్‌కు 87 పరుగులు సమకూరాయి. అటు దూబే సైతం 19వ ఓవర్‌లో రెండు ఫోర్లతో 32 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ చివరి ఓవర్‌లో 3 వికెట్లు కోల్పోయిన భారత్ మూడు పరుగులే చేసింది.

1

ఒకే ఓవర్‌లో పరుగులివ్వకుండా మూడు వికెట్లు తీసిన తొలి ఇంగ్లండ్ బౌలర్‌గా సకీబ్ మహమూద్. అలాగే భారత్‌పై టీ20ల్లో ఈ ఫీట్ నమోదవడం కూడా ఇదే మొదటిసారి.

కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అరంగేట్రం చేసిన తొలి టీ20 ప్లేయర్‌గా హర్షిత్ రాణా.

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (సి) కార్స్ (బి) మహమూద్ 1; అభిషేక్ (సి) బెథెల్ (బి) రషీద్ 29; తిలక్ (సి) ఆర్చర్ (బి) మహమూద్ 0; సూర్యకుమార్ (సి) కార్స్ (బి) మహమూద్ 0; రింకూ (సి) రషీద్ (బి) కార్స్ 30; దూబే (రనౌట్) 53; హార్దిక్ (సి) బట్లర్ (బి) ఒవర్టన్ 53; అక్షర్ (సి) బెథెల్ (బి) ఒవర్టన్ 5; అర్ష్‌దీప్ (రనౌట్) 0; బిష్ణోయ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 181/9. వికెట్ల పతనం:** 1-12, 2-12, 3-12, 4-57, 5-79, 6-166, 7-180, 8-180, 9-181. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-37-0; మహమూద్ 4-1-35-3; కార్స్ 4-0-39-1; ఒవర్టన్ 4-0-32-2; రషీద్ 4-0-35-1.

ఇంగ్లండ్: సాల్ట్ (బి) అక్షర్ 23; డకెట్ (సి) సూర్యకుమార్ (బి) బిష్ణోయ్ 39; బట్లర్ (సి) రాణా (బి) బిష్ణోయ్ 2; బ్రూక్ (సి) అర్ష్‌దీప్ (బి) వరుణ్ 51; లివింగ్‌స్టోన్ (సి) శాంసన్ (బి) రాణా 9; బెథెల్ (సి) సూర్య(బి) రాణా 6; కార్స్ (సి) రింకూ (బి) వరుణ్ 0; ఒవర్టన్ (బి) రాణా 19; ఆర్చర్ (బి) బిష్ణోయ్ 0; రషీద్ (నాటౌట్) 10; సకీబ్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 1; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19.4 ఓవర్లలో 166 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-62, 2-65, 3-67, 4-95, 5-129, 6-133, 7-137, 8-146, 9-163, 10-166. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3.4-0-35-1; హార్దిక్ 1-0-11-0; వరుణ్ 4-0-28-2; అక్షర్ 3-0-26-1; బిష్ణోయ్ 4-0-28-3; రాణా 4-0-33-3.

ఫైనల్లో మనమ్మాయిలు

సెమీఫైనల్లో ఇంగ్లండ్ చిత్తు
దక్షిణాఫ్రికాతో తుదిపోరు రేపు
అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్



కౌలాలంపూర్ : అండర్-19 టీ20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల నుంచి మరో ఆల్‌రౌండ్ ప్రదర్శన. తొలుత స్పిన్నర్లు ప్రత్యర్థిని తిప్పేయగా, స్వల్ప లక్ష్యాన్ని భారత్ సునాయాసంగా ఛేదించింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తొమ్మిది వికెట్లతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి మెగా టోర్నీ ఫైనల్‌కు చేరింది. ఆదివారం జరిగే తుది పోరులో దక్షిణాఫ్రికాను ఎదుర్కొంటుంది. భారత బౌలర్లు పరునిక సిసోడియా (3/21), వైష్ణవీ శర్మ (3/23), ఆయుషీ శుక్లా (2/21) స్పిన్‌కు విలవిలలాడిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 113/8 స్కోరుకే పరిమితమైంది. పెరిన్ (45), నోర్‌గ్రోవ్ (30) మాత్రమే రాణించారు. ఇక..ఓపెనర్లు కమలిని (50 బంతుల్లో 8 ఫోర్లతో 56 నాటౌట్), త్రిష (29 బంతుల్లో 5 ఫోర్లతో 35) మెరవడంతో ఛేదనను భారత్ 15 ఓవర్లలో 117/1 స్కోరుతో పూర్తి చేసి విజయం అందుకుంది. సిసోడియా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

కమిలిని, త్రిష దూకుడు: ఓపెనర్లు కమిలిని, త్రిష ధనాధన్ బ్యాటింగ్‌తో ఛేదనను భారత్ ధాటిగా ఆరంభించింది. దాంతో పవర్ ప్లేలో 44/0తో నిలిచింది. తెలుగు బ్యాటర్ త్రిష మైదానానికి ఇరువైపులా షాట్లతో అలరించింది. ఈ జోడీయే మ్యాచ్‌ను ముగిస్తుందనుకున్న దశలో..త్రిషను స్పిన్నర్ బ్రెట్ బౌల్డ్ చేసింది. దాంతో 60 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ వెంటనే కమలిని కూడా అవుటయ్యేదే. ఆమె కొట్టిన షాట్‌ను ఇంగ్లండ్ కెప్టెన్ అబిగేల్ కవర్స్‌లో పట్టేసింది. కానీ డైవింగ్ చేసి అందుకొనే క్రమంలో ఆమె చేయి నేలను తాకింది. దాంతో మూడో అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడంతో కమలిని ఊపిరి పీల్చుకుంది. అనంతరం సనిక (11 నాటౌట్) జతగా కమిలినీ రెండో వికెట్‌కు అభేద్యంగా 57 పరుగులు జత చేసి జట్టును విజయ తీరాలకు చేర్చింది.

దక్షిణాఫ్రికా తొలిసారి

తొలి సెమీస్‌లో ఆసీస్‌పై నెగ్గిన సఫారీలు తొలిసారి టైటిల్ ఫైట్‌కు చేరారు. మొదట ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 105/8 స్కోరు చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా 18.1 ఓవర్లలో 106/5 స్కోరు చేసి నెగ్గింది.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్: 20 ఓవర్లలో 113/8 (పెరిన్ 45, పరునిక 3/21, వైష్ణవి 3/23); **భారత్: 15 ఓవర్లలో 117/1** (కమలిని 56 నాటౌట్, త్రిష 35).

శ్రీలంక 136/5

గాలె: శ్రీలంక-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టును భారీ వర్షం ఆటంకపరిచింది. దీంతో శుక్రవారం మూడో రోజు 27 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఉదయం 11.45 గంటల నుంచే వర్షం కురవడంతో కాస్త ముందుగానే లంచ్‌కు వెళ్లారు. ఆ సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 136 పరుగులు చేసింది. చాందిమల్ (63 బ్యాటింగ్), కుశాల్ మెండిస్ (10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఎంతసేపటికీ వర్షం తెరిపినివ్వకపోవడంతో మధ్యాహ్నం 3.35 గంటలకు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌ను 654/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

ఆంధ్రకు తొలి పతకం

● జాతీయ క్రీడల్లో బోణీ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ఖాతా తెరిచింది. గుంటూరు యువ వెయిట్ లిఫ్టర్ కె.నీలం రాజు స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. శుక్రవారం డెహ్రాడూన్‌లో జరిగిన ఈ పోటీల్లోని 67 కిలోల విభాగంలో రాజు మొత్తం 289 కిలోల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచాడు. రాజు స్నాచ్‌లో 128 కి., క్లీన్ అండ్ జెర్క్‌లో 161 కి.,ల బరువెత్తాడు. సైక్లింగ్ పోటీల్లో తెలంగాణ సైక్లిస్ట్ ఆశీర్వాద్ సక్సేనా కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు.

కోహ్లీ క్లీన్‌బౌల్డ్

ఆరు పరుగులకే అవుట్
రైల్వేస్‌తో ఢిల్లీ రంజీ మ్యాచ్



న్యూఢిల్లీ: తనకోసం పోటెత్తిన అభిమానులను విరాట్ కోహ్లీ తీవ్రంగా నిరాశ పరిచాడు. రైల్వేస్‌తో రంజీలో కేవలం ఆరు పరుగులకే నిష్క్రమించి ఉసూరుమనిపించాడు. అభిమానుల కేరింతల నడుమ క్రీజులోకి వచ్చిన కోహ్లీ ఓ స్ట్రెయిట్ డ్రైవ్ బౌండరీ కొట్టడంతో ఫ్యాన్స్ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఫోర్ దంచడంతో జోష్ నిండిన ఫ్యాన్స్‌కు హిమాన్షు సంగ్వాన్ వెంటనే షాకిచ్చాడు. అతడు ఆఫ్‌స్టంప్ ఆవలిగా ఫుల్ లెంగ్త్‌లో వేసిన బంతిని కోహ్లీ డ్రైవ్ చేయబోయాడు. కానీ బంతి అనూహ్యంగా బ్యాట్, ప్యాడ్ మధ్య నుంచి దూసుకుపోయి ఆఫ్‌స్టంప్‌ను గిరాటేసింది. అంతే స్టేడియం ఒక్కసారిగా మూగబోయింది. విరాట్ నిరాశగా పెవిలియన్ చేరాడు. అప్పటిదాకా కిటకిటలాడిన స్టేడియం కొద్దిసేపటికే ఖాళీ అయ్యింది. విరాట్ అవుట్‌తో నిరాశ చెందిన ఫ్యాన్స్ స్టేడియాన్ని వీడారు. అనంతరం ఆయుష్ బదోని (99) మెరుపు బ్యాటింగ్‌కు సుమిత్ మాథుర్ (78 నాటౌట్) నిలకడైన ఆట జత కావడంతో..శుక్రవారం, రెండో రోజు ఆఖరికి ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 334/7 స్కోరు చేసింది. రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో 241 రన్స్‌కు ఆలౌటైంది.

పట్టుబిగించిన ఆంధ్ర

విజయనగరం: రాజస్థాన్‌తో మ్యాచ్‌లో ఆంధ్ర పట్టుబిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 220 పరుగులకే ఆలౌటైన ఆంధ్ర..ప్రత్యర్థికి 38 పరుగుల ఆధిక్యాన్ని సమర్పించుకుంది. కానీ పేసర్ పృథ్వీరాజ్ (4/34) విజృంభణతో రెండో ఇన్నింగ్స్‌లో..శుక్రవారం ఆఖరికి రాజస్థాన్‌ను 95/7తో కష్టాల్లో పడింది. మూడోరోజు ఆటలో మిగిలిన మూడు వికెట్లను ఎంత త్వరగా పడగొడితే.. ఆంధ్రకు విజయావకాశాలు అంత అధికంగా ఉంటాయి. మొదటి ఇన్నింగ్స్‌లో రాజస్థాన్ 258 పరుగులు సాధించింది.

సచిన్‌కు జీవన సాఫల్య పురస్కారం

● ఉత్తమ క్రికెటర్లు బుమ్రా, మంధాన
● బీసీసీఐ వార్షిక అవార్డుల ప్రకటన







ముంబై : దిగ్గజ బ్యాటర్ సచిన్ టెండూల్కర్‌కు జీవన సాఫల్య పురస్కారాన్ని బీసీసీఐ ప్రకటించింది. అలాగే భారత జట్టు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఉత్తమ పురుష క్రికెటర్ (2023-24)గా, స్మృతీ మంధానను ఉత్తమ మహిళా క్రికెటర్‌గా ఎంపిక చేసింది. ఈమేరకు శనివారం జరిగే కార్యక్రమంలో వారికి ఈ అవార్డులు అందజేయనుంది. 51 ఏళ్ల సచిన్ మొత్తం 664 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇక 31 ఏళ్ల బుమ్రా.. ఐసీసీ టెస్ట్, ఓవరాల్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా, మంధాన ఐసీసీ వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే.

చిత్రజ్యోతి
SINCE 1965

ఓహో రత్తమ్మా



విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా'. ఇందులో విష్వక్‌సేన్ సోనూ మోడల్, లైలా అనే రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఆకాంక్ష శర్మ కథానాయికగా నటించారు. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో సాహూ గారపాటి నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ చిత్రంలో 'ఓహో రత్తమ్మా' అంటూ జానపద శైలిలో సాగే గీతాన్ని శుక్రవారం యూనిట్ విడుదల చేసింది. పెంచల్‌దాస్ సాహిత్యం అందించడంతో పాటు మధుప్రియతో కలసి ఆలపించారు. లియోన్ జేమ్స్ స్వరపరిచారు. సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్

ఏనాడూ నేను ఏదీ ఆశించలేదు

\- నందమూరి బాలకృష్ణ



పద్మ భూషణ్ అవార్డుకు ఎంపికైన నందమూరి బాలకృష్ణ ను బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'నాకు పద్మ పురస్కారం ఆలస్యంగా వచ్చిందని కొందరు అంటున్నారు. కానీ అది సరి కాదు. మా నాన్న ఎన్టీఆర్‌గారి శత జయంతి వేడుకలు జరుగుతున్న సందర్భం ఇది. 75 ఏళ్ల నటజీవితం ఆయనది. నేను కూడా 50 ఏళ్ల సినీ జీవితాన్ని పూర్తి చేసుకున్నా. మూడు సార్లు వరుసగా హిందూపురంలో గెలిచాను. నేను నటించిన నాలుగు చిత్రాలు వరుసగా అఖండ విజయం సాధించాయి. ఇటువంటి సమయంలో అత్యున్నత పురస్కారం పద్మభూషణ్‌ను అందుకుంటున్నాను. ఇదే సరైన సమయం' అని అన్నారు. 'మా నాన్నగారికి భారతరత్న అందకపోవడం కొంత అసంతృప్తిని కలిగిస్తోంది. త్వరలోనే దానిని కూడా సాధిస్తామనే ఆశ ఉంది' అన్నారాయన. తాను ఏనాడు ఏదీ ఆశించి పని చేయలేదని పేర్కొంటూ 'నాన్న ఆశీర్వాదంతోనే పద్మభూషణ్ నన్ను వరించింది' అన్నారు బాలకృష్ణ.

ఆ పాత్ర కోసం చాలా కష్టపడ్డాను

రష్మిక మందన్న



విక్కీ కౌశల్, రష్మిక మందన్న ప్రధాన పాత్రధారులుగా చారిత్రక కథాంశంతో తెరకెక్కిన హిందీ చిత్రం 'ఛావా'. ఛత్రపతి శివాజీ మహారాజ్ తనయుడు శంభాజీ జీవిత గాథ ఆధారంగా తెరకెక్కింది. శంభాజీ పాత్రలో విక్కీ కౌశల్, ఆయన భార్య యేసుబాయి పాత్రలో రష్మిక నటించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకుడు. ఈ నెల 14న విడుదలవుతోంది. చిత్రబృందం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'జానూ తూ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ 'మళ్లీ హైదరాబాద్‌కు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. కాల్పనిక పాత్రల్లో కొంచెం స్వేచ్ఛ తీసుకోవచ్చు కానీ నిజ జీవిత పాత్రలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకే యేసుబాయి పాత్రను పోషించేందుకు చాలా కష్టపడ్డాను' అని చెప్పారు. విక్కీ కౌశల్ మాట్లాడుతూ 'కొడుకుగా, భర్తగా, యోధుడిగా...భిన్న ఛాయలున్న శంభాజీ పాత్రను పోషించడం సవాల్‌గా అనిపించింది. ఏ. ఆర్ రెహమాన్‌తో కలసి పనిచేయాలన్న కోరిక ఈ చిత్రంతో నెరవేరింది. పోరాట ఘట్టాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

ప్రతి శుక్రవారం ఓ కొత్త అనుభవం

\- నాగ చైతన్య



'సక్సెస్ లేదా ఫెయిల్యూర్‌ను మరీ సీరియస్‌గా తీసుకోకూడదు. ఏది వర్కౌట్ అయింది, ఏది కాలేదన్న దానిపై ఆత్మపరిశీలన చేసుకోవాలి. ముందడుగు వేయాలి. ప్రతి శుక్రవారం ఓ కొత్త అనుభవం' అని అభిప్రాయపడ్డారు నాగ చైతన్య. 'తండేల్' చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పెళ్లి తరవాత తన జీవితం ఎలా ఉందన్న ప్రశ్నకు సమాధానమిస్తూ... 'మాకు పెళ్లి అయి రెండు నెలలే అయ్యింది. మేమిద్దరం ఒకరికొకరం తగినంత సమయం కేటాయిస్తున్నాం. అటు షూటింగులు, ఇటు వ్యక్తిగత జీవితానికి సమానంగా సమయం ఇస్తుండటంతో వర్క్ లైఫ్ బ్యాలెన్స్ బాగుంది. ప్రస్తుతం శోభితతో సంసార జీవితాన్ని బాగా ఎంజాయ్ చేస్తున్నా' అని వివరించారు. నాగ చైతన్య, సాయిపల్లవి నటించిన 'తండేల్' సినిమా ఫిబ్రవరి 7న విడుదలవుతోంది.

మూడో పెళ్లికి సిద్ధమవుతున్నారా?



ఆరు పదుల వయసులో ఉన్న బాలీవుడ్ నటుడు ఆమీర్ ఖాన్ మళ్లీ ప్రేమలో పడ్డారు. బెంగళూరుకి చెందిన ఓ యువతితో ఆయన ప్రేమాయణం సాగిస్తున్నారనీ, ఇటీవలే ఆమెను తన కుటుంబ సభ్యులకు పరిచయం చేశారనీ బీటౌన్‌లో జోరుగా వినిపిస్తోంది. ఆమె ఎవరో వివరాలు తెలియక పోయినా ఆమీర్ ప్రేమకు ఆయన కుటుంబ సభ్యులు ఆమోద ముద్ర వేశారనీ, ఇక వారి పెళ్లి జరగడమే మిగిలిందని అంటున్నారు. ఇది ఆయనకు మూడో పెళ్లి అవుతుంది. ఆమీర్ ఖాన్ తొలి వివాహం 1986లో రీనా దత్తాతో జరిగింది. ఈ జంటకు ఇద్దరు పిల్లలు.. జునైద్ , ఐరా ఖాన్. 2002లో భార్య నుంచి విడిపోయారు ఆమీర్. ఆ తర్వాత దర్శకురాలు కిరణ్ రావుతో నాలుగేళ్లు డేటింగ్ చేసి, 2005లో ఆమెని వివాహం చేసుకున్నారు. వీరిద్దరికీ ఒక కుమారుడు ఆజాద్ ఉన్నాడు. 15 ఏళ్ల వైవాహిక బంధానికి గుడ్ బై చెప్పేసి 2021లో ఆమీర్, కిరణ్ రావు విడాకులు తీసుకున్నారు. మరి ఆమీర్ ఖాన్ మూడో పెళ్లి ఎప్పుడో!

నిన్నే చూస్తూ చూస్తూ



సంతోష్ కల్వచెర్ల, క్రిషేక్ పటేల్ జంటగా రతన్ రిషి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్టిస్ట్'. ఎస్ జేకే ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై జేమ్స్ వాట్ కొమ్ము నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం నుంచి 'చూస్తూ చూస్తూ' అనే పాటను చిత్రబృందం విడుదల చేసింది. 'చూస్తు చూస్తు చూస్తు నిన్నే చూస్తుండిపోయా, చూస్తు చూస్తు నేనే నీకై పోయా, చూస్తు చూస్తు నువ్వే చేశావే మాయ...చూస్తు గుండెల్లోనే దాచా చెలియా' అంటూ హీరో, హీరోయిన్ల మధ్య సాగే ఈ పాటను హోళీ పండగ నేపథ్యంలో కలర్‌ఫుల్‌గా చిత్రీకరించారు. రాంబాబు గోసాల సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం అందించారు. కపిల్ కపిలన్ అద్భుతంగా ఆలపించారు.

కిల్లర్ కథ



సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ కథను అందిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం 'కాఫీ విత్ ఎ కిల్లర్'. సెవెన్‌హిల్స్ సతీశ్ నిర్మించారు. శ్రీనివాసరెడ్డి, సత్యం రాజేశ్, టెంపర్ వంశీ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రం శుక్రవారం నుంచి ఆహా ఓటీటీ ద్వారా స్ట్రీమింగ్ అవనుంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం నిర్వహించింది. ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ 'హీరో హీరోయిన్ లేకుండా విలన్ మాత్రమే ఉండేలా ఒక సినిమా తీయాలనే ఆలోచనతో ఈ కథ మొదలైంది. కథే ఈ చిత్రానికి హీరో' అని చెప్పారు. సెవెన్‌హిల్స్ సతీష్ మాట్లాడుతూ 'మంచి సినిమా చేశాము. ఒక కాన్సెప్ట్‌ని కథగా అనుకొని, సినిమాగా తీసి మీ ముందుకు తీసుకొస్తున్నాం' అన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
శనివారం 1 ఫిబ్రవరి 2025





● కిటకిట..!

పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ (ఇన్‌సెట్‌లో) గాంధీనగర్ కార్యాలయంలో పడిగాపులు

- పోటెత్తిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- నేటి నుంచి భూముల ధరలు పెరగడం వల్లే..
- శుక్రవారం భారీగా జరిగిన లావాదేవీలు
- పటమట, గుణదల, గాంధీనగర్ కార్యాలయాల్లో రద్దీ
- ఒక్కసారిగా ఒత్తిడిపడి స్తంభించిన సర్వర్
- కార్యాలయాల్లోనే పడిగాపులు పడిన సందర్శకులు
- రాత్రి 9.30 గంటల వరకు రిజిస్ట్రేషన్లు
- అర్ధరాత్రి వరకు పనిచేసిన అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రిజిస్ట్రేషన్ల కోసం వచ్చినవారితో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శుక్రవారం కిటకిటలాడాయి. భూముల ధరల పెంపుదల శనివారం నుంచి అమల్లోకి రానుండటంతో శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భారీగా లావాదేవీలు జరిగాయి. విజయవాడ నగరంలోని పటమట, గాంధీనగర్, గుణదల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాల్లోని ఇబ్రహీంపట్నం, నున్న, గన్నవరం, కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కళకళలాడాయి. శనివారం నుంచి భూముల ధరలు పెంచాల్సి ఉండటంతో ఓపక్క సాంకేతిక సిబ్బంది కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోకి భూముల ధరలను అప్‌లోడ్ చేస్తుండటం.. మరోవైపు రిజిస్ట్రేషన్లు కూడా ఎక్కువ మిగతా 6లో..



● శ్రీకారం

గుణదల లూర్దుమాత మహోత్సవాల నవదిన ప్రార్థనలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పుణ్యక్షేత్రం ప్రధాన చర్చి వద్ద మరియమాత పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో ఉత్సవాలు జరుగుతాయి. 8లో

దారుణాలు

జిల్లాలో పెచ్చుమీరుతున్న రికవరీ ఏజెంట్ల వేధింపులు

ఒక్క వాయిదా చెల్లించకపోయినా వీరంగాలు

● రావి సత్తిబాబు (30) ఆటోడ్రైవర్. గుడివాడ రూరల్ మండలం మోటూరు నివాసి. విస్తార్ ప్రైవేట్ బ్యాంక్ నుంచి రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాడు. జనవరి నెల వాయిదా ఐదో తేదీన చెల్లించాలి. భార్య అనారోగ్యానికి గురికావడంతో వాయిదా చెల్లించలేకపోయాడు. ఇదే విషయాన్ని సత్తిబాబు రికవరీ ఏజెంట్లకు చెప్పాడు. అయినా వారు వినలేదు. డబ్బు చెల్లించాలని పదేపదే ఫోన్లు చేశారు. ఈనెల 28వ తేదీన గుడివాడలోని ఆటోస్టాండ్‌కు వెళ్లి గొడవపడ్డారు. అక్కడితో ఆగకుండా ఇంటికి వెళ్లి రచ్చ చేశారు. నెల వాయిదా చెల్లింపు ఆలస్యమైనందుకు ఏకంగా జప్తు నోటీసును అంటించారు. దీనికి మనస్తాపం చెందిన సత్తిబాబు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు.

● హరిత వర్షిణి ఈఏపీసెట్‌లో ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి ప్రభాకర్ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రూ.3.50 లక్షల అప్పు తీసుకుని సకాలంలో చెల్లించలేకపోయారు. రికవరీ ఏజెంట్లు ఇంటికి వెళ్లి ఇష్టానుసారంగా మాట్లాడారు. అమర్యాదగా మాట్లాడారు. చివరికి ఆ అమ్మాయిపై నోరుజారారు. ఈ మాటలకు మనస్తాపం చెందిన హరిత వర్షిణి ఆత్మహత్య చేసుకుంది. నంది గామ రైతుపేటలో గడిచిన ఏడాది జరిగిన ఘటన ఇది.

..ఈ రెండు ఘటనలు రికవరీ ఏజెంట్లు చేస్తున్న దారుణాలకు ప్రత్యక్ష ఉదాహరణలు. వాయిదా చెల్లించడం కాస్త ఆలస్యమైతే చాలు.. చిన్నా పెద్దా, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా నానా బీభత్సం సృష్టిస్తున్నారు. క్రెడిట్ కార్డులు, ప్రైవేట్ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న వారు తర్వాతి రోజుల్లో బాధితులుగా మారుతున్నారు. కొందరు ప్రాణాలు తీసుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ/గుడివాడ) : ప్రస్తుతం క్రెడిట్ కార్డు ఫ్యాషన్ పెరిగిపోయింది. అవసరం ఉన్నా, లేకపోయినా క్రెడిట్ కార్డులు తీసేసుకుంటున్నారు. కార్డు జేబులోకి రాగానే అవసరాలు పెరుగుతున్నాయి. ఇవే కొందరి జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. అదనపు అర్హతతో వచ్చిన క్రెడిట్ కార్డు ఆర్థిక పరిస్థితిని అగమ్యగోచరంగా మార్చేస్తోంది. వాస్తవానికి అన్ని ప్రభుత్వ ప్రైవేటురంగ బ్యాంకులు సొంతంగా క్రెడిట్ కార్డులను ఇస్తున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సిబిల్ స్కోర్‌ను పరిశీలించి కొన్ని బ్యాంకులు క్రెడిట్ కార్డులను జారీ చేస్తున్నాయి. కొన్ని బ్యాంకులు మాత్రం ఆయా బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లను బట్టి కార్డులు ఇస్తున్నాయి. వీటిని తీసుకున్నప్పుడు కనిపించిన ఆనందం ఆ తర్వాత ఉండట్లేదు. బ్యాంకులు ఇచ్చిన క్రెడిట్ కార్డులపై కొందరు రుణాలు తీసుకుంటే, మరికొంతమంది వాయిదాల పద్ధతిలో వస్తువులు

- కనీస మర్యాద కూడా లేకుండా దూషణలు
- ఫోన్లలో లేదంటే ఇళ్ల వద్దకొచ్చి దుర్భాషలు
- గుడివాడ ఘటనలో జరిగింది ఇదే..
- ఒక్క వాయిదా చెల్లించనందుకే ఇంటికి నోటీసు
- మనస్తాపం చెందిన ఆటోడ్రైవర్ సత్తిబాబు
- పరువుపోయిందని పోస్ట్‌చేసి ఆత్మహత్య



కొంటున్నారు. ఈ వాయిదాలు సక్రమంగా చెల్లించినంత కాలం ఎలాంటి సమస్య రావట్లేదు. ఒక్క వాయిదా పడేసరికి మొత్తం ట్రాక్ మారిపోతోంది. మూడు నెలల వరకు వరుసగా వాయిదాలు చెల్లించకపోతే ఆ ఖాతాను మొండిబకాయిలుగా బ్యాంకులు గుర్తిస్తున్నాయి. ఈ ఖాతాలను ఎన్‌పీఏ జాబితాలోకి చేరుస్తున్నాయి. ఈ బకాయిలు వసూలు చేసే బాధ్యతను బ్యాంకులు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తున్నాయి. ఇందుకు ఏజెన్సీకి కమీషన్లు చెల్లిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు 0.5 శాతం, మరికొన్ని మిగతా 6లో..



మృతుడు సత్తిబాబు (ఫైల్), ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఇంటి తలుపునకు అంటించిన నోటీసు, ఫేస్‌బుక్‌లో సత్తిబాబు పోస్ట్

అల్లరి చేసి.. ఉసురు తీశారు!

- గడువు కోరినా.. ఇంటికి నోటీసులు
- మనస్తాపంతో బలవన్మరణం
- వీధిన పడిన కుటుంబం

6లో

ఇనుము విచిత్రాలు కనుము..!

పేదలకు ఇళ్లు పేరిట నాటి వైసీపీ పెద్దల భూకైంకర్యం

తామేం తక్కువ కాదంటూ ఇనుమును అమ్మేసుకున్న అధికారులు, ఉద్యోగులు

- గొల్లపూడి గోడౌన్‌లో పేదల ఇళ్ల ఇనుము మాయం
- అపార్ట్‌మెంట్ బిల్డర్లకు సగంధరకే విక్రయం
- ఇద్దరు ఏఈల సస్పెన్షన్.. విచారణ ప్రారంభం
- జిల్లాలో మరో 22 గోడౌన్ల పరిశీలనకు ఆదేశాలు

కంచే చేను మేస్తే.. అన్నట్టుగా ఉంది.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాయమైన ఇనుము సంగతి వ్యవహారం. పేదలకు ఇళ్ల పట్టాల పేరిట భూముల కొనుగోళ్లలో అప్పటి ప్రభుత్వ పెద్దలు భారీగానే కైంకర్యం చేయగా, తామేమన్నా తక్కువ తిన్నామా.. అంటూ అధికారులు, ఉద్యోగులు పేదల ఇళ్లకు అవసరమైన ఇనుమును అమ్మేసుకున్నారు. గొల్లపూడి గోడౌన్‌లోని ఇనుమును అపార్ట్‌మెంట్ బిల్డర్లకు అమ్ముకున్న ఘటన తాజాగా వెలుగుచూడగా, బాధ్యులైన ఏఈలను హౌసింగ్ అధికారులు సస్పెండ్ చేశారు. జిల్లాలోని 22 గోడౌన్లలో ఎంత ఇనుము మాయమైందో పరిశీలించనున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో నిల్వ చేసిన రూ.2 కోట్ల విలువైన 271.152 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను అధికారులు, ఉద్యోగులు కలిసి పక్కదారి పట్టించడం చర్చనీయాంశంగా మారింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 22 గోడౌన్లలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం ఇనుమును నిల్వ చేశారు. ఒక్క గోడౌన్ మిగతా 6లో..

బంగారం బెధరహో..

మాఘమాసం ఆరంభంతోనే పైపైకి..

వన్‌టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మాఘమాసం మొదలైందో లేదో బంగారం జిగేల్‌మంటోంది. పెళ్లిళ్లు, శుభకార్యాలకు అనువైన మాసం కావడంతో ఒక్కసారిగా బంగారం ధర పైకి ఎగసింది. మధ్యతరగతి వారు బంగారం, వెండి రేట్లు చెప్పగానే బాబోయ్.. అనే రోజులతో పాటు ధనికులు కూడా బంగారం పేరు చెబితే భయపడిపోయే పరిస్థితులు వచ్చాయి. శుక్రవారం నాడు విజయవాడ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం పది గ్రాములు రూ.85 వేలు ఉండగా, 22 క్యారెట్ల బంగారం పది గ్రాములు రూ.79,500కు చేరింది. వెండి కూడా మోత మోగిస్తోంది. కిలో రూ.96 వేలకు చేరింది. ఈ ధరలు ఆల్‌టైం హైగా విజయవాడ బులియన్ మార్కెట్ వర్గాలవారు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఇంకెన్నాళ్లు నడుస్తుందోనని కొనుగోలుదారులు భయపడిపోతున్నారు.

దేవాంతకుడు

దుర్గగుడిలో దళారీ రూటేవేరు

- కాంటాక్ట్ లిస్టులో లేని సిబ్బంది ఫోన్ నెంబర్లు
- మెదడులో నిక్షిప్తం చేసుకుని ఎప్పటికప్పుడు పేమెంట్లు
- ఫోన్‌పే, గూగుల్ పే చెల్లింపులు మాత్రమే ఫోన్లలో..
- విచారణలో మూడు విభాగాల పేర్లు బహిర్గతం
- 41ఏ నోటీసు ఇచ్చి నిందితుడ్ని వదిలిపెట్టిన పోలీసులు



డిప్యూటీ శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నిత్యం మనతో తిరిగే వ్యక్తిని చాలా సులువుగా గుర్తుపడతాం. కానీ, అతని ఫోన్ నెంబరును మాత్రం టక్కున చెప్పలేం. ఫోన్‌లో కాంటాక్ట్ లిస్ట్ చూసి చెప్తాం. అటువంటిది ఓ దళారీ మాత్రం పదుల సంఖ్యలో ఉన్న దుర్గగుడి సిబ్బంది ఫోన్ నెంబర్లను మైండ్‌లో భద్రపరుచుకున్నాడు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగిస్తున్నా.. దాన్ని ఫోన్లు చేయడానికి, గూగుల్, ఫోన్‌పేల్లో డబ్బులు పంపడానికే వినియోగించాడు. దుర్గగుడిలో భక్తుల నుంచి డబ్బు వసూలుచేసి అనధికారికంగా దర్శనాలు చేయిస్తున్న దళారీ 'డిప్యూటీ' శ్రీనివాస్ మేధోశక్తి ఇది. డిప్యూటీ శ్రీనివాస్ కేసు విచారణలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. శ్రీనివాస్ ఫోన్‌ను పోలీసులు సీజ్ చేయగా, విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా చెల్లింపుల్లో మాత్రమే నెంబర్లు కనిపిస్తున్నాయి. కాంటాక్ట్ మిగతా 6లో..

భూమ్‌ధామ్..!

నేటి నుంచి పెరిగిన భూముల ధరలు అమల్లోకి..

నగరంలో కనిష్టంగా ధరల పెంపు ● బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో 3 శాతమే..

- మిగిలిన ప్రాంతాల్లో గరిష్టంగా 10 శాతం వరకు..
- బందరు రోడ్డు, ఏలూరు రోడ్లలో ఇక గజం రూ.1.15 లక్షలు
- మచిలీపట్నంలో 10 నుంచి 15 శాతం పెంపు
- రెండు జిల్లాల మున్సిపాలిటీల్లో 10 శాతం
- నాలుగేళ్లుగా పెంపుదల లేని ప్రాంతాల్లో 15 శాతం
- రెండు జిల్లాల గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం ఫిక్స్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పెంచిన భూముల ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా 5 నుంచి 15 శాతం మేర భూముల ధరలను పెంచారు. నాలుగేళ్లుగా ఎలాంటి పెంపుదలకు నోచుకోని ప్రాంతాల్లో గరిష్టంగా 10 శాతం మేర పెంచారు. విజయవాడ నగరంలో చాలా తక్కువగా పెంచారు.

ర్యాపిడ్ గ్రోత్ ఏరియాల్లో 15 శాతం వరకు..

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పరిధిలోని ర్యాపిడ్ గ్రోత్ ఏరియాల్లో మాత్రం 10 నుంచి 15 శాతం మేర భూముల ధరలు పెంచారు. విజయవాడ నగరం విషయానికొస్తే.. వరద ప్రభావిత ప్రాంతాల్లో భూముల ధరల పెంపు అత్యల్పంగా జరిగింది. బుడమేరు వరద ప్రభావ ప్రాంతాలైన సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక, రాధానగర్, జక్కంపూడి, నందమూరినగర్, వాంబేకాలనీ, రాజరాజేశ్వరిపేట, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, బర్మాకాలనీ, సుందరయ్యనగర్, పటేల్ నగర్, శాంతినగర్, ప్రశాంతినగర్, అంబాపురం, జక్కంపూడి, పి.నైనవరం తదితర ప్రాంతాల్లోని డివిజన్లలో 3 శాతం మించి భూముల ధరలు పెంచలేదు. బందరు రోడ్డు, ఏలూరు రోడ్లలో 5 నుంచి 8 శాతం మేర భూముల ధరలు పెంచారు. దీంతో బందరు రోడ్డులో గజం రూ.1.15 లక్షలు, ఏలూరు రోడ్డులో గజం రూ.1.15 లక్షలైంది. ఈ దఫా మిగతా 6లో..



● కొత్త బాస్‌తో సీపీ

నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తాను ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.
- విజయవాడ, ఆంధ్రజ్యోతి



చిట్టూరి భార్గవ్ (ఫైల్)

చదువు కోసం వెళ్లి దుర్మరణం

- ఐర్లాండ్‌లో రోడ్డు ప్రమాదం
- జగ్గయ్యపేట, గుంటూరు యువకుల మృతి
- చెట్టును ఢీకొన్న కారు.. మరో ఇద్దరికి గాయాలు

8లో

మిద్దెతోట.. ఆరోగ్యానికి కోట

- 70 ఏళ్ల విశ్రాంత ఉపాధ్యాయిని శ్రమకు ప్రతిఫలం
- మచిలీపట్నంలోని గాంధీనగర్‌లో అందాల వనం
- సేంద్రియ ఎరువులతో స్వచ్ఛమైన కూరగాయలు

8లో

కుంభమేళాకు ప్రత్యేక బస్సులు

- 11న తిరుపతి నుంచి, 12న నెల్లూరు నుంచి పర్యాటక బస్సులు
- 5న పీఎన్‌బీఎస్ నుంచి ఆర్టీసీ బస్సు



టీడీపీ కౌన్సిలర్ రాజీనామా


కమిషనర్‌కు రాజీనామా లేఖ అందజేస్తున్న కౌన్సిలర్ సంధ్యారాణి

జగ్గయ్యపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పుర పాలకసంఘ 21వ వార్డు టీడీపీ కౌన్సిలర్ గెల్లా సంధ్యారాణి గురువారం రాత్రి తన పదవికి రాజీనామా చేస్తు కమీషనర్ ఎం.రామ్మోహన్‌కు లేఖను అందజేశారు. ఆమె భర్త వైకుంటేశ్వరరావు 21వ క్లస్టర్ ఇన్‌చార్జ్ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికీ రాజీనామా చేస్తూ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు పత్రాలు అందజేశారు. దీనిని సామాజిక మాధ్యమాల లో పోస్టు చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల పదవులకు న్యాయం చేయలేక పోతున్నందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే తాతయ్య, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావులు సంధ్యారాణి, వైకుంటేశ్వరరావు దంపతులతో మాట్లాడారు.

3న కృష్ణా వర్సిటీలో ఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు

మచిలీపట్నం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మా స్యూటికల్స్ ఆఫ్ రీసెర్చ్‌లో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు ఫిబ్రవరి 3న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్టు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఎల్.సుశీల్ తెలిపారు. 3న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియలో ఈపీసీఈటీ పరీక్షకు హాజరుకాని వారు, పరీక్షకు హాజరై అర్హత సాధించని వారికి కూడా అవకాశం కల్పించామన్నారు. రూ.1800 చెల్లించి అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనవచ్చన్నారు. 10వ తరగతి, ఇంటర్, ట్రాన్స్ సర్టిఫికెట్‌లు, కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో హాజరు కావాలన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో చేరిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. కాగా 3, 5, 9వ సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావు వెల్లడించారు. 6006 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2962 మంది ఉత్తీర్ణత సాధించారు. 49.31 శాతం ఉత్తీర్ణత పొందినట్టు పరీక్షల నియంత్రణ అధికారి పీవీ బ్రహ్మాచారి తెలిపారు.

కూచిపూడి నాట్య పరీక్షలు ప్రారంభం

కూచిపూడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో ఎంపీఏ నాట్య ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దరువులు, ఉపకరణాల అంశాలపై పరీక్షలు నిర్వహించగా, 17 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల పరిశీలకునిగా భాగవతుల శ్రీనివాస శర్మ, చీఫ్ సూపరింటెండెంట్‌గా చింతా రవిబాలకృష్ణ వ్యవహరించారు. నట్టువాంగంపై యేలేశ్వరపు శ్రీనివాసులు, గాత్రం వెంకట దుర్గాభవాని, తబలా హరనాథ శాస్త్రిలు సహకరించారు.

ఇనుము విచిత్రాలు
కనుము..!

(5వ పేజీ తరువాయి)

పరిధిలోనే ఇంత భారీసంఖ్యలో ఇనుము మాయమైతే, మిగిలిన గోడౌన్లలో పరిస్థితి ఏమిటోనన్న అంశం ప్రశ్నార్థకంగా మారింది. అన్ని గోడౌన్లలోని ఇనుము నిల్వలను పరిశీలించాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా పీడీకి రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎండీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా గోడౌన్లకు ఎంతమేర స్టీల్ వచ్చిందన్న వివరాలను ఆన్‌లైన్ ద్వారా పరిశీలిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా శనివారం నుంచి క్షేత్రస్థాయిలో గోడౌన్లను పరిశీలించనున్నారు.

ఇనుము లేక పూర్తికాని ఇళ్లు

ఓవైపు చాలా ఇళ్ల నిర్మాణాలు మొండిగోడల దశలోనే ఉన్నాయి. పేదలకు ఇవ్వాల్సిన ఇనుమును ఇవ్వకుండా నిర్మాణాలకు అడ్డుపడ్డారు. ఇనుమును మాత్రం పక్కదారి పట్టించేశారు. ఇనుము సకాలంలో రాక ఎన్నో లే అవుట్లలో పనులు పునాదుల దశలోనే ఆగిపోయాయి. దీంతో డబ్బు లేకపోయినా లబ్ధిదారులతో అప్పులు చేయించి మరీ ఇళ్లు కట్టుకునేందుకు ప్రోత్సహించారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే వాటా సరిపోకపోవటంతో.. ఆ భారాన్ని లబ్ధిదారుల నెత్తిన వేశారు. అప్పులు చేసి తమ వాటా కట్టిన లబ్ధిదారులకు గృహ నిర్మాణ సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో చుక్కలు చూపించారు. సకాలంలో ఇనుము ఇవ్వకపోవటంతో.. బిలో బేస్‌మెంట్ కూడా దాటని ఇళ్లు వేల సంఖ్యలో అలాగే ఉండిపోయాయి.

జిల్లాలో ఇళ్ల పరిస్థితి ఇదీ..

బిలో బేస్‌మెంట్ దశలో ఉన్న వాటికి 40 కేజీల సిమెంట్, 22,391.37 కేజీల ఇనుము ఇవ్వాల్సి ఉంటుంది. సిమెంట్ బస్తాలు ఇచ్చినా ఇనుము విషయంలో జాప్యం చేయటంతో ఎక్కువ సంఖ్యలో ఇళ్లు బిలో బేస్‌మెంట్ దశలోనే ఉండిపోయాయి. అలాగే, రూఫ్ స్లాబ్ వేసే దశలో ఒక్కో లబ్ధిదారుడికి 9,285.66 కేజీల ఇనుమును ఇవ్వాల్సి ఉంటుంది. తొలిదశలో ఇవ్వాల్సిన ఇనుమునే సక్రమంగా ఇవ్వకపోవటంతో బిలో బేస్‌మెంట్ దాటడమే గగనంగా మారింది. దీంతో బీబీఎల్‌కు ముందు ఇచ్చే స్టీల్‌తో పాటు రూఫ్ స్లాబ్‌లో ఇచ్చే స్టీల్ కూడా పెద్ద ఎత్తున గోడౌన్లలో నిల్వ ఉండిపోయింది. ఈ ఇనుముపై అవినీతి అధికారులు, ఉద్యోగుల కన్ను పడింది. గొల్లపూడి గోడౌన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్లు బి.శ్రీనివాసరావు, ఎం.శ్రీధర్‌కుమార్‌తో పాటు మరో ఐదుగురు ఏఈఈలు కలిసి ఇనుమును గుట్టుగా తరలించేశారు. వెలగలేరులోని లే అవుట్ పేరుతో ఈ ఇనుమును సగం ధరకే అపార్ట్‌మెంట్లు నిర్మించే బిల్డర్లకు అమ్మినట్టు తెలుస్తోంది.

తండాల్లో నవోదయం జరిగేనా!

ఎక్సైజ్ సిబ్బంది కొరత.. కొరవడిన నిఘా

సారా రహిత రాష్ట్రంగా ఏపీని నిలపాలని కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో చర్యలకు ఉపక్రమించింది. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నాటుసారా అరికట్టేందుకు 'నవోదయం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు తీసుకుంటే గాని తండాల్లో నాటు సారా రహిత 'నవోదయం' సాధ్యం కాని పరిస్థితి. సారా తయారీ, రవాణా, విక్రయాల్లో విస్సన్నపేట, రెడ్డిగూడెం, తిరువూరు మండలాలు డేంజర్ జోన్‌లో ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి, విస్సన్నపేట)


తండాల్లో సారా తయారీ


విస్సన్నపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్

ఎన్టీఆర్ జిల్లాలో 36 గ్రామాలు సారా రహిత గ్రామాల జాబితాలో ఉండగా వీటిలో 29 గ్రామాలు విస్సన్నపేట, రెడ్డిగూడెం, తిరువూరు, ఎ.కొండూరు ప్రాంతాల్లో ఉన్నాయి. విస్సన్నపేట మండలం తాతాకుంట్ల, వేమిరెడ్డిపల్లి, కలగర, చంద్రుపట్ల, తెల్లదేవరపల్లి, రెడ్డిగూడెం మండల అన్నేరావుపేట తదితర చోట పెద్ద ఎత్తున సారా తయారు కావడంతో ఆ మండలాల్లో గ్రామాలను ఏ గ్రేడ్‌గా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరి విస్సన్నపేట కేంద్రంగా చాట్రాయి, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాలను కలిపి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటు చేసి సారా నియంత్రణలో కొంత మేర అధికారులు సఫలీకృతులయ్యారు. అనంతరం ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. విస్సన్నపేటలోని ఎక్సైజ్‌స్టేషన్ ఎస్ఈబీ ఏర్పాటు చేశారు. ఏసీపీ స్థాయి అధికారులను ఇన్‌చార్జిలుగా వేశారు. దీంతో సారా తయారీ అదుపులోకి వచ్చింది. కొద్ది రోజుల అనంతరం విస్సన్నపేట ఎస్ఈబీ స్టేషన్‌ను విడదీసి చాట్రాయి మండలాన్ని నూజివీడులో కలిపారు. రెడ్డిగూడెం మండలాన్ని మైలవరంలో, విస్సన్నపేట మండలాన్ని తిరువూరులో కలిపి విస్సన్నపేట నుంచి స్టేషన్‌ను ఎత్తివేశారు. దీంతో ఇక్కడ స్టేషన్ లేకుండా పోయింది. ఏ గ్రేడ్ ఉన్న విస్సన్నపేట మండలంలో స్టేషన్ లేకపోవడంతో సారా తయారీ, రవాణాపై నిఘా లేకుండా పోయింది. అధికారులు స్పందించి విస్సన్నపేటలో ప్రత్యేక స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు మండలాలకు ఆరుగురే సిబ్బంది

విస్సన్నపేట, తిరువూరు మండలాల్లో సారా తయారీ, రవాణాను నియంత్రించేందుకు సరిపడా ఎక్సైజ్ సిబ్బంది లేరు. స్టేషన్ పరిధిలో 18 మందికి గాను కేవలం ఆరుగురు మాత్రమే ఉండటంతో సారా నియంత్రణపై సందేహాలు వినిపిస్తున్నాయి.

ముడి పదార్థాలపై నిఘా నిల్

ఎక్సైజ్ సిబ్బంది తండాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి వేల లీటర్ల బెల్లపు ఊటను


ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట డ్రమ్ములు

ధ్వంసం చేస్తున్నారే తప్ప సారా తయారీకి వినియోగించే బెల్లం, ఇతర ముడి పదార్థాలపై దృష్టి సారించడం లేదని విమర్శలు ఉన్నాయి. ముడి సరుకులను అడ్డుకుంటే సారా తయారీని సగానికి సగం అరికట్టవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

- ఎస్.శ్రీనివాసరావు (ఎక్సైజ్ సూపరింటెండెంట్)

తండాల్లో నాటు సారా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ప్రత్యేక టీమ్స్ వేసి నిరంతరం దాడులు చేస్తున్నాం. విస్సన్నపేట కేంద్రంగా ఎక్సైజ్ స్టేషన్ను తిరిగి ఏర్పాటు చేసేందుకు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్టేషన్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తాం.



క్రైమ్ ఉన్న చోట స్టేషన్ ఉండాలి

బోట్ల శివ సత్యనారాయణ, సామాజిక కార్యకర్త

విస్సన్నపేటలో ప్రత్యేకంగా స్టేషన్ ఉండాలి. మండలంలో నాటుసారా తయారీ, విక్రయం, రవాణా అధికంగా ఉండి అందుకే ఇక్కడే స్టేషన్ ఉండాలి. అధికారులు చర్యలు తీసుకొని విస్సన్నపేటలో స్టేషన్ ఏర్పాటు చేయాలి.

సొసైటీల అధ్యక్ష ఎంపికపై ఉత్కంఠ!

తిరువూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎనిమిది సొసైటీల పాలకవర్గం ఎంపికపై టీడీపీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే వివిధ సొసైటీల అధ్యక్షులుగా కొన్నిపేర్లు తెరపైకి వచ్చినా చివరి నిముషంలో కొత్తపేర్లు వినిపిస్తుండటంతో ఆశావహులు అధ్యక్ష పదవి రేసులో నిలుస్తున్నారు. పార్టీలో అన్నివర్గాల వారికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సొసైటీ అధ్యక్ష పదవికి పార్టీ అధిష్టానం సమక్షంలో డ్రాతీయించి రిజర్వేషన్ ప్రకటించారు. నాలుగు సొసైటీలు జనరల్, ఒకటి జనరల్ మహిళ, ఒకటి ఎస్సీ, ఒకటి బీసీకి కేటాయించారు. సొసైటీలకు సంబంధించి మునుకుళ్ల ఎస్సీ, చింతలపాడు బీసీ, లక్ష్మీపురం మహిళకు కేటాయించగా, నడిం తిరువూరు, మల్లేల, ముష్టికుంట్ల, వావిలాల, టేకులపల్లి సొసైటీలను జనరల్‌కు కేటాయించారు. సొసైటీలలో తెలుగుయువతకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ నియోజకవర్గంలో గట్టిగా వినిపిస్తున్నది. పీఏసీఎస్‌ల పాలవర్గం అధిష్టానం నిర్ణయం మేరకు ఉంటుందనే సమాచారంతో సొసైటీలో చోటుదక్కకపోతుందా అన్న ఆశతో కొందరు నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఉపాధి కూలీ దినసరి వేతనం
రూ.300 అందాల్సిందే

- క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ప్రణాళికతో వ్యవహరించాలి
- క్రమశిక్షణ రాహిత్యం కనిపిస్తే ఉపేక్షించను
- ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలన్నీ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలి
- తడి-పొడి చెత్త సేకరణ, నిర్వహణ సరైన విధంగా జరగాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కృష్ణలంక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా కూలీలు దినసరి వేతనం రూ.300 హక్కుగా పొందేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సరైన ప్రణాళికతో పనులు చేపట్టేలా వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ, ఆర్డీవోలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఉపాధి పథకం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, పెన్షన్ల పంపిణీ తదితరాలపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులకు సరైన అవగాహన కల్పించి ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 లభించేలా డ్వామా అధికారులు, ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. పనిమార్కింగ్, మస్టరింగ్ విషయాల్లో స్పష్టమైన అవగాహనతో వ్యవహరించాలన్నారు. పటిష్ట పర్యవేక్షణ అవసరమని అప్పుడే లక్ష్యాలను చేరుకొనేందుకు వీలవుతుందన్నారు. విధుల నిర్వహణలో ఎక్కడైనా నిర్లక్ష్యం కనిపిస్తే ఉపేక్షించేది లేదని, క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. 286 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 264 ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. కేంద్రాలు లేని 22 గ్రామ పంచాయతీల్లో వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏవైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే పూర్తిచేసి, నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. అన్ని కేంద్రాలను రహదారితో అనుసంధానం చేసి ఫెన్సింగ్‌తో పాటు వర్మీ సీడింగ్ జరిగేలా కృషిచేయాలన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై ప్రత్యేక దృష్టిపెట్టండి

గ్రామ పంచాయతీల్లో ప్రతి వెయ్యిమందికి ఒక క్లాప్ మిత్ర వుండేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని గ్రామ పంచాయతీల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అమలుకు చొరవచూపాలని, 100 శాతం తడి, పొడి చెత్తను సేకరించేలా చూడాలన్నారు. అవగాహన శిబిరాల నిర్వహణ, చెత్తను బట్టి వేర్వేరుగా సేకరించడం, బిన్స్‌ను అందుబాటులో వుంచడం వంటివి చేయాలన్నారు. అదేవిధంగా హౌస్‌హోల్డ్ డేటాబేస్ సర్వేలో భాగంగా గృహాల జియో ట్యాగింగ్, డేటా అనుసంధాన ప్రక్రియను పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఉదయం 6కే పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలి

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో పెట్టుకొని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని, ఉదయం 6 గంటలకు పంపిణీని ప్రారంభించి, మొదటి రోజే పూర్తిచేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 2,29,913 పెన్షన్లకు రూ.98.20 కోట్లు విడుదల చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. టెలీకాన్ఫరెన్సులో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎ.రాము, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

దేవాంతకుడు

(5వ పేజీ తరువాయి)

జాబితాలో మాత్రం ఎవరి ఫోన్ నెంబర్లు సేవ్ చేయలేదు. డిప్యూటీ శ్రీనివాస్ దారుణాలకు సహకరిస్తున్న సిబ్బంది ఫోన్ నెంబర్లన్నింటినీ ఆయన రక్షున నోటితో చెప్పేస్తుండటం గమనార్హం.

మూడు విభాగాలు.. ముగ్గురు

డిప్యూటీ శ్రీనివాస్ ఫోన్ నుంచి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మూడు విభాగాల్లో ఉన్న సిబ్బందికి 'పే'మెంట్లు బాగా జరిగినట్టు తెలిసింది. అన్నదాన విభాగంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి, స్కానింగ్ విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి, మైక్ విభాగంలోని మరో ఉద్యోగికి ఈ చెల్లింపులు జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మూడు విభాగాల్లోనే కాకుండా ఇతర విభాగాల్లోనూ డిప్యూటీ శ్రీనివాస్‌కు సహకరించిన వారున్నారు. నిందితుడు శ్రీనివాస్‌కు పోలీసులు 41ఏ నోటీసు ఇచ్చారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు చెబుతున్నారు. ఇన్నాళ్లూ డిప్యూటీ శ్రీనివాస్‌తో సత్సంబంధాలు నడిపిన దేవస్థాన ఉద్యోగులు ఇప్పుడు వారి పేర్లు బయటకు వస్తాయన్న ఆందోళనలో ఉన్నారు. కొంతమంది స్వయంగా శ్రీనివాస్‌ను కలిసి పోలీసు విచారణలో తమ పేర్లు వెల్లడించొద్దని వేడుకున్నట్టు సమాచారం.

భూమ్‌ధామ్..!

(5వ పేజీ తరువాయి)

బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు వెంబడి భూముల ధరలను సమానంగా పెంచారు. దీంతో విజయవాడలోనే కాకుండా ఉమ్మడి జిల్లాలోనే బందరు రోడ్డు, ఏలూరు రోడ్ల వెంబడి భూముల ధరలు అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి.

- తూర్పు నియోజకవర్గంలోని సూర్యారావుపేటలో గజం రూ.66 వేల నుంచి రూ.69 వేలు, మొగల్రాజపురం పరిధిలో రూ.46 వేల నుంచి రూ.49 వేలు, సీతారామపురం, కస్తూరిబాయిపేట, సూర్యారావుపేటలో రూ.46 వేల నుంచి రూ.49 వేలు, గిరిపురంలో రూ.23 వేల నుంచి రూ.26 వేలు, లబ్బీపేటలో రూ.63 వేల నుంచి రూ.66 వేలు, చంద్రమౌళిపురం, రెవెన్యూ కాలనీ, కేజే గుప్తా ఎంప్లాయిస్ కాలనీల్లో రూ.63 వేల నుంచి రూ.66 వేలు, కృష్ణలంలో రూ.41 వేల నుంచి రూ.43 వేలు, పటమటలో రూ.47 వేల నుంచి రూ.49 వేలు, గాయత్రీనగర్, అశోక్‌నగర్‌లో రూ.56 వేల నుంచి రూ.58 వేలు, ఎస్‌బీహెచ్, పీఅండ్‌టీ కాలనీ, కేపీ నగర్‌లో రూ.56 వేల నుంచి రూ.58 వేలు, సిద్ధార్థ నగర్, నవోదయనగర్, ఎస్‌బీఐ కాలనీల్లో రూ.56 వేల నుంచి రూ.58 వేలు, అయ్యప్పనగర్, అశోక్‌నగర్ లో రూ.41 వేల నుంచి రూ.43 వేల మేర పెంచారు.
- విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల పరిధిలో బ్రాహ్మణవీధి, మసీదు వీధి, ప్రాంతంలో గజం రూ.28 వేలకు పెంచారు. గాంధీహిల్ ఏరియాలో రూ.28 వేలు, శంకరమఠం వీధి రూ.33 వేలు, లేబర్ కాలనీ రూ.28 వేలు, టన్నెల్ రోడ్డు, ఆంజనేయవాగు, కేఎల్ రావు నగర్ రూ.19 వేలు, గొల్లపాలెం గట్టు, కుమ్మరిపాలెంలో రూ.28 వేలు, రైల్వే క్వార్టర్స్ రూ.64 వేలు, కేదారేశ్వరపేట రూ.28 వేలు, పాత రాజరాజేశ్వరిపేట రూ.17 వేలు, మధురానగర్ పప్పులమిల్లు రూ.31 వేలు, రైల్వేకాలనీ రూ.42 వేలు, బావాజీపేట, గులాబీతోటలో రూ.33 వేలు, పాయకాపురం, రాధానగర్, బర్మాకాలనీ, ప్రజాశక్తి నగర్, ఎల్‌బీఎస్ నగర్, ప్రకాష్‌నగర్‌లో రూ.17 వేల చొప్పున భూముల ధరలు పెంచారు.
- కానూరులో 1-6 వార్డుల పరిధిలో రూ.18 వేలు, 7 నుంచి 12 వార్డుల పరిధిలో రూ.20 వేలు, ఇతర వార్డుల్లో రూ.20 వేలుగా భూముల ధరలు పెంచారు. విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాలైన రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, గన్నవరం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, కొండపల్లి, నున్న తదితర ప్రాంతాల్లో గరిష్టంగా 8 శాతం మేర భూముల ధరలను పెంచారు.
- ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోకి వచ్చే మునిసిపాలిటీల పరిధిలో మాత్రం 10 నుంచి 15 శాతం మేర భూముల ధరలు పెంచారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఇబ్రహీంపట్నం, జగ్గయ్యపేట కంచికచర్ల, మైలవరం, నందిగామ, నున్న, పటమట, తిరువూరు, విజయవాడ, విస్సన్నపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో కనిష్టంగా 3 శాతం నుంచి గరిష్టంగా 15 శాతం వరకు భూముల ధరలను పెంచారు. కృష్ణాజిల్లా పరిధిలో మచిలీపట్నం, అవనిగడ్డ, చల్లపల్లి, గన్నవరం, గుడివాడ, కంకిపాడు, కానుమోలు, కౌతవరం, మొవ్వ, పామర్రు, పెడన, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో కూడా 10 నుంచి 15 శాతం మేర భూముల ధరలు పెంచారు.

అల్లరి చేసి.. ఉసురు తీశారు!

అంతంతమాత్రంగా ఆర్థిక పరిస్థితి.. సొంత ఇల్లు ఉండటంతో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీకి ఇంటిని తనఖా పెట్టి రుణం తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తాలుకు కిస్తీలు సకాలంలో చెల్లిస్తూ గుట్టుగా జీవనం సాగిస్తున్నాడు. ఒక నెల కిస్తీ ఆలస్యమవడంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు చేసిన ఒత్తిడి, అల్లరితో.. ఇంటా, బయటా పరువు పోవడంతో ఆటో డ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడి కుటుంబం రోడ్డున పడింది.

గుడివాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ మండలం మోటూరు గ్రామానికి చెందిన రావి సుబ్బారావు కుమారుడు సత్తిబాబు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక అవసరాల నిమిత్తం.. 'విస్తార్ ఫైనాన్స్' సంస్థలో ఇంటికాగితాలు తనాఖా పెట్టి రూ.7.80 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పటి నుంచి ప్రతినెల 5వ తేదీన కిస్తీ చెల్లిస్తున్నట్టు మృతుడి భార్య తెలిపింది. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా కిస్తీని చెల్లించేందుకు సత్తిబాబు ప్రైవేట్ ఫైనాన్స్ ప్రతినిధులను మరికొంత గడువు కోరినట్టు చెప్పింది. అయితే ఈనెల 25 వరకు కిస్తీలు చెల్లించకపోవడంతో 'విస్తార్' రికవరీ ప్రతినిధులు రంగంలోకి దిగి పోరంకిలో సత్తిబాబు ఉన్నట్టు

- ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ఆగడాలు
- గడువు కోరినా.. ఇంటికి నోటీసులు
- మనస్థాపంతో ఆటోడ్రైవర్ బలవన్మరణం
- దిక్కులేక వీధిన పడిన కుటుంబం


భార్య, ఇద్దరు పిల్లలతో సత్తిబాబు (ఫైల్‌ఫొటో)

తెలుసుకుని అక్కడికి వెళ్లి నానారభస చేశారని, సత్తిబాబు ఆటోస్టాండ్‌లో ఉండగా వెళ్లి దుర్భషలాడారని దాంతో తీవ్ర మనస్థాపం చెందినట్టు పేర్కొంది. భార్యకు ఆరోగ్యం బాగోలేదని, అందుకే కిస్తీ చెల్లింపులో జాప్యం జరిగిందని వేడుకున్నా కిస్తీ కట్టాలంటూ సత్తిబాబుపై ఒత్తిడి చేశారని పేర్కొంది.

ఇంటికి వచ్చి బెదిరించారు..

ఇటీవల సత్తిబాబు ఇంటికి వెళ్లి కిస్తీ చెల్లించాలని ఫైనాన్స్ ప్రతినిధులు హంగామా చేశారు. "ఇల్లు తాకట్టులో ఉందని, వ్యవహారాలు, ఒప్పందాలు 'విస్తార్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధీనంలో ఉన్నాయి" అని నోటీసులు కూడా అంటించారు. భర్త ఇంట్లో లేరని, వచ్చాక చెప్పి ఫోన్ చేయిస్తానని చెప్పినా ప్రతినిధులు వినకుండా ఇంటికి తాళాలు వేస్తామని బెదిరించారు. రాత్రి పని ముగించుకుని ఇంటి వచ్చిన సత్తిబాబుకు భార్య పద్మావతి 'విస్తారా' ప్రతినిధులు చేసిన హంగామా, గొడవను మొత్తం వివరించింది.

మనస్థాపంతో బలవన్మరణం..

ఇంటా, బయటా అల్లరి అవ్వడంతో మనస్థాపం చెంది



సత్తిబాబు ఇంటికి విస్తార్ సంస్థ అంటించిన నోటీసు

మరణమే శరణ్యమని సత్తిబాబు గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యకు ఆరోగ్యం బాగోకపోవడంతో మచిలీపట్నం ఆసుపత్రికి చికిత్సకు వెళ్లిన సమయంలో ఇంట్లోనే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'విస్తారా' ఫైనాన్స్ ప్రతినిధులు చేసిన అల్లరి, ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నట్టు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టి మరీ ఆత్మహత్య చేసుకున్నాడు. సత్తిబాబు పెట్టిన పోస్టు వైరల్ అయింది. తన ఆవేదన, కుటుంబంపైన ఉన్న ప్రేమను వదులుకోలేక, మరో వైపు 'విస్తార్' ఫైనాన్స్ ప్రతినిధుల ఒత్తిడి, రభస తట్టుకోలేక లోకాన్ని విడిచి వెళ్లిపోయాడు. సత్తిబాబు మరణంతో భార్య, పిల్లలు అనాధలయ్యారు. సత్తిబాబు భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు.

దారుణాలు

(5వ పేజీ తరువాయి)

బ్యాంకులు 0.2 శాతంగా కమీషన్ ఇస్తున్నాయి.

కమీషన్ల కోసం వేధింపులు

మొండి బకాయిలుగా ఉన్న రుణాలను వసూలు చేస్తేనే రికవరీ ఏజెన్సీకి కమీషన్ వస్తుంది. రికవరీ బాధ్యతలను నిర్వహిస్తున్న సంస్థలో పనిచేసే ఉద్యోగులు జీతాలు ఈ కమీషన్లపైనే ఆధారపడి ఉంటాయి. దీంతో ఏజెంట్లు హద్దులు దాటి వ్యవహరిస్తున్నారు. విజయవాడ కేంద్రంగా ఈ రికవరీ ఏజెన్సీల కాల్ సెంటర్లు పనిచేస్తున్నాయి. ఒక్కో కాల్ సెంటర్‌లో మొత్తం 20 మంది వరకు పనిచేస్తున్నారు. అమ్మాయిలు కాల్ సెంటర్‌లో ఉంటూ వరుసగా ఫోన్లు చేసున్నారు. పురుషులు మాత్రం రుణగ్రస్తుల చిరునామాలకు వెళ్లి వీధిరౌడీల్లా ప్రవరిస్తున్నారు. వాళ్ల నోటి నుంచి వచ్చే మాటలు బాధితుల ప్రాణాలు తీస్తున్నాయి. బాధితులు పెద్దగా పోలీసులను ఆశ్రయించకపోవడంతో రికవరీ ఏజెంట్ల వ్యవహారం రోజురోజుకూ శ్రుతి మించుతోంది. మొండి బకాయిల కోసం పనిచేయాల్సిన ఈ రికవరీ ఏజెంట్లు ఒక వాయిదా ఆలస్యమైనా వీరంగం చేస్తున్నారు. రుణం తీసుకున్నవారు చెల్లింపు ఆలస్యమవుతుందని పరిస్థితిని వివరించినా.. వినట్లేదు. వాస్తవానికి ఒక వాయిదా చెల్లింపు ఆలస్యమైతే దానికి నిర్ణీత పరిమితితో లేట్ పేమెంట్ కింద చార్జీలు విధిస్తారు. ఇలా వసూలు చేసుకోవాల్సిన బకాయిల విషయంలోనూ దారుణంగా ఉంటున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఈ తరహా బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. రికవరీ ఏజెంట్లు అంటున్న మాటలను మౌనంగా భరిస్తున్నారు. చేస్తున్న అవమానాలను సహనంతో భరిస్తున్నారు. మనస్తాపం చెందిన వారు మాత్రం ప్రాణాలు తీసుకుంటున్నారు.

కిటకిట..!

(5వ పేజీ తరువాయి)

సంఖ్యలో జరుగుతుండటంతో ఒక్కసారిగా ఒత్తిడి పెరిగింది. సర్వర్‌కు అవాంతరం ఏర్పడింది. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకబిగిన సర్వర్ నిలిచిపోయింది. అయినప్పటికీ సందర్శకులు పడిగాపులు పడ్డారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి బయటకు కదల్లేదు. సర్వర్ సాయంత్రం 6 గంటల వరకు రాకపోవటంతో చాలామంది ఆందోళన చెందారు. విజయవాడతో పాటు గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాల్లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో శుక్రవారం రాత్రి 9.30 వరకు రిజిస్ట్రేషన్లు జరగగా, అర్ధరాత్రి వరకు కూడా అధికారులు పనిచేశారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118,127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

జనశిక్షణా సంస్థాన్ ఉపాధి శిక్షణా కార్యక్రమాలు

మొగల్రాజపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు స్వయం ఉపాధి నిమిత్తం జనశిక్షణా సంస్థాన్ ఫిబ్రవరిలో చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా ఆధ్వర్యంలో పలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఏ. పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. జ్యూట్ బ్యాగ్ తయారీ, మగ్గం, టైలరింగ్ కటింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఏసీ, రిఫ్రజరేటర్ రిపేరు, డ్రెస్ డిజైనింగ్, అసిస్టెంట్ జ్యూట్ ప్రోడక్టు మేకింగ్, బ్యూటిషియన్ కోర్సు, టెక్స్‌టైల్ ప్రింటింగ్, మిర్రర్ వర్కు, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, హోమ్ క్రాఫ్ట్ తయారీ, జామ్ జ్యూస్‌ల తయారీలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు 0866-2470420 నెంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏమరపాటుగా ఉన్నారా ...

- ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్రమాదకరంగా ఉన్న ఓపెన్ డ్రెయినేజీ
- ఆందోళనలో స్థానికులు



విజయ డెయిరీ పక్కనే ఉన్న ఓపెన్ డ్రెయినేజీ, కెనరా బ్యాంక్ వద్ద డ్రెయినేజీలో పేరుకున్న వ్యర్థాలు

(పటమట,ఆంధ్రజ్యోతి)

ఎన్టీఆర్ సర్కిల్ వద్ద విజయ డెయిరీ పక్కనే ఉన్న ఓపెన్ డ్రెయినేజీ ప్రమాదకరంగా ఉంది. ఈ డ్రెయినేజీపై సిమెంట్ చప్టా ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నగరంలో ప్రధాన రద్దీ కూడళ్లలో ఎన్టీఆర్ సర్కిల్ కూడా ఒకటి. ప్రతి రోజు వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ప్రాధాన్యత ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ వద్ద విజయ డెయిరీ పక్కనే ఎలాంటి రక్షణ లేకుండా ఓపెన్ డ్రెయినేజీని అలా వదిలేశారు. అధికార, విపక్ష పార్టీల ఉద్యమాలు, సినీ హీరోల జన్మదినోత్సవాలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తుంటారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా డ్రెయినేజీలో పడి ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందే. సంబంధిత అధికారులు స్పందించి అక్కడ డ్రెయినేజీపై సిమెంట్ చప్టాను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. దీనికి తోడు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కెనరా బ్యాంక్ పక్కనే డ్రెయినేజీలో చెత్తా చెదారం పేరుకుపోయి మురుగు నీరు నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, దుర్గంధం వెదజల్లుతోందని పలువురు వాపోతున్నారు.

తూర్పులో వన్‌మన్ కమిషన్ చైర్మన్ పర్యటన



రెల్లీస్ కాలనీలో పర్యటిస్తున్న వన్‌మన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్

పటమట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ సబ్ క్లాసిఫికేషన్ రిజర్వేషన్ విధానాల ప్రయోజనాలను సమానంగా పంపిణీ చేయడానికి ప్రత్యేకమైన సిఫారసులు సూచించేందుకు ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రను వన్‌మ్యాన్ కమిషన్‌గా నియమించింది. ఈ కమిషన్ అనేక అంశాలను పరిశీలించి రాష్ట్రంలో పలు ఉపవర్గాల సంక్షేమాన్ని పరిరక్షించేలా సిఫారసులు ప్రభుత్వానికి సమర్పించనుంది. అందులో భాగంగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి రెల్లీస్ కాలనీ ప్రజలను అంగన్వాడీ, హైస్కూల్ స్వయం సహాయ బృందాలను పరిశీలించారు. రెల్లీస్ కాలనీలో ఎస్సీలను కలిసి ఆయన స్థితిగతులను తెలుసుకున్నారు. అంగన్వాడీ పిల్లలకు అందుతున్న పోషకాహారంపై ఆరా తీశారు. డ్వాక్రా ఉత్పత్తులను పరిశీలించారు. పటమట జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎస్సీ విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ ప్రాజెక్టు డాక్టర్ డి.చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ ప్రభుదాసు, ఈఈ సామ్రాజ్యం, ఏసీపీ మోహన్‌బాబు, ఏఎంహెచ్‌వో గోపీనాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్: రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 9 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓల్డ్ ఫిష్ రోడ్డు, నవోదయ కాలనీ, అమ్మా కళ్యాణ మండపం, అశోక్‌నగర్ (1,2,3,4)రోడ్లు, సున్నపుబట్టీల సెంటర్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని తెలిపారు.

ఘనంగా ఆత్మార్పణ దినోత్సవం.. సారె సమర్పించిన గద్దె



పూజలో పాల్గొన్న గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అందరం కలిసి మెలిసి సంతోషంగా ఉండాలని ఒకరికొకరు సహాయం చేసుకోవాలని చెప్పిన కన్యకా పరమేశ్వరి పలుకులు అనుసరణీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శుక్రవారం పటమటలోని గురుదత్త ఆశ్రమంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సేవా సంఘం పటమట ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు స్వయంగా పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి రాష్ట్రం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించారన్నారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుందన్నారు. అమ్మవారి ఆశీస్సులు నేతలకు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంగులూరి చంద్రశేఖరరావు, అంగులూరి సురేష్‌బాబు, కోనేరు రాజేష్, చిట్టా నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

రామారావు సేవలు అభినందనీయం

ఆటోనగర్: గుమ్మడి రామారావు ఆర్టీసీలో డ్రైవర్‌గా 35 ఏళ్లపాటు నిర్విరామంగా విధులు నిర్వహించారని, ఆయన సేవలు అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కొనియాడారు. శుక్రవారం ఆటోనగర్ డిపోలో సహోద్యోగుల ఆధ్వర్యంలో గుమ్మడి రామారావు పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. తొలుత రామారావును సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్, విజయవాడ జోన్ విజిలెన్స్ ఆఫీసర్ జె.ఏ దేవదానస్, టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రగతి

లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్

వన్‌టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అప్పుల ఊబిలో ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందని తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఉగాది నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తారన్నారు. తల్లికి వందనం కార్యక్రమం కూడా త్వరగా ప్రారంభిస్తారని తెలిపారు. టిడ్కో ఇళ్లను కూడా త్వరలోనే లబ్ధిదారులకు అందచేస్తారన్నారు. ఏడు నెలల కాలంలోనే చంద్రబాబు నాయకత్వంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. అభివృద్ధి నిరోధకుడు వైసీపీ జగన్ రెడ్డి మూకలు చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మరన్నారు.

శేషజీవితం ఆనందంగా గడపండి

అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత



వీడ్కోలు పలుకుతున్న అడ్మిన్ డీసీపీ సరిత, ట్రైనీ డీఎస్పీ సునీత,తదితరులు

గుణదల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో అంకితభావంతో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు వారి శేషజీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కోరుకుంటున్నట్లు అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత తెలిపారు. కమిషనరేట్ పరిధిలో పలు విభాగాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన వారికి కమిషనర్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఆరుగురిని పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు ఎప్పటికీ ఉంటుందన్నారు. పదవీవిరమణ పొందినప్పటికీ మీరంతా పోలీసు కుటుంబసభ్యులేనని తెలిపారు. చిత్తశుద్ధితో పనిచేసి అందరి మన్ననలు పొంది వెళ్లడం అనేది గర్వించదగిన విషయం అన్నారు. ట్రైనీ డీఎస్పీ సునీత, ఆర్ఐలు శ్రీనివాసరావు, సుధాకర్ రెడ్డి, జిల్లా పోలీస్ అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న స్టెల్లా విద్యార్థిని దివ్యశ్రీ



స్టెల్లా విద్యార్థిని దివ్యశ్రీ (మధ్యలో)

పటమట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జనవరి 26న జరిగిన గణతంత్ర వేడుకల్లో తమ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థిని ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఆర్.దివ్యశ్రీ జాతీయ సేవా పథకం విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించడం తమకు గర్వంగా ఉందని మారిస్ స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ జసింతా క్వాడ్రస్ అన్నారు. జాతీయ సేవా పథకం సేవల గురించి విద్యార్థిని రిప్రజెంటేషన్ చేసి రాష్ట్రానికి మంచి పేరు తెచ్చారని అన్నారు. విద్యార్థినిని అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి స్వరూపరాణి, డాక్టర్ శ్రీనివాసరావు, హారిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగల్రాజపురం శివాలయంలో

నేటి నుంచి మహా కుంభాభిషేక మహోత్సవం



ముస్తాబైన శివాలయం

మొగల్రాజపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురంలోని శ్రీ గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర అర్ధనారీశ్వర స్వామి ఆలయంలో మాఘ మాసాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి ఒకటి నుంచి 3 వరకు మూడు రోజుల పాటు మహా కుంభాభిషేక మహోత్స వం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయల ట్రస్టీ చెరుకూరి సతీష్ బాబు, అనిల దంపతులు చెప్పారు. శుక్రవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహోత్సవాలను తుని తపోవనాధీశులు శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంతో పురాతన చరిత్ర ఉన్న ఈ శివాలయంలో ఒకటో తేదిన ఉదయం 8.85కు గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, దీక్షాధారణ, అఖండ స్థాపన, వాస్తు పర్యగ్రికరణం, వాస్తు మంటపారాధన, కుండ సంస్కారం, అగ్రిమధనం, అగ్నిప్రతిష్టాపన, యోగినీ, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతో బద్రమండల మంటపారాధన, అష్టోత్తర శత కలశ ఆవాహనంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు.

గర్భాశయ కేన్సర్‌పై లయోలాలో అవగాహన సదస్సు

భారతీనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాలలో మహిళా విభాగం ఆధ్వర్యంలో గర్భాశయ కేన్సర్, హెచ్‌పీవీ(హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సిన్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గైనకాలజిస్ట్ డాక్టర్ వెల్లంకి వెంకట సుజాత పాల్గొని మాట్లాడుతూ గర్భాశయ కేన్సర్ లక్షణాలు, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గర్భాశయ కేన్సర్‌కు కారణమయ్యే వైరస్ నుంచి రక్షించే హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను వివరించారు. మహిళా సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.తబిత, ఫాదర్ జి.కిరణ్‌కుమార్, అధ్యాపకులు, బాలికలు పాల్గొన్నారు.

సిద్ధార్థ మహిళా కళాశాలలో 60 మందికి ఉద్యోగార్హత

లబ్బీపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మహిళా కళాశాలలో స్పీకింగ్ ట్రీ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 60మంది విద్యార్థులు ఉద్యోగార్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. ఈ ఎంపికల్లో 88 మంది పాల్గొనగా 60మంది ఎంపికయ్యారని, వారికి 1.80 నుంచి 2.4లక్షల వరకు వార్షిక ఆదాయం సంస్థ అందజేస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

నలందలో 66 మందికి..

నలంద డిగ్రీ కళాశాలలో స్పీకింగ్ ట్రీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 66మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. ఈ ఎంపికల్లో 90 మంది విద్యార్థులు పాల్గొనగా 66మంది ఉద్యోగార్హత సాధించారని తెలిపారు. బి.చంద్రగిరి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగార్హత సాధించిన విద్యార్థులను నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు అభినందించారు.

ఉనికి కోసమే వైసీపీ దొంగ పోరు

టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి

వన్‌టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఏడు లక్షల మంది విద్యార్థులకు విద్యను దూరం చేసిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి అని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్ అన్నారు. శుక్రవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాయకులందరూ ఫీజు పోరులో జగన్ రెడ్డి అయిదేళ్ల పెట్టిన బకాయిల గురించి వివరించాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు ఉనికి కోసం చేసే దొంగ పోరులను ప్రజలు, విద్యార్థులు నమ్మవద్దని అన్నారు. వసతి దీవెన బకాయిలు రూ.989 కోట్లు, పీజీ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.450కోట్లు బకాయిలు పెట్టి వైసీపీ నాయకులు ఆ సొమ్ము అంతా దోచుకుని ఫీజు పోరు అంటూ కొత్త డ్రామాకు తెరతీశారన్నారు.

అనారోగ్య సమస్యలతో నిప్పంటించుకుని ఆత్మహత్య

ఆటోనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు పటమటలో నివసిస్తున్న చిటుకుల నాంచారయ్య(58) భార్య, ఇద్దరు కుమారులతో నివసిస్తున్నారు. ఇస్త్రీ చేసుకుంటూ కుటుంబంతో జీవిస్తున్నాడు. పదేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా, గత రెండు నెలలుగా షుగరు ఎక్కువ కావడంతో పనులు చేయలేని పరిస్థితిలో ఉన్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున ఇంటి వెనుక వైపు బొగ్గులు మండించే మడ్డి ఆయిల్‌ను ఒంటిమీద పోసుకుని నిప్పంటించుకున్నాడని తెలిపారు. ఉదయం భార్య, ఇద్దరు కుమారులు చూడగా ఇంటి వెనుక వైపు విగతజీవిగా కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

ఎంపీ చిన్నిపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ

రాజకీయ ఉనికి కోసం, ప్రచారం కోసం విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ పై సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను మానుకోవాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ హెచ్చరించారు. శుక్రవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విజయవాడ అర్బన్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జి.వి.నరసింహారావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాయకుల మోచేతి నీళ్లు తాగుతూ ఎంపీ కేశినేని చిన్నిపై చేసిన ఆరోపణలు దమ్ము, ధైర్యం ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. రాజకీయాల్లో ఉన్న శంకర్ ఉచిత ఇసుక విధానాల గురించి అవగాహన లేకుండా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే ఎంపీ చిన్ని పై ఆరోపణలు చేస్తే శంకర్‌కు రాజకీయ భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు.







గాంధీనగర్‌లో తన ఇంటి మిద్దెపై అందాల వనంలా ఉన్న తోటను చూపుతున్న విశ్రాంత ఉపాధ్యాయిని ముంతాజ్ బేగం, ఇన్‌సెట్‌లో వర్మీ కంపోస్టు

మిద్దెతోట.. ఆరోగ్యానికి కోట!



విశ్రాంత ఉపాధ్యాయిని అవిశ్రాంత శ్రమకు ప్రతిఫలంగా అందాల వనం

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్): కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడంపై ఉన్న మక్కువతో హైనీ హైస్కూల్ విశ్రాంత సైన్స్ ఉపాధ్యాయిని ముంతాజ్ బేగం గాంధీనగర్‌లో తనకున్న చిన్న ఇంటి మిద్దెపైన వందల మొక్కలు పెంచుతున్నారు. రోజుకు 5 గంటల సేపు ఆమె మొక్కలతోనే గడుపుతుంటారు. తోటకూర, పాలకూర, చుక్కకూర, గోంగూర, బచ్చలి, వంకాయ, టమోటా, మిర్చి, అలచంద, క్లైటీన్స్ మునగ, బీర, దోసకాయలు పండిస్తున్నారు. మామిడి, అరటి, జామ, స్టార్, సపోటా, మల్బరీ, తెల్లనేరేడు, వాటర్ యాపిల్, అంజీరా, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, కమల, బత్తాయి, స్వీట్ లెమన్, చెర్రీ మొక్కలను పెంచుతున్నారు. ఇంటి వద్దే వర్మీ కంపోస్టు తయారు చేసి మిద్దెపైన మొక్కలకు సేంద్రియ ఎరువుగా వాడుతున్నారు. వేపపిండి, ఎప్సంసాల్ట్, ఎండిన ఆవుపేడ, తోట నుంచి వచ్చే ఆకులు, ఉల్లిపొట్టు, వేరుశెనగ, ఆవ, కొబ్బరి, నువ్వుల చెక్కలను నానబెట్టి ఎరువులు తయారు చేస్తున్నారు. మిద్దెతోటలో పండించిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఆరోగ్యానికి పెట్టని కోట అని, అందరూ తమ విద్దెలపై తోటలు పెంచాలని ముంతాజ్ పిలుపునిస్తున్నారు.

సామాజిక బాధ్యతకు సరికొత్త అర్థం!

- విద్యుత్‌సౌధలో ఇండోర్ స్టేడియం నిర్మాణం
- ఏపీ ట్రాన్స్‌కో సీఎస్ఆర్ నిధులు రూ.3.30 కోట్లు ఖర్చు
- మరికొద్ది రోజుల్లో స్టేడియం ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):

కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)కు ఏపీ ట్రాన్స్‌కో అధికారులు కొత్త అర్థం చెప్పారు. పేదల సామాజిక అవసరాల కోసం ఉపయోగించాల్సిన నిధులను దారి మళ్లించారు. విజయవాడ విద్యుత్‌సౌధలో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం కోసం రూ.3.30 కోట్ల సీఎస్ఆర్ నిధులను ఖర్చు పెట్టారు. ఇండోర్ స్టేడియానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినప్పటికీ సీఎస్ఆర్ నిధులు ఉపయోగించడం వివాదాస్పదమవుతోం ది. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ చేతుల మీదుగా మరికొద్ది రోజు ల్లో ఈ ఇండోర్ స్టేడియం ప్రారంభం కానుంది. అత్యంత రహస్యంగా ఇండోర్ స్టేడియాన్ని సీఎస్ఆర్ నిధులతో పూర్తి చేయడం విమర్శలకు దారి తీస్తోంది. ఏ సంస్థ అయినా కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)గా తన ఆదాయంలో 2 శాతం నిధులను సామాజిక అవసరాలను తీర్చటం కోసం ఖర్చు చేయాలి. కానీ, ట్రాన్స్‌కో మాత్రం సొంత ఉద్యోగుల ఆటవిడుపు కోసం తమ ప్రాంగణంలో ఏర్పాటు చేసే ఇండోర్ స్టేడియానికి సీఎస్ఆర్ నిధులను ఖర్చు పెట్టింది. విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కార్పొరేషన్ వంటి సంస్థలు ఇండోర్ స్టేడియాలు నిర్మిస్తాయి. కానీ సొంత అవసరాలకు సీఎస్ఆర్ నిధులు ఉపయోగించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధులకు ఈ వ్యవహారం తెలిస్తే గోలపెట్టే అవకాశం ఉందని, అనవసర వివాదం కొనితెచ్చారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఇండోర్ స్టేడియానికి అయిన ఖర్చును ప్రభుత్వ నిధుల ద్వారా సర్దుబాటు చేసుకునేందుకు ప్రయత్నించాలని, సీఎస్ఆర్ నిధులను తిరిగి వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమతోంది.

2018లో రెండున్నర కోట్లు కేటాయించిన టీడీపీ ప్రభుత్వం

2018లో టీడీపీ ప్రభుత్వం ఇండోర్ స్టేడియానికి రూ.2.50 కోట్లను కేటాయించింది. అప్పట్లో కాంట్రాక్టు అగ్రిమెంట్ కూడా ఇదే మొత్తానికి జరిగింది. ఫౌండేషన్ పనులు జరిగాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు పూర్తిగా ఆగిపోయాయి. 2022-23లో సొంత సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.1.80 కోట్లను ఉపయోగించుకునేలా ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ తర్వాత మరో రూ.1.50 కోట్ల సీఎస్ఆర్ నిధులను వాడారు. మొత్తంగా రూ.3.30 కోట్ల సీఎస్ఆర్ నిధులను వాడారు.

జగన్‌కు సిగ్గుండాలి!

- విద్యార్థులకు రూ.కోట్లు బకాయిలు పెట్టి.. 'ఫీజు పోరు'కు పిలుపా?: టీఎన్ఎస్ఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి



గుడివాడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు కోట్లాది రూపాయల ఫీజులు బకాయిలు పెట్టి, నేడు ఫీజు పోరు పేరుతో ఆందోళనకు పిలుపునివ్వడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సిగ్గుండాలని టీఎన్ఎస్ఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రజావేదికలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడివాడలోని వైసీపీ దొంగల ముఠా అంతా కలిసి ఫిబ్రవరి 5వ తేదీన ఆ పార్టీ చేపడుతున్న ఫీజు పోరు కార్యక్రమం పోస్టర్లను విడుదల చేసిందన్నారు. గతంలో చంద్రబాబు అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విద్యాదీవెనగా మార్చి కొత్తగా తానేదో కొత్త పథకాన్ని పెట్టినట్టు జగన్‌రెడ్డి ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. సకాలంలో వైసీపీ ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడంతో కళాశాల యజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వకుండా పరీక్షలు రాయనివ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టాయన్నారు. జగన్‌రెడ్డి పదవి పోయే ముందు ఫీజు బకాయిలను జమ చేయకుండా బటన్ నొక్కి డ్రామాలు ఆడారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులను కళాశాలకు దూరం చేసిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. ఐదేళ్లలో జగన్‌రెడ్డి రూ.4,271 కోట్లు బకాయిలు పెట్టారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ.788 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసిందని, వివిధ కళాశాలల్లో నిలిచిపోయిన 10లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను విద్యార్థులకు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. విద్యార్థులను ఫీజు కోసం ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని కూటమి ప్రభుత్వం ఆదేశించిందన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రి ఫరూక్ తదితరులు

సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

లబ్బీపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ అధ్యక్షతన లబ్బీపేటలోని ప్రధాన కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొన్నారు. రాబోయే సంవత్సరంలో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ప్రస్తుతం అందిస్తున్న పథకాలపై అన్ని జిల్లాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఓబీఎంఎస్‌పై వివరించారు. మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నవదిన ప్రార్థనలు ప్రారంభం



నవదిన ప్రార్థనలకు హాజరైన భక్తులు

గుణదల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'తన రక్షణ ప్రణాళికను కొనసాగించడానికి మరియమాతను తల్లిగా దేవుడు ఎన్నుకున్నారు. స్త్రీలందరిలో మరియమాత ధన్యురాలు. క్రీస్తు తల్లి అయిన మరియమాతను గౌరవిస్తే దేవుడి అనుగ్రహాలు తప్పక లభిస్తాయి. లూర్దుమాత దర్శన భాగ్యం పొందిన వారు వరాలు పొందుతారు.' అని విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్ద కథోలిక పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన గుణదల లూర్దుమాత మహోత్సవాల నవదిన ప్రార్థనలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పుణ్యక్షేత్రం ప్రధాన చర్చి వద్ద మరియమాత పతాకాన్ని బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, వికర్ జనరల్ మేకపాం గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, డయాసిస్ ఎడ్యుకేషన్ డెస్క్ డైరెక్టర్ కొలకాని మరియప్ప, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ తోట సునీల్ రాజు ఆవిష్కరించారు. జపమాలతో భక్తులు కొండ మధ్యలోగల మరియమాత స్వరూపం వద్దకు చేరుకున్నాక, లూర్దుమాత స్వరూపం వద్ద సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. జగద్గురువులు పరిశుద్ధ పోప్ ఫ్రాన్సిస్ 2025ను జూబ్లీ సంవత్సరంగా ప్రకటించారని బిషప్ తెలిపారు. ఈ ఏడాది 101వ గుణదలమాత మహోత్సవాలను భక్తులు దిగ్విజయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నేటి నుంచి తొమ్మిదిరోజులు నిర్వహించే నవదిన ప్రార్థనలతో లూర్దుమాత తిరునాళ్లకు భక్తులను సంసిద్ధులను చేస్తామన్నారు.

మానవాళిని దేవునివైపు నడుపుతున్న దిక్సూచి మరియమాత



సాగరమాత వేడుకల్లో ప్రసంగిస్తున్న బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మానవాళిని దేవునివైపు నడుపుతున్న దిక్సూచి మరియమాత అని విజయవాడ డయాసిస్ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. శారదానగర్ ఆర్‌సీఎం విచారణ చర్చిలో సాగరమాత మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక దివ్యబలిపూజను ఆయన సమర్పించారు. దేవునికి, భక్తులకు మధ్య మరియమాత వారధిగా ఉండి భక్తులకు మనోధైర్యాన్ని కలిగిస్తుందన్నారు. శారదానగర్ సాగరమాత విచారణ గురువు జానీడిక్రూస్, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆర్‌సీఎం చర్చిల విచారణ గురువులు ఈ పూజాబలిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, పేర్ని కిట్టు, మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వ రమ్మ, హోలీక్రాస్‌చర్చి, నిర్మలా కాన్వెంట్ సిస్టర్లు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి మేరీమాత తేరు ప్రదక్షిణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చదువుకోసం పరాయిదేశానికెళ్లి.. ప్రమాదానికి బలయ్యారు

- ఐర్లాండ్‌లో చెట్టును ఢీకొన్న కారు.. జగ్గయ్యపేట, గుంటూరు యువకుల దుర్మరణం



చిట్టూరి భార్గవ్ (ఫైల్)

జగ్గయ్యపేట/జగ్గయ్యపేటరూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చదువుకునేందుకు ఐర్లాండ్ దేశం వెళ్లిన జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామానికి చెందిన యువకుడు, గుంటూరుకు చెందిన మరో యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఐర్లాండ్‌లోని కార్లో పట్టణంలో సౌత్‌ఈస్ట్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో చదువుకునేందుకు మూడేళ్లక్రితం గండ్రాయికి చెందిన చిట్టూరి భార్గవ్(25) వెళ్లాడు. ఆ దేశ కాలమానం ప్రకారం తెల్లవారుఝామున 1.15 గంటలకు తన స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా రాతో అనే ప్రాంతంలో చెట్టును ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగిందని తండ్రి సాయిబాబుకు అక్కడ యూనివర్సిటీ నుంచి సమాచారం వచ్చింది. ఈ సమయంలో ఐర్లాండ్‌లో విపరీతమైన మంచు కురుస్తుందని, చెట్టును గుర్తించక ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ప్రమాదంలో భార్గవ్(25)తోపాటు గుంటూరుకు చెందిన చెరుకూరి సురేష్(25) మృతి చెందినట్టు సమాచారం అందింది. కారులో ప్రయాణిస్తున్న వీరి స్నేహితులు ఒక యువ తి, మరో యువకుడు తీవ్రగాయాలతో బయటపడ్డారు. వారికి ప్రాణాపాయం లేదని తెలుస్తుంది.

గండ్రాయిలో విషాదం

రైతు కుటుంబం నుంచి ఉన్నత విద్య చదవాలని ఐర్లాండ్ దేశానికి వెళ్లి మృత్యువాత పడిన చిట్టూరి భార్గవ్ (25) మరణ వార్త గండ్రాయి గ్రామంలో విషాదాన్ని నింపింది. చిట్టూరి భార్గవ్ తండ్రి సాయిబాబా, ఆయన సోదరుడు నరసింహారావులు గ్రామంలో వివాదాలకు దూరంగా అందరికీ తలలో నాలుకలా ఉంటారు. వ్యవసాయం అంతగా లాభించకపోవటంతో సాయిబాబా జగ్గయ్యపేటలో వ్యాపారం చేస్తున్నారు. పెద్ద కుమారుడు భార్గవ్‌ను ఎంఎస్ కోసం ఐర్లాండ్ పంపారు. చదువు కొద్ది నెలల్లో పూర్తి కానుంది. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న తరుణంలో ఇలా ప్రమాదం రూపంలో మృత్యువు కబళించడం కుటుంబాన్ని కలిచివేస్తోంది.

మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు

ప్రమాదం విషయం తెలియగానే భార్గవ్ బంధువులు ఐర్లాండ్ నుంచి భౌతికకాయాన్ని తెప్పించాలంటూ టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాంను కలిశారు. ఆయన వెంటనే మంత్రి నారా లోకేశ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఐర్లాండ్‌లో భారత రాయబారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆ దేశంలో లాంఛనాలు త్వరితగతిన పూర్తిచేసి భౌతికకాయాన్ని సాధ్యమైనంత త్వరగా తెప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.



డైరీని ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ సంస్థ ప్రతినిధులు

క్రెడాయి డైరీలో నిర్మాణ రంగ సమస్త సమాచారం

- సంస్థ విజయవాడ అధ్యక్షుడు దాసరి రాంబాబు

గుణదల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని నూతన సంవత్సర డైరీలో పొందుపరిచామని క్రెడాయి విజయవాడ అధ్యక్షుడు దాసరి రాంబాబు తెలిపారు. క్రెడాయి సంస్థ రూపొందించిన నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఓ హోటల్‌లో నిర్వహించారు. క్రెడాయి పాతికేళ్ల ఉత్సవాన్ని పురస్కరించుకుని 2025 డైరీని ఒక నిర్మాణ రంగం నిఘంటువుగా తయారు చేశామని రాంబాబు తెలిపారు. ఇందులో నిర్మాణ రంగ జీవోలు, జీఎస్టీ సమాచారం పొందుపరిచామన్నారు. క్రెడాయి ఏపీ అధ్యక్షుడు వైవీ రమణారావు, విజయవాడ కోశాధికారి తుమ్మల వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడు కె.రఘురాం, సంయుక్త కార్యదర్శులు జీఎస్ సాయిరాం, బి.కేశవచంద్ర, బి.పవన్‌కుమార్, పూర్వ అధ్యక్షుడు కె.రాజేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ఆస్కారం

ప్రభుత్వాసుపత్రి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నున్న-గుడివాడ 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్, ఆధునీకరణ సాంకేతిక మరమ్మతులు చేయాల్సినందున గుడివాడలో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా ఆపేస్తామని ఏఈ ఎస్.కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సాధారణ విద్యుత్ సరఫరాకు అంతరాయం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలైన పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోటలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.

లాగేస్తేపోలా!

- పంచాయతీ ఎన్నికల్లో టీడీపీకి పోటీలేకుండా పావులు కదుపుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్
- వైసీపీ సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులను పార్టీలో చేర్చుకునే వ్యూహం
- కంకిపాడులో ఖాళీ కానున్న వైసీపీ?

(ఆంధ్రజ్యోతి-కంకిపాడు): కంకిపాడులో నామమాత్రంగా ఉన్న వైసీపీ త్వరలో ఖాళీ కానుందని ప్రచారం జరుగుతోంది. వైసీపీని పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేయాలన్న పట్టుదల, లక్ష్యంతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పావులు కదుపుతున్నారని సమాచారం. కంకిపాడు సర్పంచ్ బాకి రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవితో పాటు పలువురు వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకుని, అంతంతమాత్రంగా ఉన్న వైసీపీని దెబ్బతీయాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే ముందుకు వెళ్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే టీడీపీ సీనియర్ నాయకుడు ఒకరు గ్రామంలోని వైసీపీ నాయకులతో సమావేశమయ్యారని విశ్వసనీయ సమాచారం. వచ్చే జనవరిలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కంకిపాడులో టీడీపీకి పోటీ లేకుండా వైసీపీ నాయకులను తమ పార్టీలోకి లాగేసే దిశగా అడుగులు వేస్తున్నారని తెలిసింది.

ఇబ్బంది పెట్టిన వారిని ఎలా తీసుకుంటారు

స్థానిక టీడీపీ నాయకులు పలువురు గురువారం రాత్రి ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలో సమావేశమయ్యారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమను ఇబ్బంది పెట్టిన వైసీపీ నాయకులను పార్టీలోకి ఎలా తీసుకుంటారన్న దానిపై చర్చించినట్లు సమాచారం. ఒకవేళ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వైసీపీ నాయకులను టీడీపీలోకి తీసుకున్నా వారితో ఎలా కలిసి పనిచేస్తామని ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. బోడె ప్రసాద్‌ను కలిసి తమ గోడు విన్నవించుకునేందుకు స్థానిక నాయకులు సిద్ధమయ్యారని సమాచారం.

సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఓకే..

కంకిపాడు సర్పంచ్ బాకి రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవిని టీడీపీలోకి తీసుకునేందుకు స్థానిక టీడీపీ నాయకత్వం సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. రెండో వార్డు సభ్యుడు చిట్టూరి కోటయ్యబాబు, ఎంపీటీసీ -4 కంకిపాటి పద్మావతి భర్త కంకిపాటి రమేష్‌ను పార్టీలోకి తీసుకోవడం సరికాదని ఆ పార్టీ నాయకులు అభ్యంతరం చెబుతున్నారని తెలిసింది. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వ్యతిరేకంగా చిట్టూరి కోటయ్యబాబు గ్రూపుల్లో అనేక సందేశాలు పెట్టారని, గత పంచాయతీ ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందుల పాల్జేశారని ఆరోపిస్తున్నారని సమాచారం.



నడిరోడ్డుపై గొయ్యి

విజయవాడలోని పంటకాలువ రోడ్డుపై శుక్రవారం ఆకస్మాత్తుగా భారీ గొయ్యి ఏర్పడింది. పంటకాలువ రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పక్కనున్న ఎంబీఎఫ్ జిమ్ సెంటర్ ఎదురుగా రోడ్డుపై రంధ్రం ఏర్పడడంతో ప్రమాదాలు జరగకుండా కర్రకు సంచిని కట్టి గోతిలో సూచికను స్థానికులు ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి, పటమట

కుంభమేళాకు పర్యాటకశాఖ ప్రత్యేక బస్సులు

వన్‌టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లాలనుకుంటున్న ఏపీ, తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఏపీ పర్యాటక అభివృద్ధి శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

మొదటి రూటులో..

బస్సు ఫిబ్రవరి 11న తిరుపతిలో ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుంది. తిరుపతి- ఒంటిమిట్ట- కడపబైపాస్- ఓర్వకల్లు, కర్నూలు బైపాస్- హైదరాబాద్- జబల్‌పూర్- చిత్రకూటు-ప్రయాగరాజ్-కాశి-నాగపూర్-ధర్మపురిలలో యాత్రికులను దించుతారు. హైదరాబాద్ నుంచి బయలుదేరేవారు ఫిబ్రవరి 12న ఉదయం 5 గంటలకు బారామతి హోటల్ వద్ద బస్సు ఎక్కాలి. హైదరాబాద్ యాత్రికులకు ఫిబ్రవరి 17న మధ్యాహ్నంతో యాత్ర ముగుస్తుంది. కర్నూలు యాత్రికులకూ ఇదే రోజు సాయంత్రం 5 గంటలకు, కడప, తిరుపతివారికి 18వతేదీ మధ్యాహ్నానికి యాత్ర పూర్తవుతుంది. తిరుపతి, కడప నుంచి నుంచి బయలుదేరే పెద్దలు(ఒకరికి) రూ.22 వేలు, పిల్లలకు(ఒకరికి) రూ.19 వేలు, కర్నూలు, హైదరాబాద్ నుంచి బయలుదేరే పెద్దలకు రూ.20 వేలు, పిల్లకు రూ 17,200 చెల్లించాలి. వివరాలకు తిరుపతి 98480 07033, కడప 9010 318811, కర్నూలు 96401 77759, హైదరాబాద్ 77298 30011లో సంప్రదించాలి.

రెండో రూటులో..

బస్సు ఫిబ్రవరి 12వతేదీ ఉదయం 6 గంటలకు నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయం వద్ద బయలుదేరుతుంది. నెల్లూరు-విజయవాడ-రాజమహేంద్రవరం-అన్నవరం-విశాఖపట్నం-పూరి-కోణార్క్-భువనేశ్వర్-కటక్-చండీపూర్-గయ-బుద్ధగయ-కాశి-ప్రయాగ్‌రాజ్‌కు చేరుతుంది. యాత్ర ముగించుకుని తిరిగి శ్రీకూర్మం-అరసవల్లి-మీదుగా విశాఖపట్నం-విజయవాడకు చేరుకుంటుంది. నెల్లూరు యాత్రికులకు విజయవాడలో కనకదుర్గమ్మ దర్శనం చేయిస్తారు. తిరిగి నెల్లూరు చేరుస్తారు. విజయవాడలో బరంపార్కు వద్ద, రాజమండ్రి వాళ్లు మహాకాళేశ్వర ఆలయం వద్ద బస్సు ఎక్కాలి. 13న ఉదయం 5 గంటలకు విశాఖపట్నంలో బీచ్‌రోడ్డులోని హోటల్ రాగా వద్ద ఎక్కాలి. విశాఖపట్నం యాత్రికులకు 18న రాత్రి 10 గంటలకు యాత్ర ముగుస్తుంది. 19న ఉదయం 10 గంటలకు రాజమండ్రి వారికి, అదేరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు విజయవాడ వారికి, రాత్రి 8 గంటలకు నెల్లూరు వారికి పూర్తవుతుంది. నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి నుంచి వెళ్లే పెద్దలు(ఒకరికి) రూ.25,600, పిల్లలు(ఒకరికి) రూ.22,500, విశాఖపట్నంలో ఎక్కే పెద్దలు రూ.24,100, పిల్లలు రూ.21,200 చెల్లించాలి. దర్శనాలు, భోజనాలు, అల్పాహారం, బస ఖర్చులను యాత్రికులే భరించాలి. వివరాలకు నెల్లూరు 98480 07024, రాజమండ్రి 98486 29341, విజయవాడ 98480 07025 విశాఖపట్నం 98488 13584, 98480 07022లో సంప్రదించాలి. ఏపీటీడీసీ, టూరిజంఏపీ వెబ్‌సైట్లు లేదా అధీకృత ఏజెంట్ల ద్వారా సీట్లు రిజర్వ్ చేసుకోవచ్చు.

5న ప్రయాగ్‌రాజ్‌కు ఆర్టీసీ బస్సు

ఏపీఎస్ఆర్టీసీ ఈనెల 5వతేదీన ప్రయాగ్‌రాజ్‌కు ఒక బస్సును నడుపుతోంది. 95198 సర్వీసు నెంబరు, సూపర్ లగ్జరీ బస్సు 5వతేదీ ఉదయం 11 గంటలకు విజయవాడ పండిట్ నెహ్రూ బస్సు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. హైదరాబాద్- నాగపూర్ మీదుగా కుంభమేళాకు చేరుకుని, అక్కడి నుంచి ఆయోధ్య, కాశీ చూసుకుని విజయవాడ చేరుకుంటుంది. టికెట్ చార్జీ ఒక్కొక్కరికి రూ.8000, విజయవాడ-వారణాశి వెబ్‌సైట్‌లో వివరాలు చూడవచ్చు, భోజనం, వసతి, అల్పాహారం వ్యయాలు భక్తులే భరించాలి.

వెయిట్ లిఫ్టర్ నీలరాజుకు అభినందన

లబ్బీపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో నిర్వహిస్తున్న 38వ జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ఏపీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రానికి పేరుతెస్తున్నారని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. వెయిట్‌లిఫ్టింగ్ 67 కేజీల విభాగంలో గుంటూరుకు చెందిన కె.నీలరాజు బంగారు పతకం సాధించడంతో అతనికి రవినాయుడు శుక్రవారం ఫోన్‌లో అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పరంగా తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు.

బిజినెస్

విజయవాడ ● శనివారం 1 ఫిబ్రవరి 2025

వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.3-6.8% వృద్ధి



2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు 8% వృద్ధి అవసరం

- ఇందుకు నియంత్రణ సడలింపులతో పాటు భూ, కార్మిక సంస్కరణలు చేపట్టాలి..
- పెట్టుబడులను జీడీపీలో 35%కి పెంచాలి..
- ఏఐ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ రంగాల్లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలి..
- తయారీని మరింత ప్రోత్సహించాలి..
- వ్యాపార నిర్వహణను సులభతరం చేయాలి
- ఆర్థిక సర్వేను పార్లమెంట్‌కు సమర్పించిన ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత జీడీపీ వృద్ధి రేటు 6.3-6.8 శాతం శ్రేణిలో నమోదు కావచ్చని 2024-25 ఆర్థిక సర్వే నివేదిక అంచనా వేసింది. బలమైన ఆర్థిక మూలాలు, ఆర్థిక స్థిరీకరణ, నిలకడైన ప్రైవేటు వినియోగం ఇందుకు దోహదపడనున్నాయని సర్వే పేర్కొంది. అయితే, అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు అవసరమైన వృద్ధి కంటే ఇది చాలా తక్కువని అభిప్రాయపడింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంట్‌లో 'ఆర్థిక సర్వే 2024-25' నివేదికను సమర్పించారు. దేశ ప్రస్తుత ఆర్థిక స్థితిగతులను తెలిపే ఈ వార్షిక నివేదికను ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ పర్యవేక్షణలో ఆర్థిక వ్యవహారాల శాఖ తయారు చేసింది. ఆర్థిక సర్వే నివేదికను తొలిసారిగా 1950-51లో రూపొందించారు. అప్పట్లో బడ్జెట్‌తో కలిపి దీన్ని సమర్పించేవారు. 1960 నుంచి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌కు ముందు రోజు ఈ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించడం ప్రారంభించింది.

ఈ మార్చి 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) జీడీపీ వృద్ధి రేటు నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి 6.4 శాతానికి పరిమితం కావచ్చని కేంద్ర గణాంక శాఖ ఇప్పటికే ముందస్తు అంచనాలను విడుదల చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఎకనామిక్ సర్వే అంచనా వేసిన 6.3-6.8 శాతం వృద్ధి శ్రేణిలో దిగువ స్థాయి ఈసారి కంటే తక్కువ. అంటే, వచ్చే ఏడాది వృద్ధి మరింత బలహీనపడే అవకాశాలున్నాయనడానికిదే సంకేతం. అంతేకాదు, కొవిడ్ సంక్షోభం అనంతరం భారత్‌కు ఇదే కనిష్ఠ వృద్ధి రేటు కానుంది. గ్రామీణ మార్కెట్ గిరాకీ, పెరిగిన పంట దిగుబడి, తగ్గుముఖం పడుతున్న ఆహార ధరలు, స్థిరమైన ఆర్థిక మూలాలు స్వల్పకాలిక వృద్ధికి దోహదపడనున్నాయని ఆర్థిక సర్వే పేర్కొంది. అయితే, అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ, వాణిజ్య అనిశ్చితుల తోపాటు కమోడిటీల ధరలు మళ్లీ పెరిగే అవకాశాలు ఆర్థికాభివృద్ధికి అవరోధంగా పరిణమించే ప్రమాదం ఉందని ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ హెచ్చరించారు.



వేగవంత వృద్ధి కోసం ప్రపంచ సానుకూల పరిస్థితులను ఉపయోగించుకునేందుకు భారత్ సదా సిద్ధంగా ఉండాలి. దేశంలో ప్రస్తుత వృద్ధి మందగమనానికి అంతర్జాతీయ అనిశ్చితులు, ప్రతికూలతలే కారణం. అయినప్పటికీ, భారత్ ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది.
- అనంత నాగేశ్వరన్, ప్రధాన ఆర్థిక సలహాదారు

ఆహార ధరలు తగ్గుముఖం

కూరగాయల ధరలు కాస్త తగ్గడంతో పాటు ఖరీఫ్ పంట చేతికి రానుండటంతో ఈ ఏడాది మార్చి చివరి నాటికి ఆహార ధరల ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టవచ్చని, తద్వారా సామాన్యులకు ధరాఘాతం నుంచి కొంత ఊరట లభించవచ్చని ఆర్థిక సర్వే నివేదిక ఆశాభావం వ్యక్తం చేసింది. రబీ పంట దిగుబడి కూడా మెరుగ్గా ఉంటే వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం (ఏప్రిల్-సెప్టెంబరు)లోనూ ఆహార ధరలు అందుబాటులోనే ఉండవచ్చని రిపోర్టు పేర్కొంది. ఆహార ధరలకు కళ్లెం వేసేందుకు పర్యావరణ ప్రతికూలతలను తట్టుకునే వంగడాలను అభివృద్ధి చేయడం తోపాటు పప్పు దినుసులు, వంటనూనె గింజలు, టమోట, ఉల్లి దిగుబడిని పెంచాలని ఆర్థిక సర్వే నివేదిక సూచించింది.

వచ్చే 2 దశాబ్దాలు వడివడిగా..

2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వచ్చే రెండు దశాబ్దాల పాటు 8 శాతం వార్షిక వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఆర్థిక వృద్ధిని ప్రేరేపించేందుకు నియంత్రణ సడలింపులతో పాటు భూ, కార్మిక, బిల్డింగ్, యుటిలిటీ సేవలు, ప్రజా సేవల రంగాల్లో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అంతేకాదు, పెట్టుబడులను జీడీపీలో ప్రస్తుతమున్న 31 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని.. దేశంలో తయారీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని, కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, బయోటెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికతల్లో విస్తృతంగా పెట్టుబడులు పెట్టాలని సూచించింది. అలాగే, 2030-32 వరకు వ్యవసాయేతర రంగాల్లో ఏటా 78.5 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉందని, దేశంలో 100 శాతం అక్షరాస్యతను సాధించడంతో పాటు విద్యా సంస్థల ప్రమాణాలను పెంచాలని, అత్యంత నాణ్యమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన మౌలిక వసతులను త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరింది. అంతేకాదు, దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరంగా మార్చాలని.. ఈ విడత రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు చేపట్టాలని, నియమావళిని సడలించాలని సూచించింది. కేంద్రం, రాష్ట్రాలు సంస్కరణలను కొనసాగిస్తేనే భారత్ భవిష్యత్ లక్ష్యాలకు అవసరమైన వృద్ధిని సాధించగలదని సర్వే నివేదిక పేర్కొంది.

తగ్గనున్న పసిడి ధర!

వెండి మాత్రం పైపైకి

ఈ సంవత్సరం బులియన్ మార్కెట్ ధరలు మిశ్రమంగా ఉంటాయని ఆర్థిక సర్వే అంచనా. పసిడి ధర తగ్గినా, వెండి ధర మాత్రం మరింత కొండెక్కుతుందని స్పష్టం చేసింది. ఒక్క వెండి తప్ప మిగతా లోహాలు, ఖనిజాల ధరలు కూడా ఈ సంవత్సరం దిగొస్తాయని అంచనా వేసింది. రష్యా చమురు ఎగుమతులపై ఎన్ని ఆంక్షలు విధించినా ఈ సంవత్సరం ముడి చమురు ధరల పతనం తప్పదని స్పష్టం చేసింది. అయితే సహజ వాయువు ధర మాత్రం కొద్దిగా పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇనుప ఖనిజం, జింక్ ధరల పతనం ఈ సంవత్సరం ఖనిజాలు, లోహాల మార్కెట్‌ను దెబ్బతీసే అవకాశం ఉందని తెలిపింది. చమురు, బంగారం ధరల తగ్గుదల ఈ సంవత్సరం మన ఆర్థిక వ్యవస్థకు కలిసి రానుందని సర్వే పేర్కొంది.

అధిక ద్రవ్యీకరణతో అనర్థమే

ప్రజల పొదుపులో ఎక్కువ భాగం స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, రుణ పత్రాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులుగా మారడంపైనా ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. ద్రవ్యీకరణ పెట్టుబడులుగా భావించే ఈ స్పెక్యులేషన్ పెట్టుబడులు ఒక స్థాయికి మించి పెరిగితే ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి గానీ, వ్యక్తుల ఆర్థిక స్థిరత్వానిగానీ ఏ మాత్రం మంచిది కావని స్పష్టం చేసింది. అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికే ఈ లోపాలు కనిపిస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. మనలాంటి వర్ధమాన దేశాలకు ఇది మరింత ప్రమాదకరమని హెచ్చరించింది.

సమిష్టి కృషితోనే 'తయారీ' హబ్

తయారీ రంగంలో భారత్‌ను ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రయత్నాలపైనా ఆర్థిక సర్వే ఘాటు వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, పరిశోధన, అభివృద్ధి సంస్థలు, ఆర్థిక సంస్థలు చేతులు కలిపితే తప్ప.. ఈ లక్ష్య సాధన సాధ్యం కాదని స్పష్టం చేసింది. ప్రస్తుతం చైనా తన భారీ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రపంచ దేశాలను ముంచెత్తుతోంది. ఈ దెబ్బకు తట్టుకోలేక భారత్‌తో సహా అనేక దేశాల పరిశ్రమలు విలవిలలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక సర్వే చేసిన ఈ హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	84,330 ▲	77,300 ▲	1,07,000 ▲
విజయవాడ	85,000 ▲	79,500 ▲	96,000 ▲
విశాఖపట్నం	82,280 ▲	75,420 ▲	94,230 ▲
రాజమండ్రి	84,330 ▲	77,300 ▲	96,200 ▲
ప్రొద్దుటూరు	83,700 ▲	77,510 ▲	95,000 ▲
ముంబై	82,086 ▲	75,191 ▲	93,533 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

1వ తేదీ

హైదరాబాద్	480	విజయవాడ	500
వరంగల్	482	గోదావరి	490
చిత్తూరు	553	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్


హైదరాబాద్	98	విజయవాడ	109
వరంగల్	98	గుంటూరు	107
కరీంనగర్	98	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	94
కర్నూలు	98	నెల్లూరు	99
విశాఖపట్నం	101	అనంతపురం	99
గోదావరి	109		

స్టాక్ మార్కెట్లో దిద్దుబాటు పొంచి ఉంది

యువ మదుపరులూ జర జాగ్రత్త

అమెరికా మునిగితే మనమూ మునుగుతాం

దేశీయ స్టాక్ మార్కెట్ వాల్యుయేషన్లపై 2024-25 ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం కొంత దిద్దుబాటు జరిగినా.. మన స్టాక్ మార్కెట్ వాల్యుయేషన్స్ ఇంకా అధికంగానే ఉన్నట్టు స్పష్టం చేసింది. అమెరికా స్టాక్ మార్కెట్ ఏమాత్రం దిద్దుబాటు (కరెక్షన్)కు లోనైనా, మన స్టాక్ మార్కెట్ కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో దిద్దుబాటుకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రిటైల్ మదుపరులు ముఖ్యంగా 2020 కొవిడ్ సమయం నుంచి కొత్తగా పెట్టుబడులు ప్రారంభించిన యువ మదుపరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరింది. లేకపోతే నిండా మునగడం ఖాయమని హెచ్చరించింది. దేశీయ స్టాక్ మార్కెట్లో దేశీయ సంస్థాగత మదుపరులు, రిటైల్ మదుపరుల పాత్ర పెరిగినా, సెంటిమెంట్‌పరంగా మన మార్కెట్‌తో పాటు అనేక దేశాల స్టాక్ మార్కెట్లు ఇప్పటికీ అమెరికా మార్కెట్‌తో ముడిపడి ఉన్న విషయాన్ని ఆర్థిక సర్వే గుర్తు చేసింది.



13.2 కోట్ల మంది మదుపరులు

దేశీయ స్టాక్ మార్కెట్లో పెరుగుతున్న రిటైల్ మదుపరుల పాత్రనీ ఆర్థిక సర్వే గుర్తు చేసింది. 2019లో స్టాక్ మార్కెట్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో మదుపు చేసిన రిటైల్ మదుపరుల సంఖ్య 4.9 కోట్లు ఉంటే, 2024 డిసెంబరు నాటికి ఇది 13.2 కోట్లకు పెరిగిన విషయాన్ని గుర్తు చేసింది. గత ఐదేళ్లలో దేశీయ స్టాక్ మార్కెట్లో కుటుంబాల పెట్టుబడుల విలువ రూ.40 లక్షల కోట్లకు పైగా పెరిగినట్టు తెలిపింది. కంపెనీల ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు, ఆర్థిక వ్యవస్థ జోరు మీద ఉండడం, ఆన్‌లైన్ డిజిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి రావడం ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. డీమ్యాట్ ఖాతాల పరంగా చూసినా గత ఐదేళ్లలో ఏటా సగటున 33 శాతం చొప్పున పెరుగుతూ డిసెంబరు, 2024 నాటికి 18.5 కోట్లకు చేరిన విషయాన్నీ గుర్తు చేసింది. ఈక్విటీ క్యాష్ విభాగంలోనూ రిటైల్ మదుపరుల లావాదేవీల వాటా 35.6 శాతం నుంచి 41 శాతానికి చేరినట్టు తెలిపింది.

ప్రైవేట్ పెట్టుబడులు పెరగాలి

2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలంటే, కేవలం ప్రభుత్వ పెట్టుబడులు మాత్రమే చాలవని స్పష్టం చేసింది. ఇందుకు ప్రైవేట్ పెట్టుబడులూ పెద్దఎత్తున అవసరమని పేర్కొంది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానమూ ఇందుకు ఉపకరిస్తుందని తెలిపింది. అధిక వృద్ధి రేటు కొనసాగించాలన్నా, మరో 20 ఏళ్ల పాటు మన దేశం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపైన పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

మార్కెట్లకు సర్వే కిక్

- సెన్సెక్స్ 741 పాయింట్లు అప్
- 23,500 ఎగువకి నిఫ్టీ

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్లలో ఆర్థిక సర్వే జోష్ నింపింది. శనివారం ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్ వృద్ధి ఆధారితంగా ఉంటుందన్న అంచనాలతో మార్కెట్లు పరుగులు తీశాయి. మరోవైపు ఆర్థిక వ్యవస్థ బలమైన ఫండమెంటల్స్‌తో ముందుకు సాగుతోందని ఆర్థిక సర్వే ప్రకటించటంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపింది. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ 740.76 పాయింట్ల లాభంతో 77,500.57 పాయింట్ల వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో ఒక దశలో సెన్సెక్స్ 846.15 పాయింట్ల లాభంతో 77,605.96 పాయింట్ల స్థాయిని తాకింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 297.30 పాయింట్లు లాభపడి 23,508.40 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు లాభాల్లో ముగియటం వరుసగా ఇది నాలుగోరోజు.

నేడు మార్కెట్లు పనిచేస్తాయ్

దేశీయ స్టాక్ మార్కెట్లు శనివారం నాడు పనిచేయనున్నాయి. 2025-26 కేంద్ర బడ్జెట్ సందర్భంగా మార్కెట్లు యధావిధిగా కార్యకలాపాలు సాగిస్తాయని బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వెల్లడించాయి.

మ్యూచువల్ ఫండ్- టర్మ్ లైఫ్ కాంబో

సరికొత్త ఆర్థిక సాధనాన్ని అందుబాటులోకి తెచ్చే యోచనలో సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులకు జీవిత బీమా కవరేజీని జతచేసి మదుపరులకు సరికొత్త ఆర్థిక సాధనాన్ని అందుబాటులోకి తేవాలని భావిస్తున్నట్లు సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఐసీఏఐ శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే చర్చా పత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఆమె చెప్పారు. అయితే, పలు సంస్థలు ఇప్పటికే పెట్టుబడులతో పాటు బీమా కవరేజీని జత చేసిన ఆర్థిక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక సేవల విస్తరణకు ఇది దోహదపడనుందని బుచ్ అన్నారు. ఈ కాంబో ప్రొడక్ట్ ఆకర్షణీయ, అందుబాటు ధరలో విస్తృత ప్రజానీకానికి చేరువకానుందన్నారు.

ఇంటర్మీడియేటరీలకు మరింత భద్రంగా చెల్లింపులు: సెక్యూరిటీస్ మార్కెట్లో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా భద్రంగా, సమర్థవంతంగా చెల్లింపులు జరిపేందుకు వీలుగా కొత్త విధానాన్ని సెబీ ప్రతిపాదించింది. ఇందులో భాగంగా, రిజిస్టర్డ్ ఇంటర్మీడియేటరీ సంస్థలు వినూత్న యూపీఐ ఐడీని క్రియేట్ చేసుకోవాలని సెబీ సూచించింది.

60 గంటలకు మించిన పని కష్టమే

వారానికి 60 గంటలకు మించిన పని విధానం ప్రతిపాదనపైనా ఆర్థిక సర్వే అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ విధానాన్ని అనుమతిస్తే అది ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరించింది. దానివల్ల వారి మానసిక ఆరోగ్యం కూడా చెడిపోయే ప్రమాదం ఉందని తెలిపింది. వారానికి 60 గంటలకు మించి పని చేస్తే, ఉద్యోగుల ఉత్పాదకత పెరిగినా, వారి శారీరక, మానసిక ఆరోగ్యాలు దెబ్బతింటాయని గతంలో జరిగిన సర్వేల్లో తేలిన విషయాన్ని గుర్తు చేసింది. మానసిక కుంగుబాటు, ఆదుర్దాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా రోజూ 1,200 కోట్ల పని గంటలు, ఏటా సుమారు రూ.86.5 లక్షల కోట్లు ఉత్పత్తి నష్టపోతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన ఒక సర్వేను ఆర్థిక సర్వే గుర్తు చేసింది.

గ్రామీణ ఉపాధి హామీ పథకం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో జనవరి 10వ తేదీ నాటికి 220.11 కోట్ల వ్యక్తిగత పనిదినాల కల్పన జరిగిందని సర్వే నివేదిక తెలిపింది. ఈ కార్యక్రమం కింద 99.98 శాతం చెల్లింపులు నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా జరుగుతున్నట్టు పేర్కొంటూ క్రియాశీలంగా పని చేస్తున్న వారిలో 96.3 శాతం మందికి చెల్లింపులు ఈ వ్యవస్థ ద్వారానే జరిగినట్టు తెలియచేశారు.

స్మార్ట్‌సిటీల కింద 7,500 ప్రాజెక్టులు పూర్తి

స్మార్ట్ సిటీస్ మిషన్ కింద ఇప్పటి వరకు 1.5 లక్షల కోట్ల విలువైన 7,500 కోట్ల ప్రాజెక్టులు పూర్తి చేసినట్టు సర్వే వెల్లడించింది. 2015లో ప్రభుత్వం దీన్ని ప్రారంభించింది. అయితే ఈ ఏడాది జనవరి 13 నాటికి రూ.1.64 లక్షల కోట్ల విలువైన 8,058 ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారోత్పత్తుల కట్టడికి చర్యలు తీసుకోవాల్సిందే..

అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారోత్పత్తుల (యూపీఎఫ్) వినియోగాన్ని కట్టడి చేసేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ లేబులింగ్ నిబంధనలు మరింత కఠినతరం చేయటంతో పాటు గరిష్ఠ స్థాయిలో జీఎస్‌టీ విధించాలని సర్వే సూచించింది. అంతేకాకుండా ప్రత్యేకమైన అవేర్‌నెస్ క్యాంపెయిన్స్‌ను నిర్వహించాలని స్పష్టం చేసింది. ప్యాకేజ్డ్ ఫుడ్‌పై చక్కెర, ఉప్పు మోతాదులను స్పష్టంగా కనిపించేలా సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరింది.

తల్లి మృతదేహంతో 9 రోజులు!

- ఆమె హఠాన్మరణంతో షాక్‌లోకి ఇద్దరు కుమార్తెలు
- మణికట్టు, గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం
- ఘటనపై అనుమానాలు..

హైదరాబాద్, జనవరి31(ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి ఇద్దరు కూతుళ్లు.. ఆ ముగ్గురూ ఓ లోకంగా బయటి ప్రపంచంతో ఏమాత్రం సంబంధం లేకుండా బతుకుతున్నారు. ఆ ఇంట్లో తల్లి చనిపోయిందని.. 9 రోజులుగా మృతదేహం ఇంట్లోనే ఉందని.. ఎవ్వరికీ తెలియదు! మృతదేహం నుంచి దుర్వాసన వస్తున్నా.. ఇద్దరమ్మాయిలు దానితోనే సావాసం చేశారనీ తెలియదు!! చివరికి వారే ఇంట్లోంచి బయటకొచ్చి 'మా అమ్మ చనిపోయింది' అని చెప్పారు. హైదరాబాద్ వారాసిగూడ బౌద్ధనగర్‌లో ఈ ఘటన వెలుగుచూసింది. అప్పటిదాకా చక్కగా ఉన్న తల్లి హఠాత్తుగా చనిపోవడంతో అది జీర్ణించుకోలేక అమ్మాయిలు షాక్‌కు గురై ఇన్నాళ్లు ఇంట్లోనే ఉండిపోయారని పోలీసులు అంచనాకొచ్చారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. మృతురాలి పేరు లలిత (45). ఈమె భర్త పేరు సీఎల్ రాజు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. లలిత-రాజు దంపతులకు కూతుళ్లు రవళిక (25), యశ్విత (22) ఉన్నారు. ఐదేళ్ల క్రితం గొడవలు జరగడంతో రాజు భార్యాపిల్లలను, ఉద్యోగాన్ని వదిలేసి ఎటో వెళ్లిపోయాడు. అమ్మాయిలకు మేనమామ రమేశ్ ఉన్నా ఆ కుటుంబంతో మూడేళ్ల క్రితం సంబంధాలు తెగిపోయాయి. రవళిక, యశ్విత పదో తరగతి దాకా చదివి మానేశారు. రవళిక ఓ ఈవెంట్‌లో, అశ్విత ఓ బట్టల షాపులో పనిచేస్తున్నారు. జనవరి 22న రాత్రి ముగ్గురు భోజనాలు చేసి, కాసేపు మాట్లాడుకొని నిద్రపోయారు. ఉదయం లలిత ఎంతసేపటికి నిద్రలేవకపోవడంతో ఆమె చనిపోయిందని తెలుసుకున్నారు. వారు కూడా ఆత్మహత్య చేసుకోవాలనుకుని కత్తితో మణికట్టు, గొంతు కోసుకున్నారు. రక్తం బాగా పోవడంతో స్పృహ కోల్పోయిన వారు మూడు రోజుల తర్వాత స్పృహలోకొచ్చినా కూడా తీవ్ర డిప్రెషన్‌తో ఇంటి తలుపులు తెరవలేదు. రోజులు గడుస్తున్న కొద్దీ మృతదేహం కుళ్లిపోయి, దుర్వాసన పెరుగుతుండటంతో భరించలేక శుక్రవారం మధ్యాహ్నం రవళిక, యశ్విత ఇంట్లోంచి బయటకొచ్చారు. స్థానికుల సూచనతో సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడున్న బీఆర్ఎస్ నాయకుడు జి.చంద్రశేఖర్‌ను కలిసి తమ తల్లి దహన సంస్కారాలకు సాయం చేయాలని కోరారు. అమ్మాయిల పరిస్థితిని గమనించిన ఆయన పోలీసులకు సమాచారమిచ్చారు. పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డాగ్ స్క్వాడ్స్ కూతుళ్లు రవళిక, యశ్విత వద్దకు వెళ్లి ఆగిపోయాయి. పోస్టుమార్టం నివేదిక వచ్చాకే ఘటనపై స్పష్టత వస్తుందని పోలీసులు చెప్పారు.



లలిత

ఐర్లాండ్‌లో ఇద్దరు ఏపీ విద్యార్థుల మృతి

- కారు చెట్టును ఢీకొనడంతో ప్రమాదం
- ఉన్నత చదువులకు వెళ్లిన భార్గవ్, సురేష్



భార్గవ్ సురేష్

జగ్గయ్యపేట/జగ్గయ్యపేటరూరల్/రొంపిచర్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఐర్లాండ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏపీకి చెందిన ఇద్దరు విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. వివరాలివీ.. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామానికి చెందిన చిట్టూరి భార్గవ్ (25), పల్నాడు జిల్లా రొంపిచర్ల పడమటి పాలేనికి చెందిన చెరుకూరి సురేష్ (26) ఉన్నత చదువుల నిమిత్తం ఐర్లాండ్ వెళ్లారు. భార్గవ్ కార్లో పట్టణంలోని సౌత్‌ఈస్ట్ టెక్నోలాజికల్ యూనివర్సిటీలో చదువుతున్నాడు. సురేష్ ఎమ్మెస్ చేసేందుకు ఏడాది క్రితం వెళ్లాడు. వీరు శుక్రవారం స్నేహితులతో కలిసి కారులో వెళ్తూ ఓ చెట్టును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో భార్గవ్, సురేష్ ఇద్దరూ మృతి చెందినట్లు భార్గవ్ తండ్రి సాయిబాబుకు సమాచారం వచ్చింది. చెరుకూరి రామకోటయ్య, కుమారి దంపతులకు పెద్ద కుమారుడు సురేష్. ఐర్లాండ్‌లో విపరీతమైన మంచు కురుస్తుంటుందని, దీని వల్లే ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు.

పసిఫిక్‌లో బలహీన 'లానినా'

- ఏప్రిల్ వరకు కొనసాగే అవకాశం..
- ఫిబ్రవరిలో ఎక్కువ ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం
- ఉత్తరాదిలో గోధుమ, ఆవాలు, యాపిల్ పంటలపై ప్రభావం
- ఏపీలోనూ అధిక ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పసిఫిక్ మహాసముద్రంలో 'లానినా' ఏర్పడింది. గతేడాది జూన్‌లో వచ్చిన తటస్థ పరిస్థితులు జనవరి ద్వితీయార్థం వరకూ కొనసాగి, తర్వాత బలహీన లానినా ఏర్పడిందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం భూమధ్యరేఖకు ఆనుకుని పసిఫిక్ మహాసముద్రంలో బలహీన లానినా ఉందని, ఇది ఏప్రిల్ వరకూ కొనసాగుతుందని, తర్వాత తిరిగి తటస్థ పరిస్థితులు నెలకొంటాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. లానినా ప్రభావంతో మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయని పేర్కొంది. దీని ప్రభావంతో తూర్పు పసిఫిక్ మహాసముద్రం నుంచి భారత ఉపఖండంపైకి తేమగాలులు వీస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల భారత్‌లో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు ఒక మోస్తరుగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే స్థానిక పరిస్థితులు ప్రభావం ఉన్నప్పుడు మాత్రం ఎండలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. బలహీన లానినా ఏప్రిల్ వరకు కొనసాగుతుందని ప్రస్తుతం చెబుతున్నా... వచ్చే రెండు, మూడు వారాల్లో దీనిపై మరింత స్పష్టత వస్తుందని అంచనా వేస్తున్నారు. గతేడాది ఆగస్టులోనే లానినా వస్తుందని ప్రపంచ వాతావరణ సంస్థ, ఆస్ట్రేలియా, ఐఎండీ చెప్పినప్పటికీ ఆరు నెలల తర్వాత అది కూడా బలహీన లానినా ఏర్పడింది. ఆరు నెలలుగా లానినా గోడమీద పిల్లిలా ఉందని వాతావరణ అధికారి ఎస్.జగన్నాథ కుమార్ విశ్లేషించారు. భూమధ్యరేఖకు అనుకుని పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటే 'ఎల్‌నినో', తక్కువగా ఉంటే 'లానినా', సాధారణంగా ఉంటే తటస్థ పరిస్థితులుగా చెబుతారు.

ఫిబ్రవరిలో ఎండ తీవ్రత ఎక్కువే..!

ఫిబ్రవరికి సంబంధించి వాతావరణ పరిస్థితులపై శుక్రవారం ఐఎండీ బులెటిన్ విడుదల చేసింది. పశ్చిమ, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు దక్షిణ, వాయవ్య భారతంలో కొద్ది ప్రాంతాలు తప్ప దేశంలో అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ నమోదుకానున్నాయి. ఫిబ్రవరిలో శీతల గాలులు (కోల్డ్ వేవ్స్) సాధారణం కంటే తక్కువగా సంభవించనున్నాయి. అంటే ఫిబ్రవరిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా ఉత్తరాదిలో జమ్ము కశ్మీర్ నుంచి దిగువన ఉత్తరప్రదేశ్ వరకూ ఏడు వాతావరణ సబ్ డివిజన్లు... తూర్పు, పశ్చిమ ఉత్తరప్రదేశ్, పంజాబ్, హరియాణా, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకశ్మీర్/లద్దాఖ్‌లలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదుకానుంది. సాధారణంగా ఫిబ్రవరిలో 65 మి.మీ.లు వర్షపాతం కురవాలి. ఈసారి తక్కువ వర్షపాతం కురిసే అవకాశం ఉన్నందున ఈ ఏడు సబ్‌డివిజన్లలో గోధుమ, ఆవాలు, బఠాణీలు, యాపిల్, ఇతర ఉద్యానవన పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుందని వాతావరణ నిపుణులు ఆందోళన వ్యక్తంచేశారు. కాగా, ఏపీలోనూ ఫిబ్రవరిలో ఎండలు స్వల్పంగా పెరుగుతాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. కోస్తాలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా, రాయలసీమలో తక్కువగా నమోదవుతాయి. వర్షపాతం కూడా సాధారణం కంటే తక్కువగా నమోదవుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

పెరిగిన ఎండలు.. కర్నూలులో 36.6 డిగ్రీలు

రథసప్తమి రాక ముందే రాష్ట్రంలో ఎండ చుర్రుమనిపిస్తోంది. శుక్రవారం రాయలసీమ, కోస్తాల్లో పలుచోట్ల ఎండ పెరిగింది. చాలా చోట్ల పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. శుక్రవారం దేశంలోనే అత్యధికంగా కర్నూలులో 36.6డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రి ఉష్ణోగ్రతలు కొన్నిచోట్ల సాధారణం కంటే తక్కువగా, మరికొన్నిచోట్ల ఎక్కువగా నమోదయ్యాయి. తమిళనాడుకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో తూర్పుగాలులు కొనసాగుతున్నందున రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, సీమల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

మోదీ సర్కారు మూడింతల వేగం

» జమిలి, వక్ఫ్, మహిళా బిల్లులే నిదర్శనం

» పార్లమెంటులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ, జనవరి 31: నరేంద్ర మోదీ నాయకత్వంలో మూడోసారి అధికారానికి వచ్చిన తర్వాత ఎన్డీఏ సర్కారు గత ప్రభుత్వాలకన్నా మూడు రెట్ల వేగంతో పని చేస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రభుత్వ పాలనలో విధాన వైకల్యం పూర్తిగా మాయమైందని కొనియాడారు. జమిలి ఎన్నికలు, వక్ఫ్ బోర్డు బిల్లులను ఇందుకు ఉదాహరణగా ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్ల దిశగానూ అడుగులు వేశామని చెప్పారు. శుక్రవారం ముర్ము బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. మోదీ సర్కారు విద్య, యువతకు ఉపాధి అంశాలపై ప్రధానంగా దృష్టిసారించిందన్నారు. దేశానికి మధ్య తరగతి అందిస్తున్న సేవలను గుర్తిస్తోందన్నారు. పంటలకు మద్దతు ధరలు కల్పించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తోందని చెప్పారు. ఇటీవలే రైతులకు పీఎం కిసాన్ పథకం కింద 41వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని ప్రకటించారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద మూడు కోట్ల ఇళ్లు ఇస్తున్నట్లు గుర్తు చేశారు.

పోలవరం ప్రాజెక్టుకు రూ. 12 వేల కోట్లు

ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం అదనంగా రూ.12 వేల కోట్లు మంజూరు చేసిందని రాష్ట్రపతి అన్నారు. ఆమె తన ప్రసంగంలో ప్రత్యేకంగా పోలవరం ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ముందు ఇటీవల మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు, కుంభమేళాలో మరణించిన భక్తులకు నివాళులు అర్పించారు.

సిరుల మాతల్లి కరుణించాలి!


» పేదలు, మధ్యతరగతి ప్రజలపై లక్ష్మీదేవి ఆశీస్సులు కురిపించాలి

» బడ్జెట్ ముంగిట ప్రధాని వ్యాఖ్య



న్యూఢిల్లీ, జనవరి 31: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం శనివారం ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్‌లో పేదలు, మధ్యతరగతి ప్రజలకు, మహిళలకు వరాలు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాని ఈ దిశగా కొన్ని సంకేతాలిచ్చారు. శుక్రవారం ఉదయం బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "బడ్జెట్ సమావేశాల ముంగిట లక్ష్మీదేవి అమ్మవారిని ప్రార్థిస్తున్నా.. సిరుల మాతల్లి దేశంలోని పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రజలను కరుణించాలి. వారిపైఆశీస్సులు కురిపించాలి. 2025 బడ్జెట్ భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త చోదక శక్తిని అందించాలి"అని ప్రధాని ఆకాంక్షించారు. "మా మూడో దశ పాలనలో ఇది తొలి పూర్తిస్థాయి బడ్జెట్. నేను అత్యంత నమ్మకంగా చెబుతున్నా.. 2047 నాటికి దేశం వికసిత భారత్ లక్ష్యాన్ని సంపూర్ణంగా చేరుకుంటుంది. అప్పటికి దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి వందేళ్లు పూర్తవుతాయి"అని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను బడ్జెట్ నెరవేరుస్తుందని, వారి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. "ఇన్నోవేషన్, ఇంక్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో అనేక చరిత్రాత్మక బిల్లులను తీసుకురానున్నాం. వీటిపై సమగ్ర చర్చల అనంతరం చట్టాలుగామారి.. దేశాన్ని మరింత బలోపేతం చేస్తాయి" అని చెప్పారు. పార్లమెంటు సమావేశాలకు ముందు గత పదేళ్లలో తొలిసారి ఇప్పుడే విదేశీ జోక్యం లేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము చేసిన ప్రసంగంలో వికసిత్ భారత్ ప్రతిబింబించిందంటూ 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ కొనియాడారు.

లోకం తీరు



నలుగురిలో అననప్పుడు

అట్రాసిటీ చట్టం వర్తించదు

కావాలనే.. అందరి ఎదుటా అవమానించే ఉద్దేశంతో దూషిస్తేనే ఆ చట్టం వర్తిస్తుంది

సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జనవరి 31: అవమానించే ఉద్దేశంతో అందరి ఎదుటా కులం పేరుతో దూషించనప్పుడు ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు పెట్టడం కుదరదంటూ.. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తిపై దాఖలైన కేసును సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఆ చట్టంలోని సెక్షన్ 3(1)(ఆర్), సెక్షన్ 3(1)(ఎస్) ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వ్యక్తులను అవమానించడమే లక్ష్యంగా అందరి ముందూ కావాలని దూషిస్తేనే దాన్ని బహిరంగంగా జరిగిన ఘటనగా భావించాలని.. నాలుగు గోడల మధ్య ఒక కార్యాలయంలో జరిగిన ఘటనను ఈ సెక్షన్ల కింద నేరంగా పరిగణించలేమని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి చేసిన అప్పీలుపై ఈ నిర్ణయాన్ని వెలువరించింది. భూమి పట్టాలో పేరు చేర్పుపై తన తండ్రి ఇచ్చిన దరఖాస్తు పరిస్థితి గురించి తెలుసుకునేందుకు ఆ వ్యక్తి 2021 సెప్టెంబరులో స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. వివరాలు అడిగే క్రమంలో వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. ఆ సమయంలో అతడు తన కులం గురించి ప్రస్తావించి.. "నీలాంటివాళ్లని ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమిస్తే మీరు ఇలాగే చేస్తారు" అన్నాడని.. కులం పేరుతో దూషించి, అసభ్యకరమైన పదజాలంతో అవమానించడని పేర్కొంటూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దీనిపై తిరుచిరాపల్లి కోర్టులో కేసు నడిచింది. తనపై నమోదైన కేసు కొట్టివేయాలని కోరుతూ నిందితుడు హైకోర్టును ఆశ్రయించగా అక్కడ నిరాశ ఎదురయింది. దాంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ కేసును విచారించిన ధర్మాసనం.. "ఎఫ్ఐఆర్ ప్రకారం కూడా ఆ ఘటన బాధితుడి కార్యాలయంలోనే, నాలుగు గోడల మధ్యనే జరిగింది. ఈ ఘటన జరిగిన తర్వాతే.. ఆయన సహోద్యోగులు అక్కడికి వచ్చారు. కాబట్టి ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌లోని సెక్షన్ 3(1)(ఆర్), సెక్షన్ 3(1)(ఎస్) ఈ కేసులో వర్తించవు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఇచ్చిన తీర్పును తోసిపుచ్చింది. ఈ కేసుకు సంబంధించి దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను కొట్టివేసింది.

ఆలయాల్లో వీఐపీ దర్శనాలు వద్దు

» సుప్రీం కోర్టులో పిల్.. తిరస్కరణ

న్యూఢిల్లీ, జనవరి 31: దేవాలయాల్లో వీఐపీ దర్శనాలను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రత్యేక దర్శనాలు ఉండకూడదని తామూ అభిప్రాయపడుతున్నామని, కానీ ఇది రాజ్యాంగం కింద విచారించదగ్గ కేసు కాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం తెలిపింది. సమాజం, ఆలయ నిర్వహణ కమిటీలే దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే సంబంధిత అధికార్లకు వినతిపత్రం సమర్పించవచ్చని తెలిపింది. 12 జ్యోతిర్లింగ క్షేత్రాలు, ఇతర దేవాలయాల్లో వీఐపీ దర్శనాలు నిర్వహిస్తుండడం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ బృందావన్‌లోని శ్రీరాధా మదన్‌మోహన్ ఆలయ సేవాయత్ విజయ్ కిషోర్ గోస్వామి ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని నిరోధించాలని కేంద్ర హోం శాఖకు పలుమార్లు కోరినా ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికే సూచనలు పంపించిందని, ఇతర రాష్ట్రాలను విస్మరించిందని తెలిపారు. పరిశీలించిన ధర్మాసనం.. ఈ అంశంపై కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని తెలిపింది.

ఏపీ, గోవా, త్రిపుర మినహా ఇతర రాష్ట్రాలకు జరిమానా: సుప్రీం కోర్టు

» అక్రమ తుపాకుల నివారణపై ప్రణాళికలు లేనందుకు చర్య

అక్రమ తుపాకుల తయారీ, అమ్మకాలను నిరోధించడానికి కార్యాచరణను తయారు చేయాలన్న ఆదేశాలను అమలు చేయనందుకు సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు జరిమానా విధించింది. 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు రూ.10వేల వంతున జరిమానా వేసింది. కేవలం ఆంధ్రప్రదేశ్, త్రిపుర, గోవా రాష్ట్రాలు మాత్రమే కార్యాచరణ ప్రణాళికలు తయారు చేశాయి. ప్రణాళికలు రూపొందించాలంటూ గత ఏడాది నవంబరు ఏడో తేదీన ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకపోవడంపై జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఎస్.సి.శర్మ ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

శంషాబాద్ టు పుకెట్

» కొత్తగా ఎయిర్ ఇండియా విమానం

శంషాబాద్ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పర్యాటక కేంద్రమైన పుకెట్‌కు నూతన విమాన సర్వీసును ప్రారంభించినట్లు జీఎంఆర్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీఎంఆర్ సీఈవో ప్రదీప్ పణీకర్ మాట్లాడుతూ.. శంషాబాద్ విమానాశ్రయం నుంచి థాయిలాండ్‌లోని పుకెట్‌కు తొలి విమాన సర్వీసు శుక్రవారం(జనవరి 31న) బయలుదేరిందని చెప్పారు. ఈ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం వారంలో మూడుసార్లు బుధ, శుక్ర, ఆదివారాల్లో నడవనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ సింగ్, జీఎంఆర్ ప్రతినిధులు, ఎయిర్‌లైన్స్ అధికారులు పాల్గొన్నారు.

జన్మతః పౌరసత్వం బానిసల పిల్లల కోసమే

ప్రపంచమంతా అమెరికాలో తిష్ట వేసేందుకు కాదు: ట్రంప్

వాషింగ్టన్, జనవరి 31: జన్మతః పౌరసత్వం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ హక్కు కేవలం బానిసల పిల్లల కోసం కల్పించినదని, అంతే తప్ప.. ప్రపంచం మొత్తం వచ్చి అమెరికాలో తిష్ట వేసేందుకు కాదని అన్నారు. అధికారంలోకి వచ్చీరాగానే జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ ట్రంప్ ఆదేశాలు జారీ చేయడం, ఇది వివాదాస్పదం కావడంతో న్యాయస్థానం ఆ ఉత్తర్వులను నిలిపివేయడం తెలిసిందే. కాగా, ఈ అంశంపై ట్రంప్ తాజాగా స్పందిస్తూ, "గతాన్ని ఓసారి పరిశీలిస్తే జన్మతః పౌరసత్వ హక్కును బానిసల పిల్లల కోసం కల్పించిందనే విషయం స్పష్టమవుతుంది. అంతే తప్ప.. ప్రపంచం మొత్తం వచ్చి అమెరికాను ఆక్రమించుకునేందుకు కాదు. అర్హత లేనివారు కూడా ఇక్కడికి వస్తున్నారు. తద్వారా అర్హత లేని పిల్లలకు పౌరసత్వం దక్కుతోంది" అని వ్యాఖ్యానించారు.

పాపం ముర్ము.. పూర్ లేడీ!

రాష్ట్రపతిపై సోనియా వ్యాఖ్యలు.. బడ్జెట్ సమావేశాల వేళ రాజకీయ దుమారం!

» రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్ అన్న రాహుల్

» ప్రధాని, బీజేపీ నేతల ఆగ్రహం



న్యూఢిల్లీ, జనవరి 31: పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తొలిరోజే రాజకీయ దుమారం చోటుచేసుకుంది. శుక్రవారం ఉభయసభలనుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. రాష్ట్రపతి ప్రసంగంపై ఆమె తన కుమారుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కుమార్తె, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రాతో కలిసి మీడియా ఎదుట స్పందించారు. ప్రసంగం సుదీర్ఘంగా ఉందన్నారు. 'పూర్ లేడీ(రాష్ట్రపతి ముర్ము).. బాగా అలసిపోయారు.. పాపం.. ప్రసంగం చదవలేకపోయారు' అని జాలిగొల్పేలా మాట్లాడారు. ఈ వీడియో క్లిప్ క్షణాల్లో వైరల్ అయింది. 'ప్రసంగం బోరింగ్‌గా ఉందా? నో కామెంట్స్! చెప్పిందే మళ్లీ మళ్లీ చెప్పారు' అని రాహుల్ తన తల్లితో అనడం అందులో వినిపించింది. వీరి వ్యాఖ్యలపై ప్రధాని మోదీ, బీజేపీ సీనియర్ నేతలు విరుచుకుపడ్డారు. ఇవి ముర్ము పరువుకు భంగం కలిగించేవిగా, అవమానకరంగా ఉన్నాయని.. కాంగ్రెస్ అగ్ర నేతల భూస్వామ్య, పెత్తందారీ పోకడకు ఇవి నిదర్శనమని ధ్వజమెత్తారు. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిపై తనకున్న చులకన భావాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వివాదంపై రాష్ట్రపతిభవన్ కూడా స్పందించింది. సోనియా, రాహుల్ వ్యాఖ్యలను ఖండించింది.

దురహంకారం బట్టబయలు: ప్రధాని

ప్రధాని మోదీ ఢిల్లీలో జరిగిన ఓ ర్యాలీలో తాజా అంశంపై స్పందించారు. సోనియాను తీవ్రంగా విమర్శించారు. ఆమె వ్యాఖ్యలు పేదలు, గిరిజనులను అవమానించేవిగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రథమ కుటుంబం దురహంకారం ఇవాళ పూర్తిగా బట్టబయలైందని, దేశానికి తామే యజమానులమని ఈ కాంగ్రెస్ నేతలు భావిస్తుంటారని దుయ్యబట్టారు. 'రాష్ట్రపతి తన మాతృభాష ఒడియాలాగా హిందీలో మాట్లాడలేకపోయినా.. పార్లమెంటులో స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. కాంగ్రెస్ నేతలు ఆ ప్రసంగంపై వ్యాఖ్యలు చేసి ఆమెను చిన్నబుచ్చారు. ఆ పార్టీ రాచ కుటుంబం మరింత లోతుకు దిగజారింది. ఇది దేశంలోని 10 కోట్ల మంది గిరిజన సోదర సోదరీమణులకు అవమానం. కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రతి పేదవాడికీ అవమానం' అని వ్యాఖ్యానించారు. భారత ఆర్థికాభివృద్ధి, రైతు సంక్షేమం, మెట్రో ప్రాజెక్టులు, క్రీడాకారుల గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారని.. కాంగ్రెస్ రాచకుటుంబానికి అది కూడా విసుగుపుట్టించిందని.. అర్బన్ నక్సల్స్ మాటలైతే వారికి బాగా ఆసక్తికరంగా ఉంటాయని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఎప్పుడూ అణగారిన వర్గాల అభ్యున్నతి పట్టదని ఆయన చెప్పారు.

భూస్వామ్య మనస్తత్వం: నడ్డా

సోనియా వ్యాఖ్యలు చాలా అగౌరవంగా ఉన్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా విమర్శించారు. బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిపై కాంగ్రెస్‌కున్న అగౌరవాన్ని ఇది చాటిందన్నారు. ఇలాంటివి జరగడం ఇదే మొదటిసారి కాదని చెప్పారు. దేశం కోసం, సమాజం కోసం విస్తృతంగా ద్రౌపది ముర్ము కృషిచేశారని.. గిరిజన మహిళ అయిన మన రాష్ట్రపతి బలహీనురాలు కాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పష్టంచేశారు. ఆమెను బలహీనురాలిగా చూపేందుకు చేసే ప్రయత్నాలను బీజేపీ సహించదన్నారు. కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోనియా, రాహుల్ వ్యాఖ్యలు రాష్ట్రపతికి తీరని అవమానమని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతిగా కాంగ్రెస్ అంగీకరించలేకపోతోందని బీజేపీ ఎంపీ సుకాంత మజుందార్ ధ్వజమెత్తారు. ముర్ము ఆదివాసీ కుటుంబానికి చెందినవారని, విమర్శించడ సరికాదన్నారు.

ఆ వ్యాఖ్యలు సముచితం కాదు

రాష్ట్రపతి భవన్

సోనియా, రాహుల్ వ్యాఖ్యలపై రాష్ట్రపతి భవన్ కూడా స్పందించింది. రాష్ట్రపతి పట్ల కాంగ్రెస్ నేతల మాటలు సముచితం కాదని.. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవి గౌరవాన్ని దెబ్బతీశారని, ఇవి ఆమోదయోగ్యం కావని ఓ ప్రకటనలో పేర్కొంది. హిందీవంటి భారతీయ భాషల యాసల గురించి తెలియనట్లు కనిపిస్తోందని, అందుకే తప్పుడు అభిప్రాయం ఏర్పడినట్లు భావిస్తున్నామని తెలిపింది. 'ఏది ఏమైనా అలాంటి వ్యాఖ్యలు దురదృష్టకరం.. పూర్తిగా నివారించాల్సినవి. ప్రసంగం ముగిసేటప్పటికి రాష్ట్రపతి బాగా అలసిపోయారని.. మాట్లాడలేకపోయారని సదరు కాంగ్రెస్ నేతలు అన్నారు. వీటిలో ఏ మాత్రం నిజం లేదని రాష్ట్రపతి భవన్ స్పష్టం చేయదలచింది. ప్రసంగించేటప్పుడు ఏ దశలోనూ రాష్ట్రపతి అలసిపోలేదు. పైగా అణగారిన వర్గాలు, మహిళలు, రైతుల గురించి మాట్లాడడం అలుపు కలిగించదని రాష్ట్రపతి విశ్వసిస్తున్నారు' అని పేర్కొంది.

అమ్మకు దురుద్దేశం లేదు: ప్రియాంక

తన తల్లికి రాష్ట్రపతి పట్ల అగౌరవం లేదని, ఆమె వ్యాఖ్యల వెనుక దురుద్దేశం లేదని ప్రియాంక అన్నారు. మోదీ, బీజేపీ నేతలు, కేంద్రమంత్రులతో పాటు రాష్ట్రపతి భవన్ కూడా తీవ్రంగా స్పందించడంతో ఆమె మీడియా వక్రీకరించిందని ఆరోపించారు. ఆమె విలేకరులతో మాట్లాడారు. 'నా తల్లి 78 ఏళ్ల వృద్ధురాలు. రాష్ట్రపతి ఇంత సుదీర్ఘ ప్రసంగం చదివి అలిసిపోయినట్లు కనిపించారంటూ జాలిపడ్డారు. రాష్ట్రపతి అంటే ఆమెకు అత్యున్నత గౌరవముంది. ఈ అంశాన్ని మీడియా వక్రీకరించడం దురదృష్టకరం' అని అన్నారు. కాగా, సోనియా లక్ష్యంగా బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖండించారు. ఆర్థిక సర్వే మోదీ ప్రభుత్వానికి సత్యాన్ని చూపించిందని.. అయితే దేశ ఆర్థిక దుస్థితిని కప్పిపుచ్చడానికి బీజేపీ నాయకులు, ఓ వర్గం మీడియా.. సోనియా వాడిన పదాలను వక్రీకరిస్తున్నారని 'ఎక్స్'లో ఆరోపించారు.

నేడే కేంద్ర బడ్జెట్

» పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) బడ్జెట్‌ను శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆమెకు వరుసగా ఇది 8వసారి. ధరల చురకలు, అత్తెసరు వేతనాలతో సతమతమవుతున్న మధ్య తరగతి జనం.. ఈసారైనా నిర్మలమ్మ పన్ను భారాన్ని తగ్గించకపోదా అని గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు. పన్ను మినహాయింపు పరిమితిని భారీగా పెంచడంతో పాటు పన్ను రేట్లను తగ్గించాలని వారు కోరుకుంటున్నారు. కాగా, ఆర్థిక స్థిరీకరణ లక్ష్యాలకు కట్టుబడి ఉంటూనే మందగించిన వృద్ధిని మళ్లీ పరుగులు పెట్టించేందుకు బడ్జెట్‌లో చర్యలు చేపట్టవచ్చన్న అంచనాలున్నాయి. మార్కెట్లో వస్తు, సేవల వినియోగాన్ని పెంచడంపై ప్రధానంగా దృష్టిసారించే అవకాశం ఉంది.

90ల తర్వాత దళితుల కోసం పోరాడలేకపోయాం: రాహుల్




న్యూఢిల్లీ, జనవరి 31: ఇందిరాగాంధీ హయాంతో పోలిస్తే.. కాంగ్రెస్ పార్టీ 1990ల తర్వాత దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆదివాసీల హక్కుల కోసం సమర్థంగా పోరాడలేకపోయిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దళిత ఇన్‌ఫ్లుయెన్సర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. గాంధీయేతర కుటుంబ వ్యక్తులు పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా చేసిన కాలానికి సంబంధించి ఆయన ఈ తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'పీవీ నరసింహారావు ప్రతీది నాశనం చేశారు' అని ప్రేక్షకుల్లో ఒకరు అనగా.. దానికి రాహుల్ నవ్వుతూ.. 'నేను ఎవరి పేరు చెప్పను, వాస్తవాన్ని కాంగ్రెస్ అంగీకరించాల్సి ఉంటుంది' అని సమాధానం ఇచ్చారు. పార్టీలో అణగారిన వర్గాల పాత్ర పెరగాలంటే.. అంతర్గత సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గత 10-15 ఏళ్లలో తమ పార్టీ చేయాల్సిన పనిని చేయలేదని ఒక కాంగ్రెస్ సైనికుడిగా చెప్పగలనని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పై దళితులు, వెనుకబడిన వర్గాలకు గతంలో ఉన్న విశ్వాసాన్ని తర్వాత కూడా కొనసాగించి ఉంటే.. ఆరెస్సెస్, బీజేపీలకు అధికారం వచ్చేదికాదని చెప్పారు.

ప్రయాగ్‌రాజ్‌కే 'అయోధ్య'ను తెచ్చిన తెలుగోడు!

» రామమందిర ప్రతిరూపం నిర్మించిన కళాదర్శకుడు రమణ వంక

» 81 అడుగుల ఎత్తుతో 16,800 చ.అ విస్తీర్ణంలో మందిరం

» నిర్మాణంలో వెదురు కర్రలు, ఫోమ్, ఫైబర్.. 25 రోజుల్లోనే పూర్తి





ప్రయాగ్‌రాజ్ సమీపంలో విద్యుత్తు వెలుగుల మధ్య రామమందిర ప్రతిరూపం, రామ మందిర ప్రతిరూపం ఫొటోతో రమణ వంక

హైదరాబాద్ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పుణ్యస్నానాల కోసం మహాకుంభ మేళా వెళుతున్నారా? అక్కడి నుంచి అయోధ్యకు వెళ్లాలని మనసులో ఉన్నా.. అధికారులు నియంత్రిస్తున్నారని అసంతృప్తికి గురవుతున్నారా? నిరుత్సాహపడొద్దు.. మహా కుంభ మేళాకే అయోధ్య తరలివచ్చింది. అచ్చంగా అయోధ్యలోని మందిరాన్ని దర్శించుకున్న అనుభూతి కలిగేలా నిర్మించారు. ఈ అయోధ్య మందిర ప్రతిరూపాన్ని నిర్మించింది ప్రముఖ తెలుగు కళాదర్శకుడు రమణ వంక. ఓ ప్రైవేటు సంస్థ.. త్రివేణి సంగమానికి కిలోమీటరున్నర దూరంలో చుంగ్లీ అనే చోట భక్తుల కోసం ప్రత్యేక ఈవెంట్లు నిర్వహిస్తోంది. అందులో భాగంగా.. రమణ వంక అచ్చంగా అయోధ్యను తలపించేలా 16,800 చదరపు అడుగుల విస్తీర్ణం, 140 అడుగుల పొడవు, 120 అడుగుల వెడల్పుతో మందిరాన్ని కట్టారు. నిర్మాణంలో వెదురు కర్రలు, వస్త్రాలు, ఫోమ్ మెటీరియల్, ఫైబర్‌ను ఉపయోగించారు. గర్భాలయంలో కూడా అయోధ్యలో మాదిరిగానే బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ నిత్యం 20వేలమంది భక్తులు దర్శించుకుంటున్నారు. భక్తుల కోసం ప్రయాగ్‌రాజ్‌లో అయోధ్య రామమందిర ప్రతిరూపాన్ని నిర్మించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు రమణ వంక 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. నిర్మాణంలో 200 మంది కార్పెంటర్లు, సివిల్ వర్కర్లు పాలుపంచుకున్నారని.. 25 రోజుల్లో నిర్మాణం పూర్తిచేశామని వివరించారు. డిసెంబరు 29న ప్రత్యేక పూజలతో ఆలయాన్ని తెరిచామని చెప్పారు.

ఖర్చులు పెరిగిపోతున్నాయ్

» పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన సగటు నెలవారీ వినియోగ వ్యయం.. 18 రాష్ట్రాలలో హెచ్‌సీఈఎస్ అధ్యయనం

న్యూఢిల్లీ, జనవరి 31: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సగటు నెలవారీ వినియోగం క్రమేణా పెరుగుతోంది. అదే సమయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వినియోగ అసమానత తగ్గుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశంలో 18 ప్రధాన రాష్ట్రాల్లోని పరిస్థితులను అంతకుముందు ఏడాదితో పోలుస్తూ గృహ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) తాజాగా నివేదిక విడుదల చేసింది. 2022-23తో పోలిస్తే 2023-24లో వినియోగ అసమానత గ్రామీణ ప్రాంతాల్లో 0.27 నుంచి 0.24కు పట్టణ ప్రాంతాల్లో 0.31 నుంచి 0.28కు తగ్గింది. 2022-23లో కంటే 2023-24లో 18 రాష్ట్రాలలోనూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సగటు నెలవారీ తలసరి వినియోగ వ్యయం (ఎంపీసీఈ) పెరిగింది. గరిష్ఠంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒడిశాలో 14%, పట్టణ ప్రాంతాల్లో పంజాబ్‌లో 13% పెరిగింది. ఇక అత్యల్పంగా గ్రామీణ ప్రాంతాల్లో మహారాష్ట్రలో 3%, పట్టణ ప్రాంతాల్లో కర్ణాటకలో 5% పెరుగుదల ఉంది. 18 రాష్ట్రాల్లో నెలవారీ సగటులో చాలా వ్యత్యాసం కనిపించింది. ఇక 11 రాష్ట్రాలలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వినియోగ అసమానత తగ్గింది. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలవారీ వినియోగ వ్యయంలో అత్యధికంగా ఆహారం కోసం 47% ఖర్చు పెడుతున్నారు. ఆ తర్వాత పాల ఉత్పత్తులు, వైద్యం, దుస్తులకు ఖర్చు చేస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తృణధాన్యాల వినియోగం పెరుగుతోంది.

కిన్నెర అఖాడా నుంచి మమత కులకర్ణి బహిష్కరణ

» మహామండలేశ్వర్‌గా ఆమెకు ఇచ్చిన హోదా తొలగింపు

న్యూఢిల్లీ, జనవరి 31: బాలీవుడ్ నటి మమతా కులకర్ణి కిన్నెర అఖాడా నుంచి శుక్రవారం బహిష్కరణకు గురయ్యారు. మహామండలేశ్వర్‌గా ఆమెకు ఇచ్చిన హోదాను రద్దు చేశారు. ఆమెను ఆ హోదాలో నియమించిన ఆచార్య మహామండలేశ్వర్ లక్ష్మీ నారాయణ్ త్రిపాఠీని సైతం అఖాడా నుంచి తొలగించారు. గతవారం మమతా కులకర్ణిని మహామండలేశ్వర్‌గా నియమించడంపై కిన్నెర అఖాడాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. చిత్ర పరిశ్రమలో ఆమె గత కెరీర్‌ను ఎత్తిచూపుతూ పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం అంతర్గత విభేదాలకు దారితీయడంతో నాయకత్వం రంగంలోకి దిగింది. ఆమెను బహిష్కరిస్తూ అఖాడా వ్యవస్థాపకుడు రిషి అజయ్ దాస్ నిర్ణయం తీసుకున్నారు. అఖాడాకు త్వరలోనే కొత్త ఆచార్య మహామండలేశ్వర్‌ను ప్రకటిస్తామని తెలిపారు.

కేజ్రీవాల్‌పై క్రిమినల్ కేసు?

» అన్ని అవకాశాలు పరిశీలిస్తోన్న ఈసీ

» మూడేళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం

న్యూఢిల్లీ, జనవరి31: యమునా నదిలో బీజేపీ విషం కలిపిందన్న ఆరోపణలపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని ఎన్నికల సంఘం ఆయనపై తగిన చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. శుక్రవారం ఆయన ఢిల్లీ, పంజాబ్ సీఎంలతో కలిసి ఈసీ కార్యాలయానికి వెళ్లారు. ఉదయం 11 గంటల్లోగా విషం కలిపిన ఆరోపణలపై సాక్ష్యాధారాలు సమర్పించకపోతే చర్యలు తీసుకుంటామని ఈసీ ఆదేశించడంతో కేజ్రీవాల్ ఎన్నికల అధికారులను కలిశారు. అయితే ఆయన వివరణపై ఈసీ సంతృప్తి చెందలేదని తెలిసింది. కేజ్రీవాల్‌పై క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. భారతీయ న్యాయసంహితలోని సెక్షన్లు 196(రెండు వర్గాల మధ్య శతృత్వం పెరిగేలా ప్రకటనలు చేసినందుకు), 197(జాతీయ సమైక్యతను దెబ్బతీసే యత్నం చేసినందుకు), 353(ప్రజలను మోసగించినందుకు), ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 123(4)(తప్పుడు ప్రకటనలు చేసినందు కు) క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశముందని సమాచారం. బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం మూడేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది.

ఆప్‌నకు ఏడుగురు ఎమ్మెల్యేలు గుడ్‌బై

మరో 4 రోజుల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా ఆప్‌లో కలకలం రేగింది. పార్టీకి ఏకంగా ఏడుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. పార్టీతో పాటు, కేజ్రీవాల్‌పై విశ్వాసం కోల్పోయామని తమ రాజీనామా లేఖల్లో రాశారు. రాజీనామా చేసిన ఎమ్మెల్యేల్లో మదన్‌లాల్, నరేశ్ యాదవ్, పవన్ శర్మ, రోహిత్, భావన, రాజేశ్ రిషి, బిజ్వాసన్ ఉన్నారు. వాస్తవానికి ఈ ఎమ్మెల్యేలందరికీ టికెట్ ఇచ్చేందుకు అధిష్ఠానం నిరాకరించింది. ఢిల్లీలో 5న 70 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగనున్నాయి.

సిక్ ఫర్ జస్టిస్ సంస్థపై మరో ఐదేళ్లు నిషేధం

న్యూఢిల్లీ, జనవరి 31: భారతదేశ విచ్ఛిన్నం కోసం ముస్లింలు, క్రైస్తవులు, తమిళులను ఖలిస్థానీ ఉగ్రవాద సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' (ఎస్ఎఫ్‌జే) రెచ్చగొడుతోందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఎస్ఎఫ్‌జేపై ఇప్పటికే ఉన్న నిషేధాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగిస్తూ కేంద్రం ఓ గెజిట్‌ను విడుదల చేసింది. దీంట్లో ఆ సంస్థ కార్యకలాపాలను వివరించింది. 'మణిపూర్‌లో క్రైస్తవులను ప్రత్యేక దేశం కోసం, తమిళనాడు ప్రజల్ని ద్రవిడిస్థాన్ కోసం, ముస్లింలను ఉర్దిస్థాన్ కోసం ఎస్ఎఫ్‌జే రెచ్చగొడుతోంది. ఈ కుట్రలో తమతో కలిసి రావాలంటూ దళితులకూ పిలుపునిస్తోంది. మద్దతు ధరలపై పంజాబ్, హరియాణా రైతులనూ ఈ సంస్థే రెచ్చగొడుతోంది' అని పేర్కొంది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌లకు ఎస్ఎఫ్‌జే నుంచి ముప్పు పొంచి ఉందని తెలిపింది. కాగా, మణిపూర్‌లో కుకీ తదితర గిరిజన జాతుల హక్కుల కోసం పోరాడుతున్న 'నార్త్ అమెరికన్ మణిపూర్ ట్రైబల్ అసోసియేషన్' వర్గాలు ఈ గెజిట్‌ను తీవ్రంగా ఖండించాయి.

ఉత్పాదక, పెట్టుబడుల కేంద్రంగా ఆంధ్ర

- అత్యాధునిక పారిశ్రామిక నగరం దిశగా కృష్ణపట్నంలో పనులు ప్రారంభం
- రాష్ట్ర సొంత రెవెన్యూ రాబడిలో అత్యధిక వాటా జీఎస్టీదే.. కేంద్ర ఆర్థిక సర్వే వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమంతో ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక పారిశ్రామిక నగరం ఏర్పడుతుందని, అది ప్రధాన ఉత్పాదక పెట్టుబడుల కేంద్రంగా మారుతుందని కేంద్ర ఆర్థిక సర్వే తెలిపింది. గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో 4 పారిశ్రామిక నగరాలు ఏర్పడ్డాయని, రాష్ట్రంలోని కృష్ణపట్నంలో ఆ దిశగా ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించింది. సొంత పన్ను వసూళ్లు, రెవెన్యూ వసూళ్లు 50 శాతం పైగా అధికంగా ఉన్న 15 రాష్ట్రాల్లో ఏపీ ఒకటని.. అయితే సొంత రెవెన్యూ రాబడిలో అత్యధిక వాటా జీఎస్టీయేదేనని పేర్కొంది. దేశంలో స్థిరాభివృద్ధి లక్ష్యాలను స్థానికం చేయడం వల్ల అంతర్జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధి చేయవచ్చని అభిప్రాయపడింది. ఆంధ్ర సహా పది రాష్ట్రాల్లో నెలకొల్పిన 'సమీకృత అభివృద్ధి లక్ష్యాల సమన్వయ కేంద్రాలు (ఎస్‌డీజీసీసీలు)' ఈ దిశగా పనిచేస్తున్నాయని తెలిపింది. రాష్ట్రానికి సంబంధించి ఆర్థిక సర్వే ప్రస్తావించిన మరిన్ని కీలక అంశాలివీ..

- ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, హరియాణా రాష్ట్రాల్లో మహిళల అవకాశాలపై ప్రతిబంధకాలు తొలగించారు. ఐటీ ఉద్యోగాల్లో మహిళలు రాత్రివేళ పనిచేయడంపై ఏపీలో నిషేధాలు సడలించారు.
- చైనా తర్వాత అత్యధికంగా సిమెంట్ ఉత్పత్తి చేస్తున్న దేశం ఇండియా. ఇందులో ఏపీ, తెలంగాణ సహా 13 రాష్ట్రాల్లో 87 శాతం ఆ పరిశ్రమ కేంద్రీకృతమై ఉంది.
- పత్తి ఉత్పత్తి ఆంధ్ర, గుజరాత్, మధ్యప్రదేశ్‌లో విస్తరించింది. అయితే వస్త్ర పరిశ్రమతో దానిని అనుసంధానించలేదు. చైనాలో మాదిరిగా ఫైబర్ టు ఫ్యాషన్‌లా అనుసంధానం చేసి నాణ్యతను కొనసాగిస్తూ.. తక్కువ ఖర్చుతో కూడిన ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు వీలు కల్పించాలి.
- వైద్య విద్య రంగంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 4 దక్షిణాది రాష్ట్రాల్లోనే అధిక అవకాశాలు లభ్యమవుతున్నాయి. 51%అండర్ గ్రాడ్యుయేట్ (ఎంబీబీఎస్) సీట్లు, 49 శాతం పీజీ సీట్లు దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి.

వైసీపీకి, పార్టీ పదవులకూ రాజీనామా చేశా

- జగన్ మళ్లీ సీఎం కావాలి: విజయసాయిరెడ్డి

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవులకూ రాజీనామా చేశానని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి శుక్రవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. తన రాజీనామా లేఖలను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి పంపానని తెలిపారు. 2029లో జగన్ భారీ మెజారిటీతో మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నానన్నారు. వ్యవసాయ ప్రపంచంలో మరో ప్రస్థానాన్ని ప్రారంభించానని ట్వీట్ చేశారు.



పోలవరం ప్రాజెక్టుకి 12 వేల కోట్లు

- రాష్ట్రపతి ప్రసంగంలో ప్రత్యేక ప్రస్తావన

న్యూఢిల్లీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి చంద్రబాబు ప్రభుత్వమే గాక.. కేంద్రంలోని మోదీ సర్కారు కూడా అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న విషయం మరోసారి వెల్లడైంది. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అదనంగా రూ. 12వేల కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. శుక్రవారం పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆమె ప్రత్యేకంగా పోలవరం గురించి ప్రస్తావించారు. అలాగే కాశీ-తెలుగు సంగమం, కాశీ-తమిళ సంగమం, సౌరాష్ట్ర-తమిళ సంగమం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో కేంద్రం దేశ సమైక్యతను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో మనకెంత?



- ఏ శాఖకు ఎన్ని నిధులొస్తాయి?
- నేటి మధ్యాహ్నంకల్లా వివరాలివ్వాలి
- ప్రభుత్వ విభాగాలకు రాష్ట్ర ఆర్థిక శాఖ నిర్దేశం



అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేంద్రం శనివారం ప్రవేశపెట్టే 2025-26 బడ్జెట్‌లో.. మన రాష్ట్రానికి ఏ మేరకు ప్రయోజనాలు లభిస్తాయో వివరాలు తెలియజేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ వివిధ ప్రభుత్వ శాఖలను ఆదేశించింది. సదరు బడ్జెట్‌లో ఏ శాఖకు ఎన్ని నిధుల వచ్చే అవకాశం ఉందో శనివారం మధ్యాహ్నం 3 గంటలకల్లా తమకు సమాచారమివ్వాలని ఉత్తర్వులిచ్చింది. సంబంధిత వివరాలను సీఎం చంద్రబాబుకు అందజేయాలని స్పష్టం చేసింది. బడ్జెట్లో రాష్ట్రానికి ప్రాధాన్యం లభిస్తుందని రాష్ట్రప్రభుత్వం ఆశిస్తోంది. నదుల అనుసంధానం, టెక్స్‌టైల్స్ పార్కుల ఏర్పాటుకు తోడ్పాటు లభిస్తుందని అంచనా వేస్తోంది. డిసెంబరు 20వ తేదీన ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో బడ్జెట్ సన్నాహక సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్రానికి కొన్ని సాయాలను అభ్యర్థించారు. 'రాజస్థాన్‌లో నదుల అనుసంధానించడానికి సాయం ప్రకటించినట్లే ఆంధ్రలోనూ నదుల అనుసంధానానికి సాయం చేయండి. 2024-25 బడ్జెట్‌లో బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడానికి కేంద్రం పూర్వోదయ ప్రాజెక్టును ప్రకటించింది. కోస్తాంధ్ర తుఫాన్లతో, రాయలసీమ ప్రాంతం కరువుతో అల్లాడుతుంటాయి. రాష్ట్రవిభజన వల్ల కూడా మాకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో పూర్వోదయ ప్రాజెక్టులో ఉన్న ఏపీకి కేంద్ర ప్రాయోజిత పథకాలన్నింటిలో 90 శాతం నిధులు కేంద్రమే ఇవ్వాలి. రోడ్లు, రేవులు, విమానాశ్రయాల నిర్మాణానికి సాయం చేయాలి. పీపీపీ ప్రాజెక్టులన్నింటికీ వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) భరించాలి. విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్రమే వీజీఎఫ్ భరించాలి. కరువుతో ఎడారిలా మారిపోతున్న జిల్లాలకు జల్‌జీవన్ మిషన్, ఇతర ఇరిగేషన్ పథకాల ద్వారా కేంద్రం 90 శాతం, రాష్ట్ర 10 శాతం నిష్పత్తిలో నిధులు అందించాలి. ఏఐ, ఏవియేషన్ యూనివర్సిటీ, పునరుత్పాదక శక్తి వనరులపై పరిశోధనలు చేసే విశ్వవిద్యాలయాలకు ఒక్కొక్క ప్రాజెక్టుకు రూ.100 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలి. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు గ్రాంట్ మంజూరు చేయాలి. చేనేత సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నందున రాష్ట్రానికి 5 టెక్స్‌టైల్ పార్కులను మంజూరు చేయాలి' అని కోరారు.

మార్గదర్శి మా పరిధిలో లేదు

- క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగింపుపై మీదే తుది నిర్ణయం
- తెలంగాణ హైకోర్టుకు తెలిపిన ఏపీ ప్రభుత్వం
- ప్రొసీడింగ్స్ కొనసాగించవచ్చు
- వైఖరి చెప్పిన తెలంగాణ సర్కారు
- విచారణ నుంచి తప్పుకొన్న జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'మార్గదర్శి' కేసుపై శుక్రవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ఈ కేసుపై తమ అభిప్రాయాలను వెల్లడించాయి. ఏపీ ప్రభుత్వం తన వైఖరి తెలుపుతూ డిపాజిటర్లకు ఇంకా మార్గదర్శి చెల్లించాల్సిన మొత్తం రూ.5.15 కోట్లు ఎస్క్రో ఖాతాలో ఉన్నాయంది. వాటిని ఇంకా 1,270 మంది డిపాజిటర్లకు చెల్లించాల్సి ఉందని పేర్కొంది. అందువల్ల ఆ మొత్తాన్ని ఆర్బీఐకి గానీ, రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని నివేదించింది. హైకోర్టు ఆదేశాల మేరకు పత్రికల్లో బహిరంగ నోటీసు ఇచ్చినప్పటికీ తమకు డబ్బు రావాల్సి ఉందని ఏ డిపాజిటరు ముందుకు రాలేదని గుర్తు చేసింది. ఎస్క్రో ఖాతాలో 2010 నాటికి రూ.11.69 కోట్లు ఉండగా గత 14 ఏళ్లలో వాటిని డిపాజిటర్లకు చెల్లిస్తూ వచ్చారని తెలిపింది. ప్రస్తుతం రూ.5.15 కోట్లు మాత్రమే ఉన్నట్లు పేర్కొంది. ఈ మొత్తాన్ని ఆర్బీఐకి లేదా ప్రభుత్వానికి బదిలీ చేస్తే నిబంధనల ప్రకారం సొమ్ము రావాల్సిన డిపాజిటర్ల వివరాలు నిర్ధారించుకుని చెల్లించవచ్చని తెలిపింది. 2014లో ఉమ్మడి ఏపీ విభజనకు గురైందని, భౌగోళికంగా పరిశీలిస్తే కేసు నమోదైన దిగువ కోర్టు హైదరాబాద్‌లో ఉన్నందున ఈ కేసుతో ఏపీకి సంబంధం ఉండదని తెలిపింది. ఏపీ ప్రభుత్వం సరైన ప్రాసిక్యూటర్ కాదని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ కొనసాగించాలా? వద్దా? అని హైకోర్టే నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఎలాంటి ఆదేశాలు జారీచేసినా కట్టుబడి ఉంటామని పేర్కొంది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శికి వ్యతిరేకంగా వైఖరి తీసుకుంది. మార్గదర్శి దాఖలు చేసిన పిటిషన్‌ను మేజిస్ట్రేటు కోర్టు కొట్టేసిందని, ఆ కోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ వ్యవహారంపై ప్రాసిక్యూషన్ కొనసాగించాలని పేర్కొంది. మార్గదర్శి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లు జస్టిస్ శ్యాం కోషీ, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావుల ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. గతంలో ఆ సంస్థ తరఫున న్యాయవాదిగా హాజరైనందున విచారణ నుంచి తాను తప్పుకొంటున్నానని జస్టిస్ నర్సింగ్‌రావు తెలిపారు. దీంతో ఈ కేసులు వచ్చేవారం తాత్కాలిక సీజే జస్టిస్ సుజోయ్‌పాల్ నేతృత్వం వహించే ధర్మాసనం ఎదుట లిస్ట్ చేయాలని ధర్మాసనం పేర్కొంది.

రమ్య హత్య కేసులో దోషికి జైలే!

- మరణశిక్షను సవరించిన హైకోర్టు
- 2021లో ప్రేమ పేరిట బీటెక్ విద్యార్థిని రమ్యను హత్య చేసిన మెకానిక్ శశికృష్ణ
- 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించిన కోర్టు



అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బీటెక్ విద్యార్థిని నల్లపు రమ్య హత్య కేసులో దోషి కుంచాల శశికృష్ణకు ట్రయల్ కోర్టు విధించిన ఉరిశిక్షను హైకోర్టు సవరించింది. ఉరిశిక్ష స్థానంలో అతనికి 20 ఏళ్ల కఠిన కారాగారశిక్ష విధించింది. శశికృష్ణకు క్షమాభిక్ష ప్రసాదించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ట్రయల్ కోర్టు విధించిన ఇతర శిక్షలను ఖరారు చేసింది. హత్య కేసులో తనను నిర్దోషిగా ప్రకటించాలని కోరుతూ ట్రయల్ కోర్టు విధించిన శిక్షను సవాల్ చేస్తూ శశికృష్ణ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. సురేశ్‌రెడ్డి, జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి ధర్మాసనం శుక్రవారం తీర్పు వెల్లడించింది.

ప్రేమను తిరస్కరించడంతో..

గుంటూరు జిల్లా, వట్టిచెరుకూరుకు చెందిన బైక్ మెకానిక్ కుంచాల శశికృష్ణ.. బీటెక్ విద్యార్థి నల్లపు రమ్యను ప్రేమిస్తున్నానంటూ వెంటపడేవాడు. ఆమె తన ప్రేమను తిరస్కరించిందనే కారణంతో 2021, ఆగస్టు 15న రమ్యను పట్టపగలు రోడ్డు మీదే కత్తితో పొడిచి హత్య చేశాడు. కేసును విచారించిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 2022, ఏప్రిల్ 29న శశికృష్ణకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఉరిశిక్ష ఖరారు విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాలని అభ్యర్థిస్తూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 2022, మే 5న హైకోర్టుకు లేఖ రాసింది. మరోవైపు తీర్పును సవాల్ చేస్తూ శశికృష్ణ హైకోర్టులో అప్పీల్ చేశాడు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు విధించిన మరణశిక్షను ఖరారు చేసే నిమిత్తం హైకోర్టు మరో పిటిషన్‌ను నమోదు చేసింది. ఈ రెండు పిటిషన్లపై ధర్మాసనం ఇటీవల తుది విచారణ జరిపింది. శశికృష్ణ తరఫున న్యాయవాది చల్లా అజయ్‌కుమార్ వాదనలు వినిపించారు. వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం శుక్రవారం నిర్ణయం వెల్లడించింది.

తీర్పు ఇదీ..

"శశికృష్ణకు అంతకుముందు ఎలాంటి నేరనేపథ్యం లేదు. శిక్షించడం కంటే సంస్కరించడానికే ప్రాధాన్యం ఇవ్వాలని ఇండియన్ క్రిమినల్ జస్టిస్ చెబుతోంది. సామాజిక, ఆర్థిక, వ్యక్తిగత సవాళ్లను ఎదుర్కొనేలా కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా నిందితుల్లో మార్పు తీసుకురావడం సాధ్యమవుతుంది. శశికృష్ణలో మార్పు వచ్చి సమాజంలో భాగం అయ్యేందుకు అవకాశం ఉంది. శశికృష్ణకు మరణశిక్ష విధింపు కఠినమైనదిగా కోర్టు భావిస్తోంది. పిటిషనర్ తల్లిదండ్రులు నిరక్షరాస్యులు, వయసు పైబడటంతో తండ్రి ఎలాంటి పనులకు వెళ్లడం లేదు. జీవనాధారం కోసం తల్లి పాలు అమ్మి రోజుకు రూ.250 సంపాదిస్తోంది. సోదరుడు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని శశికృష్ణకు విధించిన మరణశిక్షను సవరించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తున్నాం" అని ధర్మాసనం తీర్పులో పేర్కొంది.



శ్రీశైల మల్లన్న సన్నిధిలో గోల్డ్‌మ్యాన్

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన గోల్డ్ మ్యాన్ కొండా విజయ్ దర్శించుకున్నారు. ఈయన సుమారు ఐదు కేజీల బరువు గల బంగారు ఆభరణాలు ధరించి మల్లన్న దర్శనానికి వచ్చారు. పెద్ద గొలుసులు, కంఠాభరణాలు, చేతికి కడియాలు, వేళ్లకు ఉంగరాలు ధరించిన ఆయనను స్థానికులు ఆసక్తిగా చూశారు.

- శ్రీశైలం/ఆత్మకూరు,ఆంధ్రజ్యోతి

సంజయ్ సస్పెన్షన్ మే31 వరకు పొడిగింపు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ అదనపు డీజీ సంజయ్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయన నిర్వహించిన శాఖల్లో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన అంశం వెలుగులోకి వచ్చాక కూటమి ప్రభుత్వం గతేడాది డిసెంబరు 3న ఆయనను సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారంపై ప్రభుత్వం నియమించిన కమిటీ జనవరి 29న సస్పెన్షన్‌పై సమీక్ష నిర్వహించింది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన ఆరోపణలు ఉండడంతో ఆయన సస్పెన్షన్‌ను మే 31 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. కమిటీ సూచనల మేరకు సంజయ్ సస్పెన్షన్‌ను కొనసాగిస్తున్నట్లు దీనిపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ప్రభుత్వం సూచించింది.

వాసుదేవరెడ్డి డిప్యుటేషన్ పొడిగింపు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు నిర్వహించిన ఐఆర్‌టీఎస్ అధికారి డి.వాసుదేవరెడ్డి డిప్యుటేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. రైల్వే శాఖ నుంచి డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చిన ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో కీలక శాఖల్లో పనిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయనను కార్పొరేషన్ ఎండీ పోస్టు నుంచి తొలగించింది. ఆయనపై కేసు నమోదు కావడంతో పోస్టింగ్ ఇవ్వలేదు. గతేడాది ఆగస్టు 25కి ఆయన డిప్యుటేషన్ గడువు ముగిసింది. ఆయనపై కేసులు నమోదు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేయకుండా డిప్యుటేషన్ గడువును మరో ఆరు నెలలు పొడిగించింది. ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ ఏపీలోనే కొనసాగనున్నారు.

రెడ్ క్రాస్ ఏపీ చైర్మన్‌గా వైడీ రామారావు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ వైడీ రామారావు ఎంపికయ్యారు. ఈ మేరకు రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్లు నిర్ణయం తీసుకున్నారు. మొన్నటి వరకూ చైర్మన్‌గా ఉన్న శ్రీధర్ రెడ్డిని, ట్రెజరర్ సీహెచ్ వెంకటేశ్వరరావును మేనేజింగ్ కమిటీ తప్పించింది. రామారావు గతంలో కాకినాడ జిల్లా చైర్మన్‌గా విధులు నిర్వహించారు. జనవరి 29న నిర్వహించిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఆయనను చైర్మన్‌గా ఎంపిక చేస్తూ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు.

గిరిజన పథకం డీఏ-జేజీయూఏ అమలుకు కమిటీలు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకం దార్తి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డీఏ-జేజీయూఏ) అమలు కోసం గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. గిరిజనుల సాంఘిక, ఆర్థికాభివృద్ధిని పెంపొందించడం కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర స్థాయి కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మండలస్థాయిలో సంక్షేమ అధికారి, ఎంఈవో తదితర సిబ్బందితో ఈ కమిటీలను కలెక్టర్ నియమిస్తారు.

అమృత్ 1.0లో పలు ఒప్పందాలు రద్దు

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో అమృత్ పథకంలో భాగంగా గతంలో పలు సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాజమండ్రి మురుగునీటి డ్రైన్, అనంతపురం, ధర్మవరం, శ్రీకాకుళం, కాకినాడ, అనంతపురం పారిశుధ్య నిర్వహణ పనులకు సంబంధించి ఆయా కాంట్రాక్టు సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసింది. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని పబ్లిక్‌హెల్త్ ఈఎన్‌సీని ఉత్తర్వుల్లో ఆదేశించింది.

ఏపీటీసీ ఎండీగా దినేశ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఏపీ టవర్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఫైబర్‌నెట్ ఎండీ దినేశ్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మౌలిక సదుపాయాల కల్పనా శాఖ కార్యదర్శి యువరాజ్ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు.

వేసవి రాకకు ముందే పెరిగిన విద్యుత్తు డిమాండ్

- రాత్రి పూట 5 నుంచి 10 శాతం దాకా ఆదుకోవాలని కేంద్రానికి రాష్ట్రం వినతి
- రాయలసీమకు గ్రీన్‌కారిడార్ కావాలి
- ఆముదాలవలసలో 3,200 మెగావాట్ల థర్మల్ ప్లాంటును ఆమోదించండి
- పీఎం కుసుమ్ కింద మరో 3 లక్షల కనెక్షన్లు మంజూరు చేయండి: గొట్టిపాటి
- కేంద్ర మంత్రితో వీడియో కాన్ఫరెన్స్



అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇంకా వేసవి కాలం రాకముందే రాష్ట్రంలో రాత్రి వేళ విద్యుత్తుకు డిమాండ్ పెరుగుతోంది. పగటిపూట విద్యుత్తు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఎదురు కావడం లేదని, రాత్రివేళ సరిపడా అందుబాటులో లేదని, ఆదుకోవాలని కేంద్రానికి రాష్ట్రం విన్నవించింది. కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. 'పునరుత్పాదక విద్యుదుత్పత్తితో పగటిపూట సరఫరాను నిరంతరాయంగా చేస్తున్నాం. కానీ రాత్రి పూట విద్యుత్తు డిమాండ్ ఐదు నుంచి పది శాతం దాకా పెరుగుతోంది. పెరిగిన డిమాండ్‌కు తగ్గట్టుగా సంప్రదాయ విద్యుదుత్పత్తి కేంద్రాల్లో థర్మల్, జల విద్యుత్తు ఉత్పత్తి కావడం లేదు. దీంతో రాత్రి పూట అధిక ధరకు విద్యుత్తును కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ భారం డిస్కమ్‌లపై పడుతోంది. రాత్రి సమయంలో విద్యుత్తు డిమాండ్‌ను తట్టుకోవాలంటే సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తికి సమాంతరంగా సంప్రదాయ విద్యుదుత్పత్తిని కూడా పెంచాల్సి ఉంది. ఆముదాలవలసలో స్థాపించదలచిన 3200 మెగావాట్ల థర్మల్ విద్యుత్కేంద్రం ప్రతిపాదనలను ఆమోదించండి' అని రవికుమార్ కోరారు.

రాష్ట్ర ప్రతిపాదనలు ఇవీ..


- రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీని సరఫరా చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా కారిడార్‌ను ఏర్పాటు చేయాలి.
- సౌర, పవన విద్యుత్తు స్టోరేజీని 2000 మెగావాట్లకు పెంచాలి. పీఎం కుసుమ్ కింద మరో 3 లక్షల మంది రైతులకు లబ్ధికూర్చేలా కనెక్షన్లకు ఆమోదం తెలపాలి.

రాష్ట్రాల పర్యటనకు కేంద్ర మంత్రి

రాష్ట్రాల విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్)లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిపోవడంపై కేంద్రం తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాష్ట్రాల విద్యుత్తు శాఖా మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పునరుత్పాదక విద్యుత్కేంద్రాలకు సహాయం అందిస్తున్నందున కరెంటు సరఫరాలో రాష్ట్రాలు స్థిమితంగా ఉన్నాయని భావిస్తున్న కేంద్రానికి.. డిస్కమ్‌ల స్థితిగతులు చూశాక పరిస్థితి అర్థమైంది. దీంతో వీడియో కాన్ఫరెన్స్‌ల సమీక్షలతో సరిపెట్టకుండా తరచూ రాష్ట్రాల పర్యటనకు వెళ్లి విద్యుత్తు రంగ స్థితిగతులపై స్వయంగా పరిశీలన చేయాలని కేంద్ర మంత్రి నిర్ణయించారు.

ప్రభావతి విచారణకు హాజరు కావాలి

- సుప్రీంకోర్టు ఆదేశం
- రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో హైకోర్టు తీర్పుపై స్టే ఇచ్చిన ధర్మాసనం



న్యూఢిల్లీ, ఒంగోలు క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి విచారణకు హాజరు కావాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీగా ఉన్న తనను సీఐడీ కస్టడీలో తీవ్రంగా వేధించారంటూ గుంటూరులోని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో రఘురామ ఫిర్యాదు చేశారు. ఆ కేసులో అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి ఏ5గా ఉన్నారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం తిరస్కరించింది. ఈ నేపథ్యంలో జనవరి 22న హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మాధవి, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్ వాదనలు వినిపించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకూ హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది. నాలుగు వారాల పాటు ప్రభావతిని అరెస్టు చేయవద్దంది. ఆమె పోలీసులకు సహకరించాలని సూచించింది. కాగా, తన వాదనలు కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరుతూ రఘురామ కెవియట్ దాఖలు చేశారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని, ఆ తర్వాత రెండు వారాల్లో రీజాయిండర్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. నాలుగు వారాల తర్వాత విచారణ చేపడతామని పేర్కొంది. కాగా.. రఘురామ టార్చర్ కేసులో ఆరో నిందితుడు తులసిబాబు బెయిల్ పిటిషన్ శుక్రవారం హైకోర్టులో విచారణకు రాగా న్యాయమూర్తి సెలవులో వెళ్లినందున వాయిదా పడింది.

హౌసింగ్ గోడౌన్లకు ఇన్‌చార్జిలుగా రెగ్యులర్ ఉద్యోగులే!

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు
- అక్రమాల నేపథ్యంలో కార్పొరేషన్ ఎండీ ఉత్తర్వులు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్రవ్యాప్తంగా హౌసింగ్ గోడౌన్లలో నిల్వ చేసిన కోట్లాది రూపాయల విలువైన సిమెంట్, స్టీలు, ఇసుక, ఇతర సామగ్రి మాయమైన నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మండలాల్లోని గోడౌన్లకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఇకపై అన్ని గోడౌన్లకు రెగ్యులర్ హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లనే ఇన్‌చార్జిలుగా నియమించాలని ఆదేశించింది. వారు లేని చోట్ల గ్రామ, వార్డు సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించాలని నిర్దేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల హౌసింగ్ హెడ్‌లకు ఆదేశిస్తూ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ పి.రాజబాబు ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఇక నుంచి అన్ని గోడౌన్లలో నిల్వల పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ బాధ్యతలను రెగ్యులర్ ఉద్యోగులే నిర్వర్తించనున్నారు. ఫిబ్రవరి 1 తర్వాత కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఇన్‌చార్జిలుగా ఉన్నట్లయితే.. డీహెచ్‌హెచ్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

తిరుపతిలో నకిలీ మద్యం!

- 30 లక్షల ముడి పదార్థాలు, యంత్రాలు సీజ్
- 6 లక్షల నగదు, 283 గ్రాముల బంగారం స్వాధీనం
- ఇద్దరు అరెస్టు.. రైల్వేకోడూరులో తీగలాగితే కదిలిన డొంక



నకిలీ లేబుళ్లతో ఉన్న మద్యం సీసాలు

తిరుపతి (నేరవిభాగం), జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో గుట్టుగా నకిలీ మద్యం తయారు చేస్తూ.. వాటిని బెల్ట్ షాపులకు తరలిస్తున్న ముఠా గుట్టును తిరుపతి, కడప జిల్లాల ఎక్సైజ్ అధికారులు రట్టు చేశారు. ఇద్దరిని అరెస్టు చేశారు. భారీగా ముడిపదార్థాలు, యంత్రాలను సీజ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ శుక్రవారం ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో 4రోజుల క్రితం భారీగా నకిలీ మద్యం పట్టుబడింది. ఈ ఘటనలో నిందితులైన అయ్యప్ప, వెంకటనారాయణను విచారించగా.. తిరుపతి నుంచి నకిలీ మద్యం తీసుకెళ్లి, బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. వారిచ్చిన సమాచారంతో దామినేడు ఇందిరమ్మ గృహాల్లోని బి బ్లాక్ 61వ నంబరు ఇంటి వద్ద 23 క్యాన్ల స్పిరిట్, నకిలీ లేబుళ్లు, 6,955 ఖాళీ బాటిళ్లు, నకిలీ మద్యం తయారు చేయడానికి వాడే సాచింగ్ మిషన్ సీజ్ చేశారు. మరోవైపు తిరుపతిలో ఉంటున్న కడప జిల్లా పింఛాకు చెందిన అన్నదమ్ములు చికెన్ శీను, మహేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు ఈ నకిలీ మద్యం తయారీ వెనుక ఉన్న కింగ్‌పిన్ వెంకటరమణ ఇంటిని చూపించారు. ఆ ఇంట్లో అధికారులు దాదాపు రూ.6 లక్షల నగదు, 283.95 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.



కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామితో ఏపీ కూటమి ఎంపీలు

ఉక్కుమంత్రికి కూటమి ఎంపీల కృతజ్ఞతలు

న్యూఢిల్లీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కేంద్రం రూ.11,440 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం, స్టీల్ ప్లాంట్‌ను ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామి సందర్శించిన నేపథ్యంలో ఆయనకు కూటమి ఎంపీలు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం, పార్లమెంటు హౌస్‌లో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస వర్మను కూటమి ఎంపీల బృందం మర్యాదపూర్వకంగా కలిసి వారికి రాష్ట్ర ప్రజల తరఫున, రాష్ట్రప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు బీదా మస్తాన్‌రావు, కలిశెట్టి అప్పలనాయుడు, కృష్ణప్రసాద్, కేశినేని చిన్ని, జనసేన ఎంపీలు బాలశౌరి, తంగెళ్ల ఉదయకృష్ణ తదితరులు హెచ్‌డీ కుమారస్వామిని కలిశారు. ఏపీలో ప్రతి జిల్లానూ అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి మంచి కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నామని తెలిపారు.

భెల్ అనుబంధ పరిశ్రమలపై సానుకూలం: ఓవీ రమణ

తిరుపతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో భెల్ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుపై పరిశీలన జరుపుతామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హామీ ఇచ్చారని టీటీడీ పాలకమండలి మాజీసభ్యుడు ఓవీ రమణ వెల్లడించారు. మన్నవరంలో ఎన్టీపీసీ-భెల్ సంయుక్త పరిశ్రమకు గతంలో కేటాయించిన 590 ఎకరాలను ప్రభుత్వం వెనక్కు తీసుకునేందుకు యత్నిస్తోందంటూ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ విషయమై కుమారస్వామికి ఫోన్ చేసి సమాచారమిచ్చానని రమణ చెప్పారు.

గెస్ట్ హౌస్ కోసమా.. ఎర్రచందనం కోసమా?

» పెద్దిరెడ్డిపై అనగాని ఫైర్

తిరుపతి, కల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మంగళంపేట అటవీ భూములను మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం దేనికోసం వినియోగిస్తుందో అర్థం కావడం లేదని.. గెస్ట్ హౌస్ కోసమా.. లేక ఎర్రచందనం అక్రమ రవాణా కోసమా.. అన్నదానిపై అనుమానాలున్నాయని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం రాత్రి తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. పెద్దిరెడ్డి మంత్రిగా ఉన్నపుడు చిత్తూరుతో పాటు ఇతర జిల్లాల్లోనూ భూములు కబ్జా చేశారని ఆరోపించారు. మంగళంపేట అటవీ భూముల ఆక్రమణలపై 2వారాలలో విచారణ పూర్తయి నివేదిక వస్తుందన్నారు. అధికారులతో పాటు పెద్దిరెడ్డి కుటుంబంపైనా చర్యలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు.

పెద్దిరెడ్డి పొలం ప్రధాన మార్గం సర్వే

మాజీమంత్రి పెద్దిరెడ్డి, ఆయన కుటుంబం భూములు ఆక్రమణ ఆరోపణలపై విచారించి నివేదిక ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో అధికారులు శుక్రవారం పెద్దిరెడ్డి పొలానికి వెళ్లే రోడ్డును సర్వే చేశారు. జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి ఆధ్వర్యంలో రోవర్, జీపీఎస్, టేపు ద్వారా రోడ్డును కొలిచారు. 4మీటర్ల వెడల్పుతో 2.2 కి.మీ. రోడ్డు అటవీ శాఖ పరిధిలో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.

'స్వర్ణాంధ్ర' సాధనలో

భాగస్వాములు కండి!

వైశ్యులకు చంద్రబాబు పిలుపు

» కార్పొరేషన్ ద్వారా వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు
» త్యాగం, శక్తికి ప్రతీక వాసవీ మాత: సీఎం
» పెనుగొండలోని వాసవీ ధామ్ సందర్శన
» అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ
» కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు
» కల్లుగీత కార్మికులతో మాట్లాడిన చంద్రబాబు
» రాజకీయంగా, ఆర్థికంగా పైకి తీసుకొస్తామని హామీ

పెనుగొండ/ఆచంట/భీమవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కోసం రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్-2047లో ఆర్యవైశ్యులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఆర్యవైశ్యులను వృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటైందన్నారు. దాని ద్వారా వారి వ్యాపారాభివృద్ధికి సహకరిస్తామని భరోసా ఇచ్చారు. వాసవీ మాత ఆత్మార్పణదినం సందర్భంగా శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో నగరేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. వేద పండితులు శాస్త్రోక్తంగా ముఖ్యమంత్రితో అమ్మవారికి పూజలు చేయించి ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆయన సమీపంలోని వాసవీధామ్‌ను సందర్శించారు. ఈ ఆలయాన్ని దర్శించడం తన పూర్వజన్మ సుకృతం అన్నారు. దేశవ్యాప్తంగా అమ్మవారికి ఆర్యవైశ్యులు ఆలయాలు నిర్మించారని, ఇక్కడి వాసవీ మాత ఆలయానికి భవిష్యత్తులో మరింత పేరు ప్రఖ్యాతలు లభిస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు. 90 అడుగుల పంచలోహ వాసవీ మాత విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా వాసవీ ధామ్ ట్రస్ట్ సభ్యులు చంద్రబాబును సత్కరించారు. తర్వాత సీఎం భక్తులనుద్దేశించి మాట్లాడారు. "మహిళల ఆత్మగౌరవాన్ని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు చాటారు. శాంతి కోసం వాసవీ మాత ఆత్మ బలిదానం చేశారు. ఆర్యవైశ్యుల ఇలవేల్పు, అహింసకు, ఆత్మ త్యాగానికి, ధర్మనిరతికి, శాంతికి ప్రతి రూపం వాసవీ కన్యకా పరమేశ్వరి. అమ్మను వేడుకుంటే శాంతి, సంపద, రక్షణ. ఆశీస్సులు మెండుగా లభిస్తాయని అందరికీ నమ్మకం. దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులు కొలిచే దేవత వాసవీ కన్యకా పరమేశ్వరి. త్యాగానికి, శక్తికి, సంకల్పానికి ప్రతీకైన అమ్మవారికి ప్రభుత్వం తరఫున తొలిసారిగా పట్టువస్త్రాలను సమర్పించడం పూర్వ జన్మ సుకృతం" అని చంద్రబాబు పేర్కొన్నారు. వాసవీ మాత ఆలయం, వాసవీధామ్‌లో చంద్రబాబు సుమారు రెండు గంటలు గడిపారు.



పెనుగొండలోని వాసవీధామ్‌లోని వాసవీమాత పంచలోహ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు నాయుడు. చిత్రంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు రామరాజు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, వాసవి శాంతి ధామ్ అధ్యక్షుడు పీఎన్ గోవిందరాజు, కార్యదర్శి కోట్ల రాజా



వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీఎం

నేడు అన్నమయ్య జిల్లాకు సీఎం

సంబేపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం అన్నమయ్య జిల్లా సంబేపల్లెలో పర్యటించనున్నారు. గన్నవరం నుంచి విమానంలో బయలుదేరి కడప విమానాశ్రయానికి మధ్యాహ్నం 12.05 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.20 గంటలకు సంబేపల్లెకి వస్తారు. ఒంటిగంటకు సంబేపల్లెలో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొంటారు. 1.50 గంటలకు పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడి పింఛన్ అందజేస్తారు. అనంతరం తిరుగు ప్రయాణం అవుతారు.

బీసీలకు అన్ని విధాల అండగా ఉంటాం

బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దానికి కొనసాగింపుగానే తెలుగుదేశం పార్టీ చట్ట సభల్లో ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా బీసీలకు అవకాశాలు కల్పించిదన్నారు. పెనుగొండ హెలిప్యాడ్ వద్ద శెట్టిబలిజ, గౌడ, యాదవ, శ్రీశయన తదితర గీత కార్మిక సంఘాల సభ్యులతో చంద్రబాబు మాట్లాడారు. "బీసీలంటే తెలుగుదేశం.. తెలుగుదేశం అంటే బీసీలు. వారిని రాజకీయంగా, ఆర్థికంగా పైకి తీసుకొచ్చింది టీడీపీ. వారికి ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా కూడా రిజర్వేషన్‌లు కల్పించాలని పోరాడుతున్నది టీడీపీయే. గడిచిన ఎన్నికల్లో 141 బీసీ కులాలు ఏకమై టీడీపీకి అండగా నిలబడ్డాయి. అన్ని స్థాయిల్లోనూ బీసీలకు టీడీపీ న్యాయం చేసింది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 10 శాతం మద్యం షాపులను కల్లుగీత కార్మికులకు కేటాయించాం. అందులో 50 శాతం డిపాజిట్‌తోనే షాపులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నాం. యాంత్రీకరణతో కుల వృత్తులు పోయాయి. చేతి వృత్తులకు కష్టకాలం వచ్చింది. కల్లుగీతకు కష్టం వచ్చింది. అందుకే బీసీ వర్గాల్లో కుల వృత్తులందరికీ, వెనుకబడిన వర్గాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి ఎన్డీఏ, టీడీపీ కట్టుబడి ఉన్నాయి. నేను.. పవన్ కల్యాణ్.. బీజేపీ కూడా బీసీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం. ఈ విషయాన్ని పది మందికీ చెప్పండి. పార్టీ బలంగా ఉంటేనే ప్రభుత్వం బలంగా ఉంటుంది. గత ఐదేళ్ల రాష్ట్రం అధోగతి పాలైంది. పార్టీ శ్రేణులు తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. అటువంటి చీకటి రోజులు మళ్లీ రాకూడదు. భవిష్యత్తుపై భరోసా ఇవ్వడానికి 2047 విజన్ తీసుకొచ్చాం. అప్పటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దుతాం. గీత కార్మికులను అభివృద్ధి చేస్తాం" అని చంద్రబాబు భరోసా ఇచ్చారు. పెనుగొండకు విచ్చేసిన చంద్రబాబుకు మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, పులపర్తి అంజిబాబు, బొలిశెట్టి శ్రీనివాస్, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు తదితరులు స్వాగతం పలికారు.

సమన్వయంతో పనిచేయండి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

» కూటమి నేతలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించే బాధ్యతను కూటమి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మూడు పార్టీల నాయకులు ఎన్నికలకు ముందు సమన్వయంతో పనిచేసిన విధంగానే ఇప్పుడూ పనిచేయాలని కోరారు. కూటమి నాయకులతో శుక్రవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడారు. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, 27న పోలింగ్ జరుగుతుందన్నారు. ఈలోగా ఆయా నియోజకవర్గాల్లోని ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరును కలిసి.. కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలిచేలా కృషి చేయాలన్నారు. చదువుకున్న వారంతా కూటమితోనే ఉన్నారంటూ ఎవరూ ఓవర్ కాన్ఫిడెన్స్‌లో ఉండొద్దన్నారు. ఎన్డీయే పక్షాలతో సమన్వయ సమావేశాలు పెట్టుకుని పనిచేయాలని సూచించారు. ఏ ఎన్నికలు వచ్చినా మనం గెలిచినప్పుడే సుస్థిర పాలన సాధ్యమవుతుందన్నారు. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన నేతలు మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ప్రభుత్వం ఏర్పాటైన 7 నెలల్లోనే అన్ని ఇబ్బందులను అధిగమించి సుపరిపాలన వైపు అడుగులు వేస్తున్న విషయాన్ని తెలియజేయాలని సూచించారు. "రాత్రికి రాత్రి అన్నీ జరిగిపోతాయని మనం చెప్పడం లేదు. గాడి తప్పిన వ్యవస్థలను సరిదిద్దుతున్నాం. కేంద్ర ప్రభుత్వ సాయంతో విశాఖ స్టీల్ ప్లాంట్, రాజధాని అమరావతికి ఆర్థికసాయం, పోలవరానికి నిధులు, రైల్వే జోన్‌తో పాటు ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈ విషయాలన్నీ ఓటర్లకు వివరించండి" అని చంద్రబాబు కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సుమారు రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చామని, ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 4 లక్షల మంది యువతకు ఉద్యోగాలు రానున్నాయని ఈ విషయాన్ని కూడా ప్రజలకు వివరించాలన్నారు. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

వ్యవస్థలు ధ్వంసం చేసి ధర్నాలా?: సోమిరెడ్డి

అన్ని వ్యవస్థలనూ ధ్వంసంచేసిన వైసీపీ నేడు ధర్నాలు చేయడం సిగ్గుచేటని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి శుక్రవారం విమర్శించారు. 'వైసీపీ హయాంలో తప్పులు చేసినవారిపై చర్యలు తీసుకోవడానికి అధికార వ్యవస్థలో ఇంకా నిర్లిప్తత ఎందుకో అర్థం కావడంలేదు. ఏ1, ఏ2 సహా వైసీపీ హయాంలో తప్పుచేసిన వారందరిపైనా ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. మీడియాలో సాక్ష్యాలతోసహా వైసీపీ అక్రమాలు అవినీతిని రోజూ వెలుగులోకి వస్తోంది. వైసీపీ హయాంలో విద్యావ్యవస్థ దుస్థితిపై అసర్ నివేదిక చూసి వైసీపీ నేతలు తలె క్కడ పెట్టుకుంటారు?' అని అన్నారు.

పార్టీ శ్రేణులూ ఎదగాలి!

» అందుకే ఒక పదవిలో ఒక వ్యక్తి మూడు సార్లే ఉండాలన్న ప్రతిపాదన: లోకేశ్

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఒక పదవిలో.. ఒక వ్యక్తి మూడుసార్లు కంటే ఎక్కువ ఉండకూడదనే ప్రతిపాదనను ఇటీవల పార్టీ ముందు ఉంచినట్టు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక వ్యక్తికి ఒక పదవి మూడు సార్లు కంటే ఎక్కువ ఉండకూడదన్న ఉద్దేశంతోనే తాను పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిని వద్దనుకుంటున్నట్లు తెలిపారు. పార్టీలోని వివిధ స్థాయిల్లో ఉన్న నాయకులు, పార్టీ శ్రేణుల ఎదుగుదల కోసమే ఈ ప్రతిపాదన తీసుకువచ్చామన్నారు. ఈ ప్రతిపాదనపై విస్తృత చర్చ జరిపి పార్టీనే తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ ప్రతిపాదన వల్ల గ్రామస్థాయి నాయకుడు మండలస్థాయికి, మండల స్థాయి నాయకుడు నియోజకవర్గ స్థాయికి, అక్కడ నుంచి జిల్లా స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. పార్టీ అధినేత మినహా ఈ ప్రతిపాదన అందరికీ వర్తింపచేస్తే కొత్తతరం రాజకీయాల్లోకి వస్తుందన్నారు.

పార్టీ ఆఫీస్ వద్ద హడావుడి వద్దు

"పార్టీ కార్యాలయం వద్ద ఇంత మంది పోలీసులు ఎందుకు? కార్యాలయానికి వచ్చే కార్యకర్తలను ఇబ్బందికి గురిచేయద్దు. ఇక్కడ మీ హడావుడి ఎందుకు?" అని టీడీపీ కేంద్ర కార్యాలయం వద్ద భారీగా మోహరించిన పోలీసులనుద్దేశించి మంత్రి లోకేశ్ అన్నారు. ఇక్కడ శుక్రవారం పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. ఈ క్రమంలో పోలీసులు భారీ భద్రత కల్పించారు. లోకేశ్ జోక్యం చేసుకుని కార్యకర్తలను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు.

ఏ మొహం పెట్టుకుని పోరుబాట చేస్తారు: డోలా

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లూ ఆర్భాటం తప్ప, విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోని వైసీపీ నేతలు ఏ మొహం పెట్టుకుని ఈనెల 5న ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యుత్ బిల్లులపై పోరుబాట చేస్తారని సాంఘిక సంక్షేమ, సచివాలయ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మండిపడ్డారు. శుక్రవారం ఒంగోలులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహమైన ఆనందన నిలయాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారీయాతో కలిసి తనిఖీచేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రజలు ఛీత్కరించుకున్నా వైసీపీ తీరు ఇంకా మారలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

జూన్‌లోపు ముచ్చటగా మూడు

(మొదటి పేజీ తరువాయి)

అమలులో వెనక్కి వెళ్లకూడదని పొలిట్‌బ్యూరోలో నిర్ణయించామన్నారు. టీడీపీ మేనిఫెస్టోపై ముఖ్యమంత్రి ఈ సమావేశంలో గంటన్నర పాటు చర్చించి ప్రతి హామీపై సమీక్ష చేశారని తెలిపారు. 'మత్స్యకార భరోసా కింద చేపలవేట నిషేధం సమయంలో గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులకు రూ.10వేల చొప్పున ఇచ్చింది. మేం రూ.20వేలు ఇస్తాం. నిషేధం ప్రారంభమయ్యే ఏప్రిల్ 15కంటే ముందే ఈ మొత్తం జమచేస్తాం. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి వాటిని కూడా వీలు వెంబడి అమలు చేస్తాం. ఇప్పటికే కొన్ని హామీలు అమలుచేశాం. ఏటా రూ.32వేల కోట్లతో 64లక్షల మంది లబ్ధిదారులకు నెలకు రూ.4వేల వంతున ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఇస్తున్నాం. దివ్యాంగుల పెన్షన్ రూ.6వేల నుంచి 15 వేలకు పెంచి ఇస్తున్నాం. లాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేశాం. 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేయబోతున్నాం. అన్న క్యాంటీన్లు పునరుద్ధరించాం. దీపం పథకం కింద ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఇంకా బలంగా చేస్తాం. ఇప్పటికే 70 శాతం హామీలు అమలు చేయగలిగాం' అని వివరించారు. ప్రఖ్యాత కిమ్స్ ఆస్పత్రి అమరావతిలో మెడికల్ కళాశాల, డీమ్డ్ మెడికల్ యూనివర్సిటీ పెట్టడానికి ముందుకొచ్చిందని సీఎం చెప్పారు. వినుకొండలో తమకున్న 700 ఎకరాల్లో వైద్య రంగానికి సంబంధించిన వివిధ విభాగాల వారికి శిక్షణ ఇవ్వడానికి భారీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కూడా ఆ సంస్థ నిర్ణయించిందని, లక్షల ఉద్యోగాలు కల్పిస్తామందని తెలిపారు.

పొలిట్‌బ్యూరో నిర్ణయాలివీ..

- డాక్టర్ సుధాకర్‌కు వేధింపులు, ఆయన మరణం.. మాచర్లలో జరిగిన చంద్రయ్య రాజకీయ హత్య మొదలైనవాటిపై విచారణ జరిపి బాధ్యులను శిక్షించడానికి ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర బడుగు వర్గాల వారిని ఊచకోత కోసిన సంఘటనలు ఈ ట్రైబ్యునల్ పరిధిలోనికే.
- రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహం శిరస్సు ఖండించడం, అంతర్వేదిలో రథం దహనం సహా ఆలయాలపై దాడుల వెనుక ఎవరున్నారో తేల్చి శిక్షించడానికి ప్రత్యేక కార్యాచరణ.
- ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పాత్రికేయులు వంటివారిపై మోపిన అక్రమ కేసులపై పరిశీలన జరిపి ఎత్తివేత.
- టీడీపీ కార్యకర్తలు, నాయకులకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బిల్లులు త్వరగా చెల్లించాలని నిర్ణయం.
- కింది స్థాయిలో ప్రజల నుంచి వినతులను స్వీకరించి వాటిని సత్వరం పరిష్కరించడానికి ప్రతి ఎమ్మెల్యే ప్రతి శనివారం విజ్ఞప్తుల కార్యక్రమం నిర్వహిస్తారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో రోజూ నిర్వహిస్తున్న విజ్ఞప్తుల కార్యక్రమాన్ని ఇకపై ప్రతి శనివారం మాత్రమే నిర్వహిస్తారు.
- ఇన్‌చార్జి మంత్రులు తమకు కేటాయించిన జిల్లాల్లో రెండ్రోజుల పర్యటనలు పెట్టుకోవాలి. మొదటి రోజు టీడీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని ప్రజా సమస్యలు చర్చించాలి. సాయంత్రం కూటమి పార్టీల నేతలతో సమావేశం జరపాలి. రెండో రోజు డీడీఆర్‌సీ సమావేశంలో.. ప్రజా సమస్యలపై సమీక్ష.
- అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన భూములన్నీ ప్రభుత్వ అధీనంలోకి వచ్చినందువల్ల వాటిని విక్రయించి డబ్బులు పంచే బదులు ఆ భూములనే బాధితులకు పంపిణీ చేయడంపై పరిశీలనకు నిర్ణయం.
- సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తేవడం ద్వారా ఈ ఏడాది కరెంటు కొనుగోలు ఖర్చును యూనిట్‌కు 35 పైసల వరకు తగ్గించడానికి ప్రయత్నించాలి. వచ్చే ఏడాది కూడా మరో 35 పైసలు తగ్గించాలన్నది లక్ష్యం.
- ఉద్యోగుల పింఛను పథకం(సీపీఎస్)పై పరిశీలన జరిపి వారికి వీలైనంత వరకూ పాత పింఛనుతో సమానంగా కొత్త పింఛను వచ్చే మార్గాలు అన్వేషించాలి.
- ● ఈ ఏడాది మే 27 నుంచి 29వరకూ కడపలో టీడీపీ మహానాడు నిర్వహణ. చివరి రోజున భారీ బహిరంగ సభ.
- మహానాడులోపు కింది స్థాయిలో పార్టీ కమిటీల ఎన్నికలు. మహానాడు తర్వాత రాష్ట్ర కమిటీ, కేంద్ర కమిటీల నియామకం. ప్రతి 40 కుటుంబాలకు ఒకరి చొప్పున పార్టీ తరఫున కుటుంబ సారథి వ్యవస్థ ఏర్పాటు, బలోపేతానికి నిర్ణయం. పార్టీలో ప్రతి నేతా ఇందులో సభ్యుడిగా ఉండాలి.
- స్థానికసంస్థల్లో బీసీ వర్గాలకు వైసీపీ హయాంలో తగ్గిన రిజర్వేషన్లపై సమావేశంలో చర్చ. వాటిని పాత స్థాయికి తీసుకురావడానికి చిత్తశుద్ధితో పని చేయాలని నిర్ణయం.
- జిల్లాల పునర్విభజనపైనా చర్చ.. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా, పోలవరం ముంపు మండలాలు కలిపి జిల్లా ఏర్పాటుకు ఇచ్చిన హామీల అమలుపై ఆలోచన. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో పెట్టడం, మదనపల్లె మరీ దూరం కావడంపైనా పరిశీలనకు నిర్ణయం. డోన్ కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వినతి.
- కోటి సభ్యత్వాల నమోదులో ముఖ్య పాత్ర పోషించినందుకు మంత్రి లోకేశ్‌కు పొలిట్‌బ్యూరో అభినందన.
- వైసీపీ నుంచి వస్తున్న వారిని కూటమి పార్టీలు పోటీ పడి చేర్చుకోవడం కొన్ని సమస్యలు తెస్తోందని మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు చెప్పారు. దీనిపై కూటమి పార్టీలతో చర్చిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

కేంద్రానికి ధన్యవాదాలు..

రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో ఉదారంగా ఆదుకున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి పొలిట్‌బ్యూరో సమావేశం ధన్యవాదాలు తెలిపింది. అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులకు కేంద్రం నిధులిచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. వైసీపీ హయాంలో వచ్చిన చెడ్డపేరు పోగొట్టి రాష్ట్రానికి పరిశ్రమలను ఆకర్షించగలుగుతున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో రామాయపట్నం వద్ద బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీకి 2-3 నెలల్లో శంకుస్థాపన చేస్తామని.. రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడితో ఆర్సెలార్ ఉక్కు ఫ్యాక్టరీకి త్వరలోనే శంకుస్థాపన ఉంటుందని తెలిపారు.

రిజిస్ట్రేషన్ల జాతర

» రాష్ట్రవ్యాప్తంగా కార్యాలయాల కిటకిట
» శుక్రవారం ఒక్కరోజే వేలల్లో రిజిస్ట్రేషన్లు



ఒంగోలులో శుక్రవారం రాత్రి 8.30కు భారీగా ఉన్న జనం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లు, బస్టాండ్లను తలపించేలా రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు శుక్రవారం కిటకిటలాడాయి. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన క్రయ విక్రయదారులతో జాతరను తలపించాయి. ప్రభుత్వం పెంచిన భూముల మార్కెట్ ధరలు శనివారం నుంచి అమల్లోకి రావడం, రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా స్వల్పంగా పెరుగుతుండడంతో.. శుక్రవారం భారీఎత్తున రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు బారులు తీరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఒక్కరోజే వేల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఒక్క కాకినాడ జిల్లాలోనే 1,150 రిజిస్ట్రేషన్లు చేసినట్టు అంచనా. చాలాచోట్ల సర్వర్లు మొరాయించడంతో సందర్శకులు కొన్ని గంటలపాటు పడిగాపులు కాశారు. రాత్రి బాగా పొద్దుపోయే వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖకు కోట్లలో ఆదాయం వచ్చింది.

కోస్తాంధ్రలో కిటకిట

గత రెండు రోజులుగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. విజయవాడ నగరంలో గాంధీనగర్, పటమట, గుణదల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు భారీసంఖ్యలో వచ్చారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సర్వర్ నిలిచిపోయింది. సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులోకి రాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్‌ల సంఖ్య రెట్టింపయ్యింది. రిజిస్ట్రేషన్ శాఖకు వారం రోజుల వ్యవధిలోనే రూ.14 కోట్లు వచ్చినట్టు అంచనా. బాపట్ల జిల్లాలో రాత్రి వరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద కొనుగోలుదారులు బారులు తీరారు. ప్రకాశం జిల్లాలో గురు, శుక్రవారాలలో దాదాపు 1,300 రిజిస్ట్రేషన్లు జరిగాయి.

రాయలసీమలో రద్దీ

అనంతపురం జిల్లా పరిధిలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో సాధారణ రోజుల్లో 180 నుంచి 200 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ధరల పెరుగుల నేపథ్యంలో శుక్రవారం ఒక్క రోజే 698 రిజిస్ట్రేషన్లు జరిగాయి. కర్నూలు జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ఎగబడ్డారు.

ఉత్తరాంధ్రలో జోరుగా

శ్రీకాకుళం జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో రాత్రి 8గంటల వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. విశాఖ జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ సందడిగా మారాయి. విజయనగరం జిల్లాలో ఉదయం నుంచి రాత్రి వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగాయి.

వెబ్‌సైట్‌లో వివరాలు

ప్రభుత్వం పెంచిన భూముల మార్కెట్ ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 16,997 గ్రామాలు.. మున్సిపాలిటీలు, పంచాయితీలతో 9054 వార్డులలో భూముల ధరలు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో 158 గ్రామాలు, అర్బన్‌లో 145 వార్డులలో భూముల ధరలను ప్రభుత్వం తగ్గించింది. మరో 68 గ్రామాల్లో భూముల ధరల్లో ఎలాంటి మార్పులూ లేవు. వివరాలను శనివారం 10 గంటల నుంచి రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

భూమికి 'బంధనాలు'!

(మొదటి పేజీ తరువాయి)

ఏకంగా 9 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేశారు. ఇందులో 20 ఏళ్ల గడువు పూర్తికాని భూములనూ చేర్చారు. నాటి ప్రభుత్వంలో కీలక నేతలు, కొందరు అధికారులు భారీగా భూములు కొన్నారు. ఓ యజ్ఞంలా భూములను ఫ్రీహోల్డ్ చేయించారు.

కూటమి వచ్చాక..

కూటమి ప్రభుత్వం వచ్చాక 'ఫ్రీ హోల్డ్'పై విచారణకు ఆదేశించింది. ఆ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. అంటే.. అవన్నీ నిషేధిత జాబితాలోకి వెళ్లినట్లే! రాష్ట్ర స్థాయిలో డిప్యూటీ కలెక్టర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి విచారణ చేయించారు. మూడు నెలల్లో విచారణ పూర్తిచేయాలని తొలుత ఆదేశించారు. గతేడాది నవంబరు నెలాఖరుకే ఈ విచారణ ముగిసింది. సగటున ఐదు లక్షల ఎకరాలను జీవో 596కి విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేశారని, 25 వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ చేశారని విచారణాధికారులు తేల్చారు. కానీ, అక్రమాలకు బాధ్యులెవరో రెవెన్యూశాఖ తేల్చలేదు. దీంతో అక్రమాలపై స్పష్టత లేకుండా పోయింది. నిజానికి అక్రమాలకు బాధ్యులెవరో గుర్తించడం రెవెన్యూశాఖకు కష్టమైన పని కాదు. కానీ రెవెన్యూ శాఖ ఈ విషయంలో నోరువిప్పడం లేదు. జగన్ హయాంలో జరిగిన అక్రమాలను సరిదిద్దాల్సిందే. భూముల దొంగల భరతం పట్టాల్సిందే. అయితే... అప్పట్లో 'ఫ్రీ హోల్డ్' చేసిన భూముల్లో సామాన్య రైతులవీ ఉన్నాయి. కూటమి సర్కారు నిర్ణయం కారణంగా ఇప్పుడు వారి భూముల రిజిస్ట్రేషన్లూ ఆగిపోయాయి. విచారణ సందర్భంగా తొలుత మూడు నెలలే ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు ఉండవని ప్రభుత్వం పేర్కొంది. కానీ, ఆ తర్వాత సెప్టెంబరులో ఒకసారి, అక్టోబరులో మరోసారి గడువు పెంచారు. నవంబరు, డిసెంబరులోనూ ఇలానే చేశారు. ఇప్పుడు ఏకంగా మరో మూడు నెలల పాటు రిజిస్ట్రేషన్లకు బ్రేకులు వేశారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. నిజానికి అక్రమాలను గుర్తించడం కోసమే రిజిస్ట్రేషన్లు ఆపారు. అధికారుల విచారణలో జీవో 596 ఉల్లంఘనలు బయటకొచ్చాయి. ఏ భూములను నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించారో తేటతెల్లమైంది. వాటి వరకు రిజిస్ట్రేషన్‌లు నిలిపేయవచ్చు. కానీ, ఆ పనిచేయకుండా అందరికీ ఇబ్బంది కలిగేలా భూములన్నింటి రిజిస్ట్రేషన్ నిలిపివేయడంతో చిన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికైనా సరిదిద్దాలి!

"అక్రమాలు కనిపెట్టేందుకు రెవెన్యూశాఖకు ప్రభుత్వం 3నెలల గడువు ఇచ్చింది. రిజిస్ట్రేషన్‌లు నిలిపివేసింది. 7 నెలలవుతున్నా ఈ ప్రక్రియను కొలిక్కి తీసుకురాలేదు. రిజిస్ట్రేషన్ల నిలిపివేత గడువును పొడిగించడం సరికాదు. ఇది చిన్నకారు రైతులకు ఇబ్బంది. ప్రభుత్వం ఈ విషయంలో తక్షణమే ఓ నిర్ణయం తీసుకోవాలి" - రామయ్య, రెవెన్యూ నిపుణుడు

ఆంధ్రజ్యోతి

ఆమదాలవలసలో థర్మల్ విద్యుత్కేంద్రం

- 1600 ఎకరాల్లో రూ.30,000 కోట్లతో నిర్మాణం
- ఎమ్మెల్యే కూన ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నియోజకవర్గంలో థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి చురుగ్గా సన్నాహాలు జరుగుతున్నాయి. ఆమదాలవలసలోని 1600 ఎకరాల్లో నాగావళి-వంశధార నదుల మధ్యలో, రైల్వే ట్రాక్.. గ్రిడ్‌కు సమీపాన రూ.30,000 కోట్ల అంచనా వ్యయంతో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు థర్మల్ విద్యుత్తు యూనిట్లను స్థాపించేందుకు ఏపీజెన్కో ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేశారు. దీంతో జెన్కో ఈ ప్రాజెక్టును స్థాపించేందుకు అనువైన ప్రదేశం కోసం సర్వే చేపట్టింది. మరో 40 రోజుల్లో సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయనున్నది. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆమదాలవలసలో 1600 ఎకరాల్లో బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్కేంద్రాన్ని నెలకొల్పాలంటూ చంద్రబాబును అభ్యర్థించారు. ఈ ప్లాంటు ఏర్పాటుతో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని విన్నవించారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలను కేంద్ర మంత్రి, స్థానిక లోక్‌సభ సభ్యుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకువెళ్లారు. ఈ ప్రతిపాదన ఎప్పటినుంచో ఉందని రామ్మోహన్ నాయుడు చెప్పారు. రైల్వే లైన్ సమీపంలోనే ఉందని, విద్యుత్తు గ్రిడ్ కూడా దగ్గరలోనే ఉందని చెప్పారు. బొగ్గు ఆధారిత విద్యుత్తు పరిశ్రమకు రైల్వేలైన్ సమీపంలో ఉంటే రవాణా చార్జీల భారం తగ్గుతుందని ఏపీజెన్కో అధికారులు వివరించారు. బొగ్గు సరఫరాకు ఇబ్బంది లేకుండా కోల్ ఇండియాతో మాట్లాడతానని, ప్రత్యేక రైల్వే ట్రాక్ వేసేందుకూ, వ్యాగన్ల కోసం రైల్వే మంత్రిత్వశాఖతో మాట్లాడతానని రామ్మోహన్ నాయుడు వివరించారు. దీంతో ఆమదాలవలసలో 3200 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ విద్యుత్కేంద్రాన్ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి ఆమోద ముద్ర వేశారు. ఎమ్మెల్యే రవికుమార్‌తో కలసి ఇటీవల థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మించే ప్రాంతంలో ఏపీజెన్కో అధికారులు పర్యటించి సర్వే చేశారు. డీపీఆర్ సిద్ధమైన వెంటనే, పెట్టుబడి కోసం ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకుంటామన్నారు.

'శాశ్వత రిజిస్ట్రేషన్'పై చల్లారని రగడ!

- సమస్యను చంద్రబాబుకు వివరించిన విద్యార్థులు
- కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సీఎం హామీ

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించిన విద్యార్థులు, ఏపీ మెడికల్ కౌన్సిల్(ఏపీఎంసీ) మధ్య వివాదం సీఎం చంద్రబాబు వద్దకు చేరింది. తమకు ఏపీఎంసీ శాశ్వత రిజిస్ట్రేషన్లు చేయట్లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అయితే నేషనల్ మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాలకు అనుగుణంగానే నిర్ణయం తీసుకుంటామని ఏపీఎంసీ, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కొంతమంది విద్యార్థులు సీఎం చంద్రబాబును కలిసి, సమస్యలను వివరించారు. వారి సమస్యలను విన్న సీఎం.. విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. కొవిడ్‌తో పాటు రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా కొంతమంది వైద్య విద్యార్థులు కోర్సు మధ్యలోనే స్వదేశానికి తిరిగొచ్చారు. మిగిలిన కోర్సును ఆన్‌లైన్‌లో పూర్తిచేశారు. నిబంధనల ప్రకారం విదేశాల్లో వైద్య విద్య అభ్యసించినవారు భారత్‌లో ఇంటర్న్‌షిప్, పీజీ కోర్సుల్లో చేరాలంటే ప్రత్యేక పరీక్షలో అర్హత సాధించాలి. అయితే కొవిడ్, యుద్ధం ప్రత్యేక పరిస్థితులు కావడంతో వీరికోసం 2023 నవంబరు 22న ఎన్ఎంసీ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. చివరి ఏడాది ఆన్‌లైన్‌లో వైద్య విద్య చదివినవారు ఆయా రాష్ట్రాల్లో రెండేళ్ల పాటు ఇంటర్న్‌షిప్ చేయాలని నిబంధన విధించింది. ఈ మేరకు ఏపీఎంసీ అధికారులు విద్యార్థులకు లేఖ ద్వారా స్పష్టత ఇచ్చారు. అయితే ఏడాది ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన తర్వాత శాశ్వత రిజిస్ట్రేషన్ ఇవ్వాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు. ప్రస్తుతం ఇంటర్న్‌షిప్‌లో ఉన్న విద్యార్థులు ఎన్ఎంసీ నిబంధనలు పాటించడానికి నిరాకరిస్తూ, తాము చదువుకున్న విదేశీ వర్సిటీల నుంచి తెచ్చిన కాంపెన్సేటరీ లేఖలు అంగీకరించాలని కోరుతున్నారు. అయితే ఆ లేఖల్లో వారు కోర్సులు పూర్తిచేసినట్లు స్పష్టంగా పొందుపరచలేదు. దీంతో విద్యార్థులకు శాశ్వత రిజిస్ట్రేషన్లకు ఎన్ఎంసీ అంగీకరించడం లేదు.

అరకు చలి ఉత్సవం అదిరే ఆరంభం


అరకు ఉత్సవ్ ప్రధాన వేదికపై శుక్రవారం సాయంత్రం కొమ్ము నృత్యం


కార్నివాల్‌లో డ్యాన్స్ చేస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయ ప్రదర్శనలు.. ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్ రైడ్

అరకులోయ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో 'చలి ఉత్సవ్-25' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేశ్‌కుమార్ ఉత్సవ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. మూడు రోజులపాటు నిర్వహించే అరకు ఉత్సవ్‌ను స్థానికులు, పర్యాటకులు ఆస్వాదించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలిరోజు శుక్రవారం గిరిజన సంప్రదాయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం 5కే రన్, స్థానిక గిరిజన మ్యూజియం ఆవరణలో ముగ్గులు, పెయింటింగ్ పోటీలు, సాయంత్రం కార్నివాల్ నిర్వహించారు. సాయంత్రం ఆరు నుంచి రాత్రి 10 గంటల వరకూ వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ఉత్సవ్ ప్రధాన వేదిక (అరకులోయ డిగ్రీ కళాశాల మైదానం) వద్ద ఆదివాసీలు, ఇతరుల చేతివృత్తుల ఉత్పత్తులతో 25 స్టాళ్లను ఏర్పాటుచేశారు. ఈ చలి ఉత్సవ్‌లో హెలికాప్టర్ రైడ్ మొత్తం కార్యక్రమానికే ఓ ప్రత్యేకతగా నిలిచింది. సందర్శకులను హెలికాప్టర్‌లో సుమారు ఐదు, నిమిషాలు అరకులోయ పరిసరాల్లో తిప్పారు. మాడగడ సన్‌రైజ్ హిల్స్ వద్ద టెండమ్ గ్లైడింగ్, పారా గ్లైడింగ్, పద్మాపురం గార్డెన్‌లో హాట్ ఎయిర్ బెలూన్ అందుబాటులో ఉంచారు. శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో పర్యాటకులు విచ్చేస్తారని అధికారులు భావిస్తున్నారు.


కార్నివాల్‌లో థింసా నృత్యం చేస్తున్న అల్లూరి జిల్లా గిరిజన మహిళలు


పర్యాటకుల కోసం ఏర్పాటుచేసిన హెలికాప్టర్

సైబర్ నేరగాళ్ల భరతం పడతాం

- 200 మంది కమాండోలతో కట్టడి
- శాంతిభద్రతల నిర్వహణలో ఏఐ
- సోషల్ సైకోలపై ఉక్కుపాదం
- డీజీపీ హరీశ్ గుప్తా ప్రకటన


రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపడుతున్న హరీశ్ గుప్తా, పక్కన మాజీ డీజీపీ ద్వారకా తిరుమల రావు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సైబర్ నేరాలు సవాలుగా పరిణమించాయని, వాటి కట్టడికి సైబర్ కమాండోలను రంగంలోకి దింపుతున్నట్లు నూతన డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. 200 మంది పోలీసులకు కాన్పూర్ ఐఐటీలో అత్యంత అధునాతన శిక్షణ ఇప్పించి సైబర్ నేరగాళ్ల భరతం పడతామని హెచ్చరించారు. ఏపీ పోలీసింగ్‌ను ఏఐ పోలీసింగ్‌గా మార్చే ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈసీ ఎంపిక చేసిన డీజీపీగా సార్వత్రిక ఎన్నికలు సమర్థంగా నిర్వహించిన ఆయన శుక్రవారం రెండోసారి పోలీస్ బాస్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, విజన్-2047 లక్ష్య సాధనలో శాంతిభద్రతల నిర్వహణ కీలకమని, ఏపీ పోలీసింగ్‌ను ఆ దిశగా తీసుకెళ్తానని తెలిపారు. అస్త్రం పేరుతో బెజవాడ పోలీసులు తీసుకొచ్చిన యాప్ సత్ఫలితాలను ఇస్తోందని, ట్రాఫిక్ సమస్యలకు గూగుల్‌తో అనుసంధానమై వారు చేస్తున్న కృషి ప్రజల్లో పోలీసుల పట్ల గౌరవాన్ని పెంచిందన్నారు. పల్నాడు పోలీసులు డిజిటల్ బారికేడ్స్ ఈ కోవలోకే వస్తాయని వివరించారు. డయల్ 100, 1930, 112 నంబర్లకు వచ్చే కాల్స్‌కు స్పందించే సమయాన్ని తగ్గించి నేరాల నియంత్రణకు కృషిచేస్తామని చెప్పారు. సోషల్ మీడియా సైకోలపై ఇప్పటికే పోలీసు శాఖ కఠినంగా ఉందని, హద్దులు మీరి దూషణలకు దిగితే ఉక్కుపాదం మోపుతామన్నారు.

పారదర్శకత లేకుంటే ఇబ్బందులు తప్పవు

'రాష్ట్రంలో ప్రభుత్వ పెద్ద టెక్నాలజీ గురించే ఎక్కువ తపన పడుతున్నారు.. ప్రజల సంతృప్తే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు.. వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు, ప్రజల నుంచి సంతృప్తి వివరాల సేకరణ దీనికి నిదర్శనం. పోలీసింగ్‌లోనూ ఇది తప్పదు.. ఎవరైనా వాట్సాప్‌లో పోలీసుల గురించి పోస్టు చేస్తే అది నేర నియంత్రణ కోసం చేపట్టిన చర్యగానే ఉండాలి తప్ప పాత పద్ధతిలో ఉంటే ఇబ్బందులు తప్పవు.. ఇవన్నీ గుర్తించి మిమ్మల్ని మీరు సంస్కరించుకోండి.. క్షేత్రస్థాయి సిబ్బందిలోనూ మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నించండి. ఏపీ పోలీస్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉంటుంది' అని నూతన డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సూచించారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శుక్రవారం సాయంత్రం డీజీపీగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన జిల్లా ఎస్పీలు, డీఐజీలు, పోలీసు కమిషనర్లు, సీనియర్ ఐపీఎస్‌లతో సమీక్షించారు.



తిరుమలరావుకు ఘనంగా వీడ్కోలు

పదవీ విరమణ చేసిన ద్వారకా తిరుమలరావుకు పోలీసు ఉన్నతాధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం మంగళగిరి పోలీసు బెటాలియన్‌లో విదాయ్ పరేడ్ నిర్వహించి పోలీసు శాఖకు చేసిన సేవల్ని కొనియాడారు. తిరుమలరావు మాట్లాడుతూ 35ఏళ్ల శరీరంపై ఉన్న యూనిఫామ్‌ను వదిలిపెట్టడం బాధగా ఉందన్నారు. తిరుమలరావును పూల జీపుపై గౌరవంగా హెడ్ క్వార్టర్స్ నుంచి తీసుకొచ్చి సాగనంపారు.


కొండల్లో ఇరుక్కుపోయిన కంటెయినర్‌ను ఎక్స్‌కవేటర్ల సాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

గూగుల్‌ను నమ్ముకొని కొండల్లోకి..

యాడికి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గూగుల్ తల్లిని నమ్ముకొని ఓ కంటెయినర్ లారీ డ్రైవర్ దారితప్పాడు. కొండల్లోకి వెళ్లి వాహనాన్ని గోతుల్లోకి దింపాడు. రాత్రంతా బిక్కుబిక్కుమంటూ అక్కడే గడిపి.. ఉదయాన్నే స్థానికుల సాయంతో బయటపడ్డాడు. అనంతపురం జిల్లా యాడికి మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కర్ణాటకలోని చిక్కమంగళూరు నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి ఐరన్ ఓర్ కంటెయినర్ లారీ బయల్దేరింది. డ్రైవర్ ఫరూక్‌కు అడ్రస్ తెలియక స్మార్ట్‌ఫోన్‌లో గూగుల్ మ్యాప్ పెట్టుకొని వచ్చాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో మ్యాప్ సూచించిన విధంగా డ్రైవ్ చేసుకుంటూ యాడికి మండలంలోని కొండల్లో ఉన్న రామన్న గుడిసెలు గ్రామ సమీపానికి వెళ్లాడు. అక్కడ లారీ అదుపుతప్పి గోతిలో ఇరుక్కుపోవడంతో రాత్రంతా అక్కడే గడిపాడు. శుక్రవారం ఉదయం రెండు ఎక్స్‌కవేటర్లను తెప్పించి కంటెయినర్ లారీని బయటకు తీయించారు.

ఆన్‌లైన్ గేమ్స్ వద్దనందుకు తల్లిపై కత్తి


మృతురాలు ఆల్కాసింగ్

- ఆమె అక్కడికక్కడే మృతి..
- అతడికి మతిస్థిమితం లేదంటున్న బంధువులు
- విశాఖ కోస్ట్‌గార్డు కమాండర్ ఇంట్లో విషాదం

మల్కాపురం(విశాఖపట్నం), జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని మందలించడంతో తల్లిపై కత్తిదూశాడో యువకుడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. విశాఖలోని మల్కాపురం కోస్ట్‌గార్డు ప్రధాన కార్యాలయ క్వార్టర్స్‌లో గురువారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన బల్బీర్ సింగ్ గత ఏడాది అక్టోబరులో బదిలీపై విశాఖ కోస్ట్‌గార్డు కమాండర్‌గా వచ్చారు. మల్కాపురం సమీప కోస్ట్‌గార్డు ఆఫీసర్స్ క్వార్టర్స్ లో భార్య ఆల్కాసింగ్(47), పెద్ద కుమారుడు హనుమాన్‌సింగ్(20), చిన్న కుమారుడు ఆయూష్మాన్‌సింగ్‌లతో ఉంటున్నారు. హనుమాన్‌సింగ్ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడిన అతడు జనవరి 27న తల్లిదండ్రులిద్దరి ఖాతాల నుంచి చోరో రూ.15వేలు డ్రా చేసి, ఆన్‌లైన్ గేమ్స్‌లో పోగొట్టాడు. విషయం తెలిసి తల్లిదండ్రు లు అతడి వద్దనున్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను లాక్కుని దాచిపెట్టారు. మర్నాడు బల్బీర్‌సింగ్ విధుల నిమిత్తం ఒడిశాలోని బరంపురం వెళ్లగా, తన సెల్ ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వాలని తల్లిపై ఒత్తిడి తెచ్చాడు. అందుకామె ససేమిరా అనడంతో బెడ్‌రూంలో ఉన్న తల్లిపై హనుమాన్‌సింగ్ కత్తితో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో ఆ గదికి తాళం వేసి ఏమీఎరగనట్టు ఉండిపోయాడు. సాయంత్రం కాలేజీ నుంచి వచ్చిన చిన్నకొడుకు తల్లి గురించి అడగ్గా ఇంట్లో లేదని హనుమాన్‌బదులిచ్చాడు. తండ్రికి చిన్నకొడుకు ఫోన్ చేసి చెప్పగా, ఆయన కోస్ట్‌గార్డు సెక్యూరిటీ గార్డులకు సమాచారం అందించారు. గార్డులు వెళ్లి తాళం వేసి ఉన్న బెడ్‌రూంను తెరిచిచూస్తే, లోపల ఆల్కాసింగ్ రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించారు. మరోవైపు హనుమాన్‌సింగ్‌కు మతిస్థిమితం సరిగ్గా లేదని బంధువులు చెబుతున్నారు. బీటెక్ చదువుతున్నా హనుమాన్‌సింగ్ అప్పుడప్పుడూ ఇంట్లో దుస్తులు లేకుండా తిరిగేవాడని పనిమనిషి వెల్లడించింది.

మంగళగిరిలో మినీ దుబాయ్!

(మొదటి పేజీ తరువాయి)

వెలుగొందుతోంది. రూ.50 వేలకోట్ల పెట్టుబడులతో దాదాపు లక్షమందికి ఉపాధి కల్పిస్తోంది. ముంబైలోని జ్యూయలరీ పార్కుకు దీటుగా మంగళగిరిలో అతిపెద్ద జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేశ్ పట్టుదలగా ఉన్నారు. లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరిలో గోల్డ్‌హబ్ నిర్మాణానికి వేగంగా కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో స్వర్ణకార వృత్తిదారులు గణనీయంగా ఉండడంతో ఆయన ఎన్నికల సమయంలో ఈ హామీ ఇచ్చారు. స్వర్ణకారులకు చేతినిండా పని ఉండేలా చేయడంతో పాటు ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తగిన చర్యలు చేపడతామని చెప్పారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజు నుంచే ఈ దిశగా కార్యాచరణ మొదలు పెట్టారు.

60 ఎకరాల ఎంపిక

మంగళగిరిలోని తెనాలి రోడ్డు వెంబడి అక్షయ పాత్ర భవన సముదాయానికి దక్షిణంగా ఆత్మకూరు ప్రాంత పరిధిలోకి వచ్చే భూముల్లో గోల్డ్ హబ్ ఏర్పాటు చేయబోతున్నారు. ఆత్మకూరు సర్వే నంబర్లు 133, 134, 135, 136లలో ఉన్న ప్రభుత్వ ఖాళీ, ఎసైన్డ్ భూముల్లో జిల్లా అధికారులు సుమారు 60 ఎకరాలను ఎంపిక చేశారు. రెండు మూడు మాసాలలో జ్యూయలరీ పార్కు నిర్మాణ పనులను ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం కావాలని మంత్రి లోకేశ్ ఇప్పటికే ఆదేశించారు. ఇక్కడ ఎక్కువగా ఉన్న చేనేత కార్మికుల కోసం మెగా హ్యాండ్లూమ్ పార్కు, స్వర్ణకార వృత్తిదారుల కోసం జ్యూయలరీ పార్కును ఏకకాలంలో నిర్మించే విధంగా లోకేశ్ అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం 12 వేలమంది స్వర్ణకార వృత్తిదారులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో జ్యూయలరీ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. తరువాత దీనిని అంచెలంచెలుగా అతి పెద్ద గోల్డ్‌హబ్‌గా అభివృద్ధి చేస్తారు. రాబోయే రోజుల్లో మంగళగిరిలో ఓ మినీ దుబాయ్ ఆవిర్భవించనుంది!


మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన గోల్డ్‌స్మిత్ ఫౌండేషన్ భవనం

ప్రత్యేకతలు ఏంటంటే...

మంగళగిరిలో ఏర్పాటు చేయనున్న గోల్డ్‌హబ్‌లో రత్నాలు, బంగారంతో కూడిన ఆభరణాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత నైపుణ్యంగా తయారు చేస్తారు. ఈ ఆభరణాలకు తరుగు కూడా చాలా తక్కువస్థాయిలోనే ఉంటుంది. సాధారణంగా వృత్తిదారులు, వ్యాపార సంస్థలు తరుగును పదిశాతంగా లెక్కిస్తుంటాయి. కానీ ఈ పార్కులో కొనుగోలుదారులకు తరుగు దాదాపు మూడు శాతంగా మాత్రమే ఉండే అవకాశముంది. ఇదో పెద్ద వెసులుబాటు కానుంది. ఇక్కడ ముక్కుపుడక నుంచి వడ్డాణం వరకు అన్నిరకాల మోడళ్లలో ఆభరణాలను చాలా తొందరగా తయారు చేయనున్నారు. ఇందుకు అవసరమైన అత్యాధునిక మిషనరీ అంతా పార్కులో అందుబాటులో ఉంటుంది. ఎన్ఏబీఎల్ గుర్తింపు పొందిన టెస్టింగ్ ల్యాబ్‌లతో సహా అవసరమైన సౌకర్యాలన్నీ ఉంటాయి. ఈ జ్యూయలరీ పార్కు నుంచి ఎగుమతులు కూడా అంతర్జాతీయస్థాయిలో ఉంటాయి. రాష్ట్రం నుంచే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద పెద్ద జ్యూయలరీ షోరూమ్‌ల నుంచి భారీగా ఆర్డర్లు తీసుకుని సరికొత్త మోడళ్లలో అన్నిరకాల బంగారు, రత్నాలతో కూడిన ఆభరణాలను తయారు చేసి ఇస్తారు. అంతర్జాతీయ స్థాయిలో కొత్తగా వచ్చే అన్నిరకాల మోడళ్లను ఇక్కడి నిపుణులైన డిజైనర్లు రూపొందిస్తారు.

ఏవేవి ఉంటాయంటే...

ఈ జ్యూయలరీ పార్కులో పరిపాలనా భవనం, హాల్‌మార్కింగ్ సెంటర్, గోల్డ్ వాల్ట్, సర్టిఫికేషన్ సెంటర్, లేజర్ ఎన్‌గ్రేవింగ్ సెంటర్, కో-ఆపరేటివ్ డిస్‌ప్లే సెంటర్, కేడ్‌తో కూడిన డిజైన్ సెంటర్, బిజినెస్ సెంటర్, ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ నోడల్ ఏజెన్సీ, క్లియరింగ్ ఏజెంట్ ఆఫీసెస్, ఫైర్ స్టేషన్, సెక్యూరిటీ భవనం, డిస్పెన్సరీ, నీటి సరఫరా కేంద్రంతో పాటు ట్రీట్‌మెంట్ ప్లాంటు, ఎస్టీపీ, ఈటీపీ, సర్వీస్ బ్లాకు, ఇంటర్నల్ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్, పైపులతో కూడిన గ్యాస్ బ్యాంకు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు. అలాగే వివిధ మెగా షోరూమ్‌లకు చెందిన షాపులను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు.

స్వర్ణకారులకు శిక్షణ

ఈ జ్యూయలరీ పార్కు కోసం స్వర్ణకారులను ముందుగానే సిద్ధం చేయనున్నారు. మంత్రి లోకేశ్ సొంత ఖర్చులతో ఎల్ఎన్ గోల్డ్‌స్మిత్ ఫౌండేషన్ పేరిట ఓ సంస్థను స్థాపించి మంగళగిరిలోని స్వర్ణకారులందరికీ ఆధునిక డిజైన్ల తయారీపై శిక్షణ ఇప్పించబోతున్నారు. ఇందుకోసం నగరంలోని గౌతమబుద్ధ రోడ్డులో ఐదు అంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఈ ఫౌండేషన్ కోసం గుంటి నాగరాజు, గాజుల శ్రీనివాసరావు, పడవల మహేశ్, మండవ హారికలతో డైరెక్టర్ల బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో 77 మంది సభ్యులుగా ఉన్నారు. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 670 మంది స్వర్ణకారులకు ఉచితంగా శిక్షణ ఇస్తారు. పూర్తి చేసుకున్న వృత్తిదారులకు పని కల్పించే బాధ్యతను కూడా లోకేశ్ వ్యక్తిగతంగా తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ బంగారు నగల షోరూమ్‌ల నుంచి ఆర్డర్లను గోల్డ్‌స్మిత్ ఫౌండేషన్‌కు ఇప్పించేందుకు ఆయన కృషి చేస్తున్నారు.



రథసప్తమికి అరసవల్లి ముస్తాబు

రథసప్తమి వేడుకలకు అరసవల్లి ముస్తాబైంది. ఆదిత్యుని ఆలయ పరిసరాలతోపాటు నగరమంతటా విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రభుత్వం దీనిని రాష్ట్ర పండుగగా గుర్తించి ఏర్పాట్లు చేసింది. ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. - శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి

హైకోర్టు నిర్ణయంపై జోక్యం చేసుకోం

- టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో 33 మందికి సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన 33 మందికి చుక్కెదురైంది. హైకోర్టు నిర్ణయంలో తాము జోక్యం చేసుకోబోమని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఈ కేసులో 33 మంది ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా ట్రయల్ కోర్టుకే వెళ్లాలని ఆదేశిస్తూ, పిటిషన్ కొట్టివేసింది. హైకోర్టు నిర్ణయాన్ని జనవరి 28న తోట వెంకటేశ్వరావుతోపాటు మరో 32 మంది సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ట్రయల్ కోర్టు అందుబాటులో ఉండగా హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిన అవసరం ఏముందని ధర్మాసనం ప్రశ్నించింది. ట్రయల్ కోర్టును ఆశ్రయించడానికి రెండు వారాల గడువు ఇచ్చింది. ఈలోపు ఎలాంటి కఠిన చర్యలూ తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హాజరయ్యారు.

'ఆడుదాం ఆంధ్ర'లో వైసీపీ కుంభకోణం: శాప్

నంద్యాల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల పేరుతో రూ.కోట్ల కుంభకోణానికి పాల్పడిందని శాప్(ఏపీ స్పోర్ట్స్ అథారిటీ) ఛైర్మన్ అనిమిని రవినాయుడు విమర్శించారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన మాట్లాడారు. 'జగన్ ప్రభుత్వం రూ.199 కోట్లు ఆడుదాం.. ఆంధ్రకు కేటాయించి, పట్టుమని రూ.20 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి నేతృత్వంలో గత శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, మంత్రి హోదాలో రోజా కుమ్మక్కై ఈ కుంభకోణానికి పాల్పడ్డారు. రూ.29 కోట్లు అవినీతి జరిగిందని గుర్తించి సీఐడీ, విజిలెన్సు అధికారులకు నేనే స్వయంగా ఆధారాలతో ఫిర్యాదు చేశాను' అని తెలిపారు. త్వరలోనే రూ.18 కోట్లతో స్పోర్ట్స్ మెటీరియల్ టెండర్లను పిలిచి హైస్కూల్‌తో పాటు ప్రాథమిక పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేస్తామన్నారు.

ఉద్యోగులకు నిరాశే మిగిలింది: బొప్పరాజు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రభుత్వ ఉద్యోగులు ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. కానీ వారికి నిరాశే మిగిలింది' అని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఒంగోలులో ఆయన మాట్లాడారు. 'బకాయిలు విషయాన్ని ఈ ప్రభుత్వం పట్టించుకోలేదు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ రాకపోగా, పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లోనూ స్పందన లేదు' అని తెలిపారు.

ఆత్మహత్యా.. తుపాకీ మిస్ ఫైరా?


సత్యనారాయణ మూర్తి

పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్ఐ అనుమానాస్పద మృతి

మూడు నెలలుగా వీఆర్‌లో..

తణుకు రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తణుకు రూరల్ ఎస్ఐగా పనిచేసిన ఆదుర్తి గంగ సత్యనారాయణ మూర్తి(38) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయన తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నారా? లేక మిస్ ఫైర్ అయ్యిందా? అనే దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. మూర్తి తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఉదయం నుంచి పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే తుపాకీ మిస్ ఫైర్ అయ్యిందని జిల్లా ఎస్పీ నయీం అస్మి చెప్పడం గమనార్హం. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం గ్రామానికి చెందిన సత్యనారాయణమూర్తికి భార్య విజయలక్ష్మి, కుమారుడు చందన్(5), కుమార్తె హేమాన్వి(16 నెలలు) ఉన్నారు. 2012 బ్యాచ్‌కు చెందిన మూర్తి కృష్ణా జిల్లాలో ఎస్ఐగా చేరి, పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, పాలకోడేరు, ఆచంట, పెరవలి స్టేషన్లలో ఎస్ఐగా చేశారు. గత ఏడాది జూలైలో తణుకు రూరల్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. గతంలో జరిగిన గేదెల దొంగతనానికి సంబంధించిన కేసు రికవరీలో జరిగిన అవకతవకల వ్యవహారంలో ఉన్నతాధికారులు మూర్తిని నవంబరులో వీఆర్‌కు పంపారు. పెనుగొండలో సీఎం చంద్రబాబు పర్యటనకు బందోబస్తు డ్యూటీ పడటంతో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మూర్తి డ్యూటీ డ్రెస్‌లో తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. రివాల్వర్ తీసుకుని వాష్ రూమ్‌కు వెళ్లారు. ఎంతకీ బయటకు రాకపోవడంతో సిబ్బంది వెళ్లి చూడగా.. మూర్తి రక్తపు మడుగులో పడి ఉన్నారు. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించి, ఆయన్ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మూర్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ మృతికి పోలీసులు, ఓ న్యూస్ చానలే కారణమని ఆయన బంధువులు ఆరోపించారు.

తుపాకీ మిస్ ఫైర్: ఎస్పీ

ఎస్ఐ మూర్తి మృతిపై విచారణ చేపడతామని జిల్లా ఎస్పీ నయీం అస్మీ తెలిపారు. 'ఉదయం స్టేషన్‌కు వచ్చిన మూర్తి మరుగుదొడ్డిలోకి వెళ్లారు. అక్కడ ఆయన రివాల్వర్ మిస్ ఫైర్ అయ్యింది. ఆస్పత్రికి తరలించగా మరణించినట్లు చెప్పారు.' అని పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రిలోని ఎస్ఐ భౌతికాయాన్ని ఆయన సందర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.